


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 104 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ మంగళవారం 24 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 104 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD TUE 24 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

# ప్రభుత్వం చేతికి హైదరాబాద్ మెట్రో..

## తెలంగాణ క్యాబినెట్ కీలక నిర్ణయం

- హైదరాబాద్ మెట్రో రైలుపై తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం
- హైదరాబాద్ మెట్రోను పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని నిర్ణయం
- ఎల్ అండ్ టీతో సూత్రప్రాయంగా గత ఏడాది ఒప్పందం
- రూ.13 వేల కోట్ల రుణాలను బదలాయించుకోనున్న ప్రభుత్వం





**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ మెట్రో రైలుకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. మెట్రో రైలును ఎల్ అండ్ టీ నుంచి పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని మంత్రివర్గం ఈరోజు నిర్ణయించింది. మెట్రో రైలు స్వాధీనంపై ఇదివరకే ప్రభుత్వం ప్రకటన చేసింది. స్వాధీనం చేసుకునే ప్రక్రియను పర్యవేక్షించడానికి మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్, జూపల్లి కృష్ణారావులతో ఈ ఉపసంఘాన్ని నియమించింది. గత సంవత్సరం సూత్రప్రాయంగా జరిగిన ఒప్పందంలో ఎల్ అండ్ టీకి రూ.2 వేల కోట్ల ఈక్విటీని ఏకమొత్తంగా చెల్లించాలని, రూ.13 వేల కోట్ల రుణాలను ప్రభుత్వం బదలాయించుకోవాలని అవగాహనకు వచ్చాయి. నాటి నుంచి స్వాధీన ప్రక్రియ ప్రారంభమైంది.

## మార్చి 20న తెలంగాణ బడ్జెట్: మార్చి 16 నుంచి 30 వరకు అసెంబ్లీ సమావేశాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ బడ్జెట్ సమావేశాల ముహూర్తం ఖరారు అయ్యింది. 2026, మార్చి 16 నుంచి 30వ తేదీ వరకు బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి. మార్చి 16న ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించనున్నారు. మార్చి 20న అసెంబ్లీలో ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశ పెట్టనుంది. సోమవారం (ఫిబ్రవరి 23) సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ కేబినెట్ భేటీ జరిగింది. ఈ భేటీలో బడ్జెట్ సమావేశాల నిర్వహణపై మంత్రి మండలి సుదీర్ఘంగా చర్చించింది. అనంతరం 2026, మార్చి 16 నుంచి 30వ తేదీ వరకు బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని మంత్రి మండలి సూత్రప్రాయంగా నిర్ణయించింది. తెలంగాణ వైద్య విధాన పరిషత్ పేరును డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా మారుస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. దీంతో తెలంగాణ వైద్య విధాన పరిషత్(TVVP) ఉద్యోగులు ఇకపై ప్రభుత్వ పరిధిలోకి రానున్నారు.



## తమిళనాడులో 74 లక్షల ఓట్లు తొలగింపు

- తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు మోగనున్న ఎన్నికల నగారా
- ప్రత్యేక సమగ్ర సవరణ అనంతరం తుది ఓటర్ల జాబితాను విడుదల చేసిన ఎన్నికల సంఘం
- పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికం

మిగతా 2లో



## డీఎంకేకు ఓటు వేస్తే బీజేపీకి వేసినట్లే

- ఓటమి భయంతో బీజేపీతో పొత్తు పెట్టుకోవాలని స్టాలిన్ చూస్తున్నారు: విజయ్ ఆసక్తికర వ్యాఖ్యలు
- పరిస్థితులకు అనుగుణంగా మారిపోవడం ఆ పార్టీ నేతలకు అలవాటేనని ఎద్దేవా
- ఎన్నికల్లో తనను ఓడించాలని స్టాలిన్ కుట్ర పన్నుతున్నారని విమర్శ

మిగతా 2లో



## దంచికొట్టిన వాన

### మధ్యాహ్నం వరకు మండుటెండలు

- సాయంత్రం ఒక్కసారిగా కురిసిన వర్షం
- సిటీలోని పలు ప్రాంతాలు జలమయం
- నిజామాబాద్, యాదాద్రి, జగిత్యాలలో వాన
- ఇందూరు గంజ్లో తడిసిన పసుపు బస్తాలు
- సిద్దిపేట జిల్లాలో ఈదురుగాలులతో కూడిన వర్షం

**హైదరాబాద్ పెన్ పవర్:**మధ్యాహ్నం వరకు ఉన్న మండుటెండ మాయమైంది. భారీ వర్షానికి హైదరాబాద్ లోని ప్రధాన రోడ్లు జలమయమయ్యాయి. నైరుతి బంగా ళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావం వల్లే వర్గాలు కురుస్తున్నట్లు వాతావరణశాఖ అధికారులు వెల్ల డించారు. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, మాదాపూర్, కొండాపూర్, ఎల్బీనగర్, కూకట్పల్లి, ఉప్పల్, మాసబ్యాంక్, అమీర్పేట తదితర ప్రాంతాల్లో భారీగా వర్షం కురిసింది. రోడ్లపైకి వరద నీరు రావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు. ఎదుర్కొన్నారు. కొన్నిచోట్ల ట్రాఫిక్ నిలిచి పోవడంతో ప్రయాణాలు ఆలస్యమ య్యాయి. అయితే ఎండలు, ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు మాత్రం వర్షం కొంత ఊరటనిచ్చింది. నిజామాబా ద్. సిద్ది పేట జిల్లాల్లోనూ వర్షం కురిసింది. నిజామాబాద్ మార్కెట్ యార్డుకు రైతులు తీసుకొచ్చిన పసుపు తడిసి పోయింది. సిద్ది పేట జిల్లా దుబ్బాకలో వడగండ్లు పడ్డాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల్లోనూ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధి కారులు తెలిపారు. యాదాద్రి, సంగారెడ్డి. సిరిసిల్ల, జగిత్యాల, మెదక్, సిద్దిపేట, కామా రెడ్డి, వికారాబాద్, మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో చెదురుమదురు నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు చెప్పారు. పలు ప్రాంతాల్లో పిడుగులు పడే అవకాశమున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది.



## తెలంగాణలో జనసేన పార్టీ బలోపేతం..

### పవన్ కళ్యాణ్ కీలక నిర్ణయం

- పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించనున్నట్లు వెల్లడి
- ఈ నెల 26 నుంచి 'ఉద్యమి' సభ్యత్వ నమోదు కార్యక్రమం
- జిల్లాలు, లోక్ సభ సభ్యుల వారీగా ఇన్‌ఛార్జుల నియామకం

**హైదరాబాద్ పెన్ పవర్:**జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తెలంగాణలో క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు కీలక నిర్ణయం తీసుకున్నారు.

మిగతా 2లో



## నేను తప్పు చేసినట్లు నిరూపిస్తే రాజకీయాలు వదిలేస్త

- డిగ్రీ కాలేజీ భూముల వ్యవహారం.. షబ్బీర్ అలీకి వెంకటరమణారెడ్డి ఛాలెంజ్
- ఒక్క గజం భూమిని ఆక్రమించినట్టు నిరూపించినా పదవి వదులుకుంటానన్న వెంకటరమణారెడ్డి
- అసత్య ప్రచారాలు చేస్తున్నారంటూ మండిపాటు
- పోలీసుల తీరును కూడా తప్పుపట్టిన వైనం

మిగతా 2లో

## బంగారం ధరల పెరుగుదలకు కారణం అదే



- కేంద్ర బ్యాంకులు పెద్ద మొత్తంలో బంగారాన్ని కొనుగోలు చేస్తున్నాయన్న నిర్మలా సీతారామన్
- బంగారం దిగుమతులపై ఆందోళన చెందడం లేదన్న నిర్మలా సీతారామన్
- పారిశ్రామికవేత్తలు తమ పెట్టుబడులను పెంచాలని విజ్ఞప్తి

**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రపంచంలోని ఆయా దేశాల కేంద్ర బ్యాంకులు పెద్ద మొత్తంలో బంగా రాన్ని కొనుగోలు చేస్తున్నాయని, పసిడి ధరల అనూహ్య పెరుగుదలకు ఇదే కారణమని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రాతో కలిసి

మిగతా 2లో



## ఆ విషయంలో బీఆర్ఎస్ ఫెయిల్ అయింది..

### జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాం

- జోగులాంబ గద్వాల జిల్లాలో రైతు సంఘర్షణ సభలో పాల్గొన్న కవిత
- భవిష్యత్తులో జోగులాంబ జిల్లా నుంచే కార్యక్రమాలు చేపడతామని హామీ
- నడిగడ్డను బీఆర్ఎస్ మోసం చేసిందన్న కవిత

మిగతా 2లో

## నా పేరుతో సంస్థలకు అనుమతి లేదు

- తన పేరుతో సంస్థల ఏర్పాటుపై స్పందించిన కేటీఆర్
- కేటీఆర్ సేవా సమితి, కేటీఆర్ సేవ పేరుతో కార్యకలాపాలు
- తన పేరుతో ఎలాంటి సంస్థల నిర్వహణకు అనుమతి లేదని స్పష్టీకరణ
- ఎవరైనా పని చేయాలనుకుంటే బీఆర్ఎస్ పార్టీలో కలిసి పని చేయాలని సూచన

మిగతా 2లో



## గచ్చిబౌలిలో రూ.1.76 లక్షలు పలికిన చదరపు గజం భూమి

- నగరంలోని పలు ప్రాంతాల్లో హౌసింగ్ బోర్డు భూముల వేలం
- కేపీహెచ్‌బీ కమ్యూనిటీ హాలులో 14 స్థలాల వేలం
- బాలాజీనగర్‌లో చదరపు గజం రూ.1.64 లక్షలు



**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో చదరపు గజం భూమి రూ.1.76 లక్షలు పలికింది. నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న హౌసింగ్ బోర్డు భూములను వేలం వేయగా అధిక ధరలు పలికాయి. కేపీహెచ్‌బీ కమ్యూనిటీ హాలులో నిర్వహించిన ఈ వేలంలో 50 మంది

మిగతా 2లో

## వెంటనే ఇరాన్ నుంచి బయటపడండి... భారతీయులకు కేంద్రం అలర్ట్

- ఇరాన్‌ను వెంటనే వీడాలని భారతీయులకు సూచన
- అమెరికా సైనిక దాడుల భయంతో కేంద్రం కీలక నిర్ణయం
- విద్యార్థులు, వ్యాపారులు సహా అందరికీ వర్తిస్తుందన్న ఎంబసీ
- అత్యవసర సహాయం కోసం ఫోన్ నంబర్లు, ఈమెయిల్ విడుదల
- నిరసనలకు దూరంగా ఉండాలని పౌరులకు హెచ్చరిక



**హైదరాబాద్ పెన్ పవర్:**ఇరాన్‌లో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో అక్కడున్న భారత పౌరులకు కేంద్ర ప్రభుత్వం కీలక సూచనలు జారీ చేసింది. ఇరాన్‌కు, అమెరికాకు మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్నందున, వీలైనంత త్వరగా దేశం విడిచి

మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# ఉక్రెయిన్ పై రష్యా దండయాత్రకు నాలుగేళ్లు

ప్రారంభమైన ఉక్రెయిన్‌పై రష్యా దాడులు పూర్తి యుద్ధంగా మారి నాలుగేళు దాటుతున్న వేళ, ఈ యుద్ధ మారణహోమానికి ముగింపే కనిపించడం లేదు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఐరోపాలో అతి పెద్ద సైనిక సంఘర్షణగా నిలుస్తున్నది. తీవ్ర ఆస్తి, ప్రాణ నష్టాలతో పాటు మిలియన్ల మంది స్థానభ్రంశం, మౌళిక సదుపాయాల విధ్వంసాలు నమోదు కావడం విచారకరం. ఉక్రెయిన్ అద్భుత ధైర్యసాహసాలతో, పాశ్చాత్య దేశాల మద్దతుతో రష్యా దాడులను సమర్థవంతంగా తిప్పికొడుతూ "స్టీల్ పోర్కుపైన్" రక్షణను కొనసాగిస్తున్నది. వేలాది మంది ప్రాణాలు కోల్పోవడం, మిలియన్ల కొద్దీ ప్రజలు శరణార్థులుగా మారడంతో ఒక తరం తీవ్ర మానసిక ఆందోళనకు గురిచేసింది. రష్యా బలగాలు ఉక్రెయిన్‌లోకి కీలక మౌళిక వనరులు, పవర్ గ్రిడ్‌లను లక్ష్యంగా చేసుకొని "ఇంధన ఉగ్రవాదం (ఎనర్జీ టెర్రరిజమ్)" మార్గాలను అనుసరిస్తున్నది. ఉక్రెయిన్ ప్రాంతాలను స్వాధీనం చేసుకోవడానికి రష్యా, తన సార్వభౌమాధికారాన్ని కాపడుకోవడానికి యుద్ధాన్ని కొనసాగిస్తున్నాయి. ఈ యుద్ధం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరా, ఆహార భద్రత, దౌత్య సంబంధాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నది. ఉక్రెయిన్ తన ప్రాదేశిక సమగ్రతను కాపాడకపోవడానికి, అంతర్జాత చట్టాల ప్రకారం శాంతిని కోరుకుంటూ, రష్యా దాడులకు బదులు ఇస్తున్నది. గత 27 మాసాలుగా ఇజ్రాయిల్-పాలస్తీనా యుద్ధం కాల్పుల విరమణ, యుద్ధ ముగింపుకు అంగీకారం కుదిరినట్లే కుదిరి తిరిగి ఆయుధాల మంటలు ఎగిసిపడడం కొనసాగుతోంది. ఉక్రెయిన్‌పై రష్యా దాడిలో అపార ఆస్తి, ప్రాణ నష్టాలు: ఉక్రెయిన్ - రష్యా యుద్ధంలో ఇరు పక్షాలకు చెందిన లక్షల మంది సైనికులు, సాధారణ పౌరులు ప్రాణాలు కోల్పోగా, మిలియన్ల కొద్దీ గాయపడడం, పది మిలియన్లకు పైగా ఉక్రెనియన్లు నిర్వాసితులుగా మారి శరణార్థి శిబిరాల్లో అమానవీయ దుస్థితుల్లో ప్రాణాలను బిగబట్టి ఊపిరి పీల్చుకుంటున్నారు. వివిధ అంచనాల ప్రకారం ఇప్పటి వరకు లక్ష వరకు ఉక్రెనియన్ బలగాలు చనిపోగా, 4 లక్షలకు పైగా గాయపడ్డారు. అదే విధంగా కనీసం 12.25 లక్షల రష్యా బలగాలు ప్రాణాలను కోల్పోవడం లేదా గాయపడడం జరిగినట్లు తెలుస్తున్నది. రష్యా ఆక్రమించిన భూభాగాన్ని వెనక్కి తీసుకోవడానికి ఉక్రెయిన్, ఉక్రెయిన్‌ను ఆక్రమించాలని రష్యా తమ తమ పోరాటాలను ఉధృతంగా చేస్తున్నాయి. నేడు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యుద్ధ విరమణకు చేసిన ప్రయత్నాలు పని చేయలేదు. నేటికి ఉక్రెయిన్ దాదాపు 6 లక్షల వరకు మరణించి లేదా గాయపడి ఉంటారని తెలుస్తున్నది. ఉక్రెయిన్ : రష్యా పక్షాల మరణాలు/గాయపడిన వారి నిష్పత్తి 1 : 2.5 ఉండవచ్చని తెలుస్తున్నది. నాలుగేళ్లుగా కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు కనబడడం లేదు. రష్యా ఏకపక్షంగా విలీనం చేసుకున్న నాలుగు ఉక్రెయిన్ భూభాగాలను తిరిగి ఉక్రెయిన్‌కు ఇవ్వడం జరగదని రష్యా పట్టుపడుతోంది. ఇప్పటికే ఉక్రెయిన్‌కు చెందిన 18 శాతం భూభాగం రష్యన్ నియంత్రణలోకి వెళ్లింది. ఏకపక్షంగా ఉక్రెయిన్ బలహీన దేశమంటూ రష్యా చేసిన దండయాత్రతో పుతిన్ భారీ మూల్యం చెల్లిస్తున్నారు. ఉక్రెయిన్ నాటో కూటమిలో చేరకూడదని, రష్యా రసరిహద్దుల వరకు నాటో కూటమి విస్తరణ జరగడం తమ భద్రతకు ప్రతికూలమని పుతిన్ వాదిస్తున్నారు. ఉక్తెయిన్ ఒక స్వతంత్ర దేశమే కాదని రష్యా విచిత్రంగా వాదిస్తోంది. ఉక్రెయిన్ గత చరిత్ర - యుద్ధం ప్రారంభం: 1700ల్లో రష్యా సామ్రాజ్య పాలనలో ఉన్న ఉక్రెయిన్ 1917లో రష్యా ఉద్యమంతో రష్యా సామ్రాజ్య పాలన నుంచి విముక్తమై 1922లో సోవియట్ యూనియన్‌లో భాగమై పోయింది. 1930ల్లో మిలియన్ల ఉక్తెనియన్లు కరువుకాటకాలతో ప్రాణాలను కూడా కోల్పోవడం జరిగింది. 1991లో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం కావడంతో మరో సారి ఉక్రెయిన్ స్వతంత్ర దేశంగా నిలబడింది. 2014లో క్రిమియాను రష్యా ఆక్రమించడం, ఉక్తెయిన్ వేర్పాటువాదులకు రష్యా మద్దతు ఇవ్వడం కూడా ఉక్రెయిన్ కోపానికి కారణం అయ్యింది. నాటో తన దేశాన్ని ఆక్రమించారని చూస్తున్నదని రష్యా, రష్యా నుంచి తమ దేశ ప్రాంతాలకు ప్రమాదం ఏర్పడుతున్నదని ఉక్రెయిన్ భావించడంతో యుద్ధ విరమణ దిశగా అడుగులు పడడం లేదు. ఈ వ్యాసం రాస్తున్న సమయంలో కూడా రెండు దేశాల మధ్య భీకర సాయుధ పోరు కొనసాగుతూనే ఉన్నది. రష్యాలోని మెజారిటీ ప్రజలే కాకుండా పుతిన్ లాంటి నాయకులు కూడా ఉక్రెయిన్ తమ దేశంలో భాగమే అని భావించడంతో రెండు దేశాల మధ్య విభేదాలు రోజు రోజుకు పెరగడం, చివరకు 24 ఫిబ్రవరి 2022న రష్యా పూర్తి స్థాయి దాడి చేయడంతో యుద్ధం అనివార్యం అయ్యింది. 2019లో ఉక్రెయిన్ అధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో పాటు అమెరికా, యూరోప్ దేశాల సహకారంతో యుద్ధం మారణహోమంగా మారింది. రష్యా పక్షాన చైనా, ఇరాన్, ఉత్తర కొరియాలు నిలవడంతో నువ్వా నేనా అనే రీతిలో మారణహోమం కొనసాగుతున్నది. సమీపంలో కానరాని యుద్ధ విరమణ ఆలోచనలు: నేడు ఉక్రెయిన్-రష్యా యుద్ధం కాల్పుల విరమణ లేదా ముగింపుకు రావాలంటే ఇరు పక్షాలను ఒక టేబుల్‌పై చర్చలకు కూర్చోబెట్టాల్సి ఉంది. ఇది చాలా కష్టసాధ్యమని ప్రస్తుత పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. ఈ యుద్ధానికి చరమగీతం పాడడానికి నాలుగు మార్గాలు కనిపిస్తున్నట్లు విశ్లేషిస్తున్నారు. వీటిలో యుద్ధం దీర్ఘకాలం కొనసాగడం, యుద్ధ తీవ్రత తగ్గడం, యూఎస్ యూరోప్‌ల సహకారంతో ఉక్రెయిన్ గెలవడం, లేదా రష్యా గెలుపు బాటన నిలవడం లాంటి పరిష్కార మార్గాలు కనిపిస్తున్నాయి. డొనాల్డ్ ట్రంప్ కూడా యుద్ధ ముగింపును కోరుతున్నప్పటికీ రష్యా ఆధిపత్యాన్ని అంగీకరించడం అసాధ్యమే. యూఎస్, యూరోప్‌ల మిలటరీ, ఆర్థిక సహకారంతో మాత్రమే ఉక్రెయిన్ పై చేయి సాధించగలదు. కాల్పుల విరమణ లేదా యుద్ధ విరమణ చర్చలకు ఉక్రెయిన్ అంగీకరిస్తున్నప్పటికీ ఈ ప్రతిపాదనలను రష్యా వ్యతిరేకిస్తున్నది. ఎవరు పట్టు వారిది. యుద్ధ భూమిలో పోతున్న ప్రాణాలు ఇరువురివి. ఇరు దేశాలు పౌర సంక్షోభాలను ఎదుర్కొంటున్నాయి. దౌత్యపరమైన ప్రతిపాదనలు ఆదిలోనే తుంచబడుతున్నాయి. జెలెన్‌స్కీ, పుతిన్‌లు మంకు పట్టు పట్టుకొని మారణహోమం కొనసాగిస్తున్నారు. మరణాల లెక్కలను సవరించుకుంటున్నారు. ఆకలి కేకలను మించి యుద్ధ మోతలు మోగిస్తున్నారు. రష్యా గెలుపు పశ్చిమ దేశాలకు ఓటమితో సమానం. ఉక్రెయిన్ గెలుపు రష్యా-చైనాలకు తల వంపులు అవుతున్నది. యుద్ధం దీర్ఘకాలం కొనసాగితే మారణహోమ మరుభూమి తప్ప అభివృద్ధి ఆనందాలు కనిపించవు. యుద్ధం కొనసాగితే ఇరు దేశాల ప్రజలే కాకుండా ప్రపంచవ్యాప్త 840 కోట్ల ప్రజలు దాని దుష్ప్రభావ వేడికి ప్రభావితం అయ్యారు, అవుతూనే ఉంటారు. రష్యా దండయాత్రకు ఓ పరిష్కారం సత్వరమే దొరకాలని కోరుకుందాం.

# నేను తప్పు చేసినట్లు నిరూపిస్తే రాజకీయాలు వదిలేస్త

డిగ్రీ కళాశాల భూముల వ్యవహారం ఇప్పుడు కామారెడ్డి రాజకీయాల్లో సంచలనంగా మారింది. ఈ భూముల అంశంలో తనపై వస్తున్న అవినీతి ఆరోపణలను కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి తీవ్రంగా ఖండించారు. తాను అవినీతికి పాల్పడినట్లు ఆధారాలతో సహా నిరూపిస్తే, తక్షణమే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీకి బహిరంగ సవాల్ విసిరారు. ఈ వివాదంపై పూర్తి వాస్తవాలను బయటపెట్టాలని కోరుతూ ఆయన ఈరోజు కామారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కలిసి, కళాశాల భూములకు సంబంధించిన పూర్తి వివరాలను అందజేయాలని విజ్ఞప్తి చేశారు.
అనంతరం మీడియాతో మాట్లాడిన వెంకటరమణారెడ్డి... షబ్బీర్ అలీ తన రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ సత్యదూరమైన విషయాలను ప్రచారం చేస్తూ విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. డిగ్రీ కళాశాల భూముల వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు ఇప్పటికే తాము ఆర్టీఐ ద్వారా దరఖాస్తు చేశామని, ప్రభుత్వం నుంచి సమాచారం రాగానే అన్ని విషయాలు బహిర్గతం అవుతాయని స్పష్టం చేశారు. "కాలేజీ భూముల విషయంలో నేను ఒక్క గజం భూమినైనా ఆక్రమించినట్లు లేదా అవినీతి చేసినట్లు నిరూపించినా పదవి వదులుకోవడానికి సిద్ధం" అని ఆయన సవాల్ విసిరారు.జిల్లాలో శాంతిభద్రతల సమస్య తలెత్తకూడదనే ఉద్దేశంతోనే తాను ఇప్పటివరకు ఓపికతో ఉన్నానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పోలీసుల తీరుపై కూడా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తనను కలవడానికి
వస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకులను పోలీసులు అడ్డుకుంటున్నారని, ఇదే నిబంధన కాంగ్రెస్ నాయకులకు ఎందుకు వర్తించడం లేదని ఆయన ప్రశ్నించారు. చట్టం అందరికీ ఒకేలా ఉండాలని డిమాండ్ చేశారు. త్వరలోనే ఈ భూముల వ్యవహారంలో పక్కా ఆధారాలతో నిజాలను ప్రజల ముందు ఉంచుతామని, అప్పటి వరకు అబద్ధపు ప్రచారాలను నమ్మవద్దని ఆయన కోరారు.

# నా పేరుతో సంస్థలకు అనుమతి లేదు

తన పేరుతో కొంతమంది సంస్థలను ఏర్పాటు చేసినట్లు వచ్చిన వార్తలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. తెలంగాణలో 'కేటీఆర్ సేవా సమితి', 'కేటీఆర్ సేన' పేరుతో కొన్ని సంస్థలు కార్యకలాపాలు చేపడుతుండటంపై ఆయన స్పందించారు. తన పేరుతో ఎలాంటి సంస్థల నిర్వహణకు అనుమతి లేదని వెల్లడించారు. అలాంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లో ప్రోత్సహించేది లేదని స్పష్టం చేశారు. తన పేరుతో కార్యకలాపాలు నిర్వహించే సంస్థలకు ఎలాంటి గుర్తింపు, అనుమతి లేదనే విషయం అందరూ గుర్తించాలని అన్నారు. ఎవరైనా పనిచేయాలనుకుంటే కచ్చితంగా బీఆర్ఎస్ పార్టీ పరిధిలోనే చేయాలని కేటీఆర్ స్పష్టం చేశారు. తన పేరుతో పలు సంస్థల ద్వారా చేస్తున్న కార్యక్రమాలను నిలిపివేయాలని, తనపై అభిమానం ఉన్నవాళ్లు బీఆర్ఎస్ పార్టీతో కలిసి పనిచేయాలని సూచించారు.

# తెలంగాణలో జనసేన పార్టీ బలోపేతం..

- మొదటి పేజి తరువాయి

ఇం దులో భాగంగా పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు జనసేన తెలంగాణ విభాగం ప్రకటన విడుదల చేసింది. సభ్యత్వ నమోదు కార్యక్రమం కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. జనసేన పార్టీ 'ఉద్యమి' సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఈ నెల 26వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా నిర్వహించాలని పవన్ కల్యాణ్ నిర్ణయించారు.ఈ నేపథ్యంలో తెలంగాణలో పార్టీని 'ఉద్యమి' సభ్యత్వ నమోదు కార్యక్రమం ద్వారా క్షేత్రస్థాయిలో బలంగా తీసుకెళ్లి, సంస్థాగతంగా బలోపేతం చేయడానికి జిల్లాలవారీగా కొంతమంది నాయకులకు ఇన్‌ఛార్జ్ బాధ్యతలను అప్పగించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నూతనంగా ఏర్పడిన మూడు కార్పొరేషన్‌లకు వేర్వేరు ఇన్‌ఛార్జులను నియమించారు.జనసేన పార్టీ ఉపాధ్యక్షులు బొంగునూరి మహేందర్, తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ నేమూరి శంకర్ గౌడ్, పార్టీ నాయకులు రాధారాం రాజలింగం, కావ్య మండపాక, శిరీష పొన్నూరి రాష్ట్రస్థాయిలో పర్యవేక్షిస్తారని ఆ ప్రకటనలో జనసేన పార్టీ తెలిపింది. ఆయా పార్లమెంట్ పరిధిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాల బాధ్యతను రసువుకు నాయకులకు అప్పగించారు.

# ఆ విషయంలో బీఆర్ఎస్ ఫెయిల్ అయింది..

బీఆర్ఎస్ పూర్తిగా ఫెయిల్ అయిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. జోగులాంబ గద్వాల జిల్లాలో జరిగిన 'రైతు సంఘర్షణ' సభలో ఆమె మాట్లాడుతూ, తనకు జోగులాంబ అమ్మవారు సెంటిమెంట్ అని తెలిపారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ఏ కార్యక్రమం మొదలైనా ఉత్తర తెలంగాణలోని కరీంనగర్ జిల్లా నుంచి ఎక్కువగా ప్రారంభమయ్యేదని అన్నారు.కానీ భవిష్యత్తులో మనం ఏర్పాటు చేయబోయే పార్టీ మొదలు అన్నీ జోగులాంబ గద్వాల జిల్లా నుంచి ప్రారంభం చేయాలని నిర్ణయించుకున్నానని అన్నారు. ఇక్కడి నడిగడ్డ ప్రజలు నిజాయతీపరులని, అలాగే ఈ గడ్డపై నుంచి ఏ కార్యక్రమం ప్రారంభించినా జోగులాంబ అమ్మవారి ఆశీస్సులు ఉంటాయని భావిస్తున్నానని అన్నారు. పరిశ్రమలకు కరెంట్ ఇస్తున్నారు కానీ కష్టపడి పనిచేసే రైతులకు ఇవ్వడం లేదని విమర్శించారు.జోగులాంబ అమ్మవారి దయతో గద్వాల జిల్లా నుంచే తెలంగాణ జాగృతి జైత్రయాత్ర ప్రారంభమైందని అన్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీని తాము గెలుచుకున్నామని వెల్లడించారు. కానీ వడ్డేపల్లిలో తాము గెలిచిన తర్వాత తమ వారిని అధికార పార్టీ వారు దగ్గరకు తీసుకున్నారని మండిపడ్డారు. అసలు గద్వాల ఎమ్మెల్యే ఏ పార్టీలో ఉన్నారో చెప్పాలని సవాల్ చేశారు. ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేని వారు ఎమ్మెల్యేగా ఉన్నారని మండిపడ్డారు.

సమాధానం చెప్పకుంటే ఎమ్మెల్యే రాజీనామా చేయాలని సవాల్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ తనను సస్పెండ్ చేస్తే ఆ మరుక్షణం తాను ఆ పార్టీ నుంచి వచ్చిన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశానని గుర్తు చేశారు. రాజకీయాల్లో నీతి, నిజాయతీ, ధైర్యం ఉండాలని వ్యాఖ్యానించారు. మన ప్రాంతం నుంచే నీళ్లు పోతున్నాయి కానీ మనకు మాత్రం అందడం లేదని అన్నారు.
నడిగడ్డ ప్రాంతానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చేసిందేమీ లేదని అన్నారు. ప్రభుత్వంలో ఎవరున్నా ఇచ్చిన హామీలు నెరవేర్చేలా ప్రభుత్వాలతో పని చేయించడం కోసమే కొత్త పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఎవరు ఏమిచ్చినా తీసుకోవాలని, కానీ పని చేసేవారికి ఓటు వేయాలని సూచించారు.
త్వరలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు వస్తున్నాయని, అప్పుడు డబ్బులు ఇచ్చినా తీసుకోవాలని, కానీ మీకోసం కొట్లాడే జాగృతి అభ్యర్థులకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఆడబిడ్డలకు నెలకు రూ. 2,500, తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ ఎన్నికలకు ముందు చెప్పిందని గుర్తు చేశారు. కానీ ఈ హామీలు ఇప్పటి వరకు నెరవేర్చలేదని అన్నారు.

## వెంటనే ఇరాన్ నుంచి బయటపడండి...
# భారతీయులకు కేంద్రం అలర్ట్

- మొదటి పేజి తరువాయి

సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని కోరింది. ఈ మేరకు టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం సోమవారం ఓ అత్యవసర ప్రకటన విడుదల చేసింది.ఇరాన్‌లో నివసిస్తున్న విద్యార్థులు, తీర్థయాత్రికులు, వ్యాపారులు, పర్యాటకులు సహా ప్రతీ ఒక్కరూ అందుబాటులో ఉన్న వాణిజ్య విమానాలు లేదా ఇతర రవాణా మార్గాల ద్వారా తక్షణమే దేశం విడిచి వెళ్లాలని రాయబార కార్యాలయం స్పష్టం చేసింది. ఇరాన్‌పై అమెరికా సైనిక దాడులకు దిగే అవకాశం ఉందన్న ఆందోళనల నేపథ్యంలో భారత ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే జనవరి 5, 14 తేదీల్లో జారీ చేసిన సలహాలకు కొనసాగింపుగా ఈ తాజా హెచ్చరిక జారీ చేసినట్లు పేర్కొంది.
మరోవైపు, ఇరాన్‌లో అంతర్గతంగానూ నిరసనలు మళ్లీ ఊపందుకున్నాయి. ఇటీవల జరిగిన ఆందోళనల్లో మరణించిన వారి 40 రోజుల స్మారక కార్యక్రమాల నేపథ్యంలో టెహ్రాన్, మష్హద్ నగరాల్లోని పలు యూనివర్సిటీల్లో విద్యార్థులు భారీ ఎత్తున నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఈ పరిస్థితులు పౌరుల భద్రతకు ముప్పుగా పరిణమించవచ్చని భారత్ ఆందోళన చెందుతోంది. జెనీవాలో ఇరు దేశాల మధ్య అణు చర్చలు జరుగుతున్నప్పటికీ, అమెరికా తన సైనిక విమానాలను మధ్యప్రాచ్యం వైపు తరలిస్తుండటంతో యుద్ధ భయాలు పెరుగుతున్నాయి.
ఈ నేపథ్యంలో భారత పౌరులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, నిరసనలు జరిగే ప్రాంతాలకు దూరంగా ఉండాలని రాయబార కార్యాలయం సూచించింది. ప్రయాణ పత్రాలు, పాస్‌పోర్టులు, ఐడీ కార్డులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపింది.
అత్యవసర సహాయం లేదా సమాచారం కోసం ఈ క్రింది నంబర్లను సంప్రదించాలని కోరింది.
ఫోన్ నంబర్లు:
98 912 810 9115
98 912 810 9109
98 912 810 9102
98 993 217 9359
**ఇమెయిల్: ఎశీఅర్.వష్త్రతీఖుఅఏఎమ్ఖ.స్త్రశీజ.ఱఅ**
ఇరాన్‌లోని భారతీయులందరూ రాయబార కార్యాలయంలో తమ వివరాలు నమోదు చేసుకోవాలని కూడా ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

# తమిళనాడులో 74 లక్షల ఓట్లు తొలగింపు

తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల నగారా మోగనున్న తరుణంలో ఓటర్ల జాబితా ప్రక్షాళన ప్రక్రియ ఒక కొలిక్కి వచ్చింది. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ అనంతరం ఈరోజు తుది జాబితాను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి అర్చనా పట్నాయక్ విడుదల చేశారు. తాజా జాబితా ప్రకారం రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 5.67 కోట్లుగా నమోదైంది. గతంలో ఉన్న 6.41 కోట్ల ఓటర్లతో పోలిస్తే, ఈ ప్రక్షాళనలో ఏకంగా 74 లక్షల మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించడం గమనార్హం. డూప్లికేట్ ఓట్లు, మరణించిన వారి పేర్లు, నివాసం మారుతున్న వారి వివరాలను క్షుణ్ణంగా వెరిఫై చేసిన తర్వాతే ఈ భారీ తొలగింపులు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు.లింగ నిష్పత్తి పరంగా చూస్తే ఈసారి కూడా తమిళనాడులో మహిళా ఓటర్లే ఆధిపత్యం ప్రదర్శిస్తున్నారు. మొత్తం 5,67,07,380 మంది ఓటర్లలో 2.89 కోట్ల మంది మహిళలు ఉండగా, 2.77 కోట్ల మంది పురుషులు, 7,617 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. డిసెంబర్ 19 నుంచి జనవరి 30 వరకు వచ్చిన లక్షలాది అప్లికేషన్లను పరిశీలించి, అర్హులైన కొత్త ఓటర్లను కూడా జాబితాలో చేర్చారు. ఈ వేసవిలో జరగబోయే ఎన్నికల కోసం ఈ జాబితానే కీలకం కానుంది.

## గచ్చిబౌలిలో రూ.1.76 లక్షలు పలికిన చదరపు గజం భూమి

- మొదటి పేజి తరువాయి

బిల్డర్లు పాల్గొన్నారు.గచ్చిబౌలి, బౌరంపేట, కూకట్ పల్లి బాలాజీనగర్, చింతల్ తదితర ప్రాంతాల్లోని మొత్తం 14 స్థలాలను బహిరంగ వేలం వేశారు. ఇందులో గచ్చిబౌలి భూమి చదరపు గజం రూ. 1.76 లక్షలు, కూకట్ పల్లి బాలాజీనగర్‌లో చదరపు గజం రూ. 1.64 లక్షలు పలికింది. బహిరంగ వేలం ద్వారా హౌసింగ్ బోర్డుకు రూ. 34.27 కోట్ల ఆదాయం సమకూరింది.

# బంగారం ధరల పెరుగుదలకు కారణం అదే

- మొదటి పేజి తరువాయి

ఏర్పాటు చేసిన సంయుక్త విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, దేశంలోకి బంగారం, వెండి దిగుమతులు ఆందోళనకర స్థాయిలో ఏమీ లేవని అన్నారు. వాటిని ఆర్బీఐ ఎప్పటికప్పుడు పరిశీలిస్తోందని తెలిపారు.
బంగారం దిగుమతులపై తాము ఆందోళన చెందడం లేదని, కరెంట్ ఖాతా లోటు నిర్వహించదగిన స్థాయిలోనే ఉందని వెల్లడించారు. బ్యాంకులు తమ కోర్ వ్యాపారంపై దృష్టి సారించాలని ఆమె సూచించారు. భారత్ వృద్ధి పథంలో పయనిస్తోందని, అందులో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పారిశ్రామికవేత్తలు తమ పెట్టుబడులను పెంచాలని నిర్మలా సీతారామన్ కోరారు.అమెరికా టారిఫ్ అంశంపై కూడా ఆమె స్పందించారు. వివిధ దేశాలపై డొనాల్డ్ ట్రంప్ విధించిన అధిక సుంకాలను అక్కడి సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ క్రమంలో భారత్ సహా అన్ని దేశాలపై 15 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఈ మార్పుల ప్రభావం భారత్‌పై ఎలా ఉంటుందని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా, వాణిజ్య మంత్రిత్వ శాఖ ఈ అంశాన్ని సమీక్షిస్తోందని నిర్మలా సీతారామన్ తెలిపారు. ఈ అంశంపై అప్పుడే వ్యాఖ్యానించడం తొందరపాటు అవుతుందని అన్నారు.

# డీఎంకేకు ఓటు వేస్తే బీజేపీకి వేసినట్లే

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి భయంతో బీజేపీతో పొత్తు పెట్టుకోవాలని స్టాలిన్ ప్రభుత్వం చూస్తోందని ప్రముఖ సినీ నటుడు, టీవీకే అధినేత విజయ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పరిస్థితులకు అనుగుణంగా మారిపోవడం ఆ పార్టీ నేతలకు అలవాటేనని వ్యాఖ్యానించారు. వేలూరులో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో తనను ఎలాగైనా ఓడించాలనే ఆలోచనతో స్టాలిన్ కుట్రలు పన్నుతున్నారని అన్నారు. డీఎంకేకు ఓటు వేస్తే బీజేపీకి వేసినట్లేనని అన్నారు. ప్రభుత్వాల అవినీతిని ప్రశ్నిస్తున్నందువల్లే తనను లక్ష్యంగా చేసుకుంటున్నారని విజయ్ అన్నారు. తమ పార్టీ నిర్వహించే బహిరంగ సభలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడం లేదని ఆరోపించారు. అందువల్లే తాను అన్ని ప్రాంతాల ప్రజలను కలవలేకపోతున్నానని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి టీవీకే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి గ్రామాన్ని సందర్శిస్తానని హామీ ఇచ్చారు.
తనను ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా వెనక్కి తగ్గేది లేదని అన్నారు. అవినీతిని ప్రశ్నించడం ఆపేది లేదని స్పష్టం చేశారు. అవినీతి, అక్రమాలను అరికట్టడంలో స్టాలిన్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలు తమిళనాడు ప్రజలకు, అవినీతి ప్రభుత్వానికి యుద్ధమని వ్యాఖ్యానించారు. ఈ యుద్ధంలో ప్రజలు విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఆ మ్యాచ్ కూడా స్టేడియంకు వెళ్లి చూస్తా

టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టు ఫైనల్‌కు చేరితే, ఆ మ్యాచ్ చూసేందుకు తాను తప్పనిసరిగా వెళ్తానని మంత్రి నారా లోకేశ్ అన్నారు. అవసరమైతే పులివెందుల ఎమ్మెల్యే (జగన్)కి కూడా తన డబ్బులతో టికెట్ కొనిస్తానని ఆయన వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. గతంలో తాను శ్రీలంకలో క్రికెట్ మ్యాచ్ వీక్షించడంపై జగన్ చేసిన విమర్శలకు లోకేశ్ తనదైన శైలిలో గట్టి కౌంటర్ ఇచ్చారు. అసెంబ్లీ లాబీల్లో సోమవారం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.
"క్రికెట్ మ్యాచ్ చూడటానికి స్టేడియంకు వెళ్లాలా అని జగన్ అంటున్నారు. టీమిండియా ఫైనల్‌కు వెళితే కచ్చితంగా వెళ్తాను. ఆయనకూ (జగన్‌కు) ఓ టికెట్ తీసుకుంటా" అని లోకేశ్ అన్నారు. తాను గతంలో సొంత డబ్బులతోనే మ్యాచ్ చూశానని మరోసారి స్పష్టం చేశారు. ఇదే సమయంలో వైసీపీ ప్రభుత్వంపై, జగన్‌పై లోకేశ్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్‌కు చెందిన సాక్షి మీడియా, భారతి సిమెంట్స్ సంస్థలకు రూ. 1000 కోట్ల మేర అడ్డగోలుగా లబ్ధి చేకూర్చారని లోకేశ్ ఆరోపించారు. అయితే, తమ కుటుంబ సంస్థ అయిన హెరిటేజ్‌కు ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా ప్రయోజనం కలగలేదని తేల్చిచెప్పారు. హెరిటేజ్ నెయ్యిపై వస్తున్న విమర్శలను తిప్పికొడుతూ.. కిలో నెయ్యి మార్కెట్‌లో రూ. 1,000కి పైగా ఉంటే, రూ. 360కి ఎక్కడైనా దొరికితే అది కల్తీదేనని అన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండానే హెరిటేజ్‌పై సెబీకి ఫిర్యాదు చేశారని మండిపడ్డారు.బడ్జెట్‌పై చర్చ జరగాలని వైసీపీ సభ్యులు డిమాండ్ చేయడం హాస్యాస్పదంగా ఉందని లోకేశ్ విమర్శించారు. నిజంగా చర్చపై చిత్తశుద్ధి ఉంటే, నాలుగు రోజుల పాటు సభా కార్యక్రమాలను ఎందుకు అడ్డుకున్నారని ఆయన ప్రశ్నించారు.

# తెలంగాణ ఇంటర్ పరీక్షలు... బోర్డు సెక్రటరీ కీలక సూచనలు

- ఈ నెల 25 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ పరీక్షలు
- రెండు సంవత్సరాలు కలిపి పరీక్షలు రాస్తున్న 9,97,075 మంది విద్యార్థులు
- పరీక్షా కేంద్రానికి అరగంట ముందే చేరుకోవాలన్న కృష్ణాదిత్య



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ ఇంటర్మీడియట్ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. ఈ నెల 25 నుంచి మార్చి 18 వరకు జరగనున్న ఈ పరీక్షల నిర్వహణపై ఇంటర్ బోర్డు సెక్రటరీ, ఐఏఎస్ అధికారి కృష్ణాదిత్య కీలక వివరాలను వెల్లడించారు. ఈ ఏడాది మొత్తం 9,97,075 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాబోతున్నారు. ఇందులో మొదటి సంవత్సరం నుంచి 4,89,126 మంది, ద్వితీయ సంవత్సరం నుంచి 5,07,949 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,495 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 404 ప్రభుత్వ కళాశాలలు, 221 ఎయిడెడ్ కాలేజీలు, 863 ప్రైవేట్ జూనియర్ కళాశాలలతో పాటు 7 ఇతర విద్యా సంస్థలను సెంటర్లుగా ఎంపిక చేశారు. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ప్రైవేట్ కాలేజీల్లో అధికంగా సెంటర్లు ఉండగా, మిగిలిన

- మిగతా 4లో...

# పెన్ పవర్
## తెలంగాణ రౌండప్

- 30-40 ఏళ్లుగా నివాసం..! పట్టాలు, రోడ్లున్నా కొత్త కరెంటు మీటర్లకు నిరాకరణ..
- కుటుంబాలు పెరిగినా విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో ఒకే మీటర్‌పై 2-3 ఇళ్లు..
- ఓవైపు అధిక బిల్లులు..మరోవైపు కరెంటు వినియోగం ఒత్తిడితో మీటర్లు దగ్ధం..
- 75 శాతం ఇళ్ల నిర్మాణం పూర్తయినా ఆ సర్వే నంబర్లు నిషేధిత జాబితాలోనే..
- సమస్యను అసెంబ్లీలో ప్రస్తావిస్తానని ఎమ్మెల్యే కే.పీ. వివేకానంద హామీ..

# నిషేధిత సర్వే నెంబర్‌ల పేరుతో..!
# బస్తీలకు విద్యుత్ మీటర్ల నిరాకరణ..?

‘అక్రమార్కులకు- వక్రమార్గం’లో తగిన ముడుపులు పుచ్చుకుని, ఇష్టానుసారంగా, ఇట్టే అక్రమ విద్యుత్ మీటర్లు సాంక్షన్ చేయడానికి..వెనకడుగు వేయని అధికారులు, నిలదీసే విధంగా కొత్త మీటర్లపై ప్రశ్నిస్తే నిబంధనలు అడ్డొస్తున్నాయి.. ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాల నిర్మించక ముందే విద్యుత్ మీటర్లు సిద్ధంగా ఉంచిన ఘనులు ఈ మధ్యనే విజిలెన్స్ అధికారులు దుల సంఖ్యలో మీటర్లని గుర్తించిన సంగతి తెలిసిందే.. అక్రమ ప్రైవేటు ట్రాన్స్‌ఫార్మర్‌లు, మంజూరు చేయడం.. కొత్తేమి కాదు, తప్పుడు కరెంట్ పోల్స్ నిర్మించి డి.పోచంపల్లి సబ్ స్టేషన్ పరిధిలో సస్పెండ్ అయిన ఉదంతాలు కూడా ఉన్నాయి.. ఏదిఏమైనప్పటికీ ఈ సస్పెన్షన్‌లు, ఏసిబి దాడులు, సంబంధిత అధికార యంత్రాంగం ఉనికిని వాడుకోవడానికే, ఈ వేటు పడిన వారు ఆరు నెలలు తిరగక ముందే మళ్ళీ విధుల్లో కొనసాగటం మామూలే..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, ఫిబ్రవరి 23:**

### ఒకే మీటర్‌పై మూడు కుటుంబాలు నివాసం..
### అధిక బిల్లుల భారం.. కుటుంబంలో గొడవలు తలెత్తుతున్న వైనం..!



ఎమ్మెల్యే వివేకానందకు వినతిపత్రం అందజేస్తున్న కోలా రవిందర్ ముదిరాజ్..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు బస్తీల ప్రజలు ఎదుర్కొంటున్న కరెంటు మీటర్ల సమస్యపై శాసనసభ్యులు కే.పీ. వివేకానందను కలిసి వినతిపత్రం సమర్పించారు.. సుమారు 30-40 ఏళ్ళ క్రితం ప్రభుత్వ అసైన్డ్ భూముల్లో నివసించడం ప్రారంభించిన కుటుంబాలకు గతంలో కాంగ్రెస్, టిడిపి, టిఆర్ఎస్ ప్రభుత్వాలు పట్టాలు మంజూరు చేసి, సీసీ రోడ్లు, యూజీడీ, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాయి.. అయితే కాలక్రమేణా కుటుంబ సభ్యులు పెరిగి ఒక్కో కుటుంబం 2-3 ఇండ్లుగా విడిపోయి సొంతకాపురం పెట్టిన సందర్భాలలో అవసరమైన కొత్త కరెంటు మీటర్లు మంజూరు చేయడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.. సంబంధిత సర్వే నంబర్లను నిషేధిత జాబితాలో చేర్చడంతో రిజిస్ట్రేషన్లు కూడా నిలిచిపోయాయని, వారు పేర్కొన్నారు.

### ఒకే మీటర్‌పై మూడు కుటుంబాలు..

కొత్త విద్యుత్ మీటర్లు మంజూరు చేయకపోవడంతో ఒకే మీటర్‌పై రెండు, మూడు కుటుంబాలు విద్యుత్ వినియోగించాల్సి వస్తోందని, దీని వల్ల అధిక బిల్లుల తోపాటు, కరెంటు వాడకం ఒత్తిడి పెరిగి మీటర్లు కాలిపోవడం, కుటుంబాల మధ్య వివాదాలు తలెత్తుతున్నాయని ప్రజలు వాపోయారు..

### 75 ఇళ్లు నిర్మాణం పూర్తయినా..!

ప్రభుత్వ భూముల్లో 75 శాతం వరకు ఇళ్లు నిర్మించుకుని సంవత్సరాలుగా నివసిస్తున్నా..! సంబంధిత సర్వే నంబర్లను నేటికీ నిషేధిత జాబితాలోనే ఉంచారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. నిషేధిత జాబితా నుంచి తొలగించాలని, లేదంటే జి.ఓ.నెం.59, 166 కింద కన్వర్షన్ చేయాలని వారు డిమాండ్ చేశారు.. 25 సంవత్సరాలుగా నివసిస్తున్న తమకు ఈరోజు “కరెంటు మీటర్లు ఇవ్వలేం” అని చెప్పడం ఎలక్ట్రిసిటీ బోర్డు నిర్లక్ష్యమా..? లేక బీదలపై ప్రభుత్వ ఉక్కుపాదమా..? అనే ప్రశ్నలు లేవనెత్తారు.. బాధిత బస్తీలు సాయిబాబా నగర్, సూరారం కాలనీ, వాజ్పేయి నగర్, శివాలయం నగర్, కృష్ణానగర్ తదితర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు..

### సమస్యపై చర్చిస్తా:ఎమ్మెల్యే హామీ..

వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే కే.పీ. వివేకానంద సమస్యపై సంబంధిత అధికారులతో చర్చిస్తానని, అవసరమైతే అసెంబ్లీలో కూడా ఈ అంశాన్ని ప్రస్తావించి చట్టబద్ధ పరిష్కారం తీసుకురావడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.. ఈ కార్యక్రమంలో వివిధ కాలనీ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, పర్యావరణ ప్రేమికుడు కోలా రవీందర్ ముదిరాజు, కె. సందీప్ కుమార్, గోపాలరెడ్డి, శేషు, గణపతి, ఎల్. కృష్ణ తదితరులు పాల్గొన్నారు..

## బాల్క సుమన్ బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

- తెలంగాణ రాజకీయాల్లో వేడి పుట్టిస్తున్న బాల్క సుమన్ అరెస్ట్
- బెయిల్ పిటిషన్‌ను ఈరోజు విచారించిన కోర్టు
- కౌంటర్ దాఖలు చేసేందుకు సమయం కోరిన పోలీసులు
- తదుపరి విచారణను వాయిదా వేసిన కోర్టు

-4 లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
‘ ఐదు రోజులకు ’
‘4 సెం.మీ 4 సెం.మీ’
‘మరిన్ని వివరాలకు సంప్రదించండి ’
93948 55244
షరతులు వర్తిస్తాయి

# కాంగ్రెస్ అరాచకాలకు బీజేపీ ఆగ్రహాగ్ని

మల్లంపేటలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం..

’అక్రమ అరెస్టులు ఆపకపోతే సీఎం ఇంటిని ముట్టడిస్తామని’ హెచ్చరిక..



- కామారెడ్డిలో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి ఇంటిపై దాడికి బీజేపీ నిరసన..
- కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీ ఆరోపణలు నిరాధారమని బీజేపీ సవాల్..
- కామారెడ్డికి వెళ్లే క్రమంలో బీజేపీ నాయకుల అక్రమ అరెస్టులపై తీవ్ర విమర్శలు..
- ఢిల్లీ ఏఐ సమ్మిట్ ఘటనతో దేశ పరువు తీసిందని కాంగ్రెస్‌పై మండిపాటు..
- చిల్లర రాజకీయాలు ఆపకపోతే సీఎం ఇంటి ముట్టడి అంటూ బీజేపీ హెచ్చరిక..

-4 లో

# ఎమ్మెల్యే మాధవరం ఆరోపణలను ఖండించిన హైడ్రా

- సున్నం చెరువు ఎఫ్‌టీఎల్ సరిహద్దులు మారబోవని చెప్పిన హైడ్రా
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆరోపణల్లో నిజం లేదని స్పష్టీకరణ
- 2014లో నిర్ధారించిన హద్దుల ప్రకారమే అభివృద్ధి పనులు జరుగుతున్నాయి
- ఆక్రమణలకు గురైన చెరువును 31 ఎకరాలకు విస్తరించామని వెల్లడి
- పేదలకు అన్యాయం, పెద్దలకు రక్షణ కల్పించే ఉద్దేశం లేదని స్పష్టత

**హైదరాబాద్ పెన్ పవర్:**మాదాపూర్‌లోని సున్నం చెరువు పూర్తిస్థాయి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్) సరిహద్దుల్లో ఎలాంటి మార్పులు చేయడం లేదని హైడ్రా స్పష్టం చేసింది. చెరువు ఎఫ్‌టీఎల్ హద్దులను మార్చి అభివృద్ధి పనులు చేపడుతున్నారంటూ కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. చెరువు అభివృద్ధి పనులను అత్యంత శాస్త్రీయంగా, పారదర్శకంగా చేపడుతున్నామని, ఇందులో ఎవరికీ అనుమానాలు అవసరం లేదని ఒక ప్రకటనలో పేర్కొంది.సున్నం చెరువు ఎఫ్‌టీఎల్‌ను 2014 మే నెలలోనే నిర్ధారించారని, ఆ సరిహద్దుల మేరకే ప్రస్తుతం పనులు చేపడుతున్నామని హైడ్రా వివరించింది. ఈ పనుల్లో పేదలకు అన్యాయం చేయడం గానీ, పెద్దలను కాపాడటం గానీ జరగడం లేదని తేల్చిచెప్పింది. ఒకప్పుడు ఆక్రమణలకు గురై కేవలం 14 ఎకరాలకు కుచించుకుపోయిన ఈ చెరువును, 2014లో ఇరిగేషన్ శాఖ నిర్ధారణ ప్రకారం 31 ఎకరాలకు విస్తరించిన విషయాన్ని గుర్తుచేసింది. ఇరిగేషన్, రెవెన్యూ వంటి సంబంధిత శాఖల సమన్వయంతోనే ఎఫ్‌టీఎల్ నిర్ధారణ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగిందని తెలిపింది.సోమవారం సున్నం చెరువును సందర్శించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు, అక్కడే ఉన్న ఇరిగేషన్ అధికారులు వాస్తవాలను వివరించారని హైడ్రా పేర్కొంది.



2014లో ఇరిగేషన్ శాఖ నిర్ణయించిన జియో కో-ఆర్డినేట్స్ (అక్షాంశాలు, రేఖాంశాలు) ప్రకారమే ఎఫ్‌టీఎల్ సరిహద్దులను గుర్తించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని స్పష్టం చేసింది. చెరువు ఎఫ్‌టీఎల్ సరిహద్దులు శాశ్వతమైనవని, వాటిని మార్చే ప్రసక్తే లేదని హైడ్రా తన ప్రకటనలో పునరుద్ఘాటించింది. ఈ విషయంలో అనవసర అపోహలు సృష్టించవద్దని కోరింది. చెరువు అభివృద్ధికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేసింది.

మల్లంపేట్‌లో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మతో బీజేపీ నాయకులు..





# కాంగ్రెస్ అరాచకాలకు బీజేపీ ఆగ్రహాగ్ని

## మల్లంపేటలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం..

## 'అక్రమ అరెస్టులు ఆపకపోతే సీఎం ఇంటిని ముట్టడిస్తామని' హెచ్చరిక..

సీఎం దిష్టి బొమ్మ దగ్ధం చేస్తున్న బీజేపీ నాయకులు..



- కామారెడ్డిలో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి ఇంటిపై దాడికి బీజేపీ నిరసన..
- కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీ ఆరోపణలు నిరాధారమని బీజేపీ సవాల్..
- కామారెడ్డికి వెళ్లే క్రమంలో బీజేపీ నాయకుల అక్రమ అరెస్టులపై తీవ్ర విమర్శలు..
- ఢిల్లీ ఏఐ సమ్మిట్ ఘటనతో దేశ పరువు తీసిందని కాంగ్రెస్‌పై మండిపాటు..
- చిల్లర రాజకీయాలు ఆపకపోతే సీఎం ఇంటి ముట్టడి అంటూ బీజేపీ హెచ్చరిక..

**దుండిగల్, పెన్ పవర్, ఫిబ్రవరి 23:** తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీ అరాచకాలకు నిరసనగా దుండిగల్ సర్కిల్ పరిధిలోని మల్లంపేటలో బీజేపీ నాయకులు సోమవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తూ ప్రభుత్వంపై ఘాటుగా విమర్శలు గుప్పించారు.. దుండిగల్ సర్కిల్ బీజేపీ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, "కాంగ్రెస్ పార్టీ అంటేనే అరాచకం అన్నట్లుగా వ్యవహరిస్తోంది.. మొన్న ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ స్థాయి ఏఐ సమ్మిట్‌లో దేశ పరువును తీసేలా కాంగ్రెస్ గుండాలు చిల్లర రాజకీయాలకు పాల్పడ్డారు" అని ఆరోపించారు.. అలాగే, కామారెడ్డిలో జరిగిన ఘటనను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీ, భూ కబ్జాలపై నిరాధారమైన ఆరోపణలు చేశారని విమర్శించారు. ఈ ఆరోపణలపై కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి నిజాయితీ నిరూపించుకోవడానికి చర్చకు ఆహ్వానించగా, చర్చకు రాకుండా కాంగ్రెస్ నాయకులు గుండాలను ఉసిగొల్పి ఎమ్మెల్యే ఇంటిపై దాడి చేయించారని బీజేపీ ఆరోపించింది.కామారెడ్డికి సంఘీభావంగా వెళ్తున్న బీజేపీ నాయకులను ఎక్కడికక్కడ అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించిన బీజేపీ శ్రేణులు, దీనికి నిరసనగా మల్లంపేటలో సీఎం దిష్టిబొమ్మను తగలబెట్టారు.. ఇలాంటి చిల్లర రాజకీయాలు కొనసాగితే సీఎం ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు గోనె మల్లారెడ్డి, సీనియర్ నాయకులు దమ్మగారి ప్రభాకర్ రెడ్డి, ఎస్. నర్సింగ్ రావు, యువమోర్చా నాయకులు అతీష్ బాబు, సారా నవీన్, రాహుల్ జి, గణేష్, ఎస్.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఇంటర్ పరీక్షలు... బోర్డు సెక్రటరీ కీలక సూచనలు

-3 పేజి తరువాయి

జిల్లాల్లో ఎక్కువగా ప్రభుత్వ కళాశాలలనే ప్రాధాన్యతలోకి తీసుకున్నారు. మాస్ కాపీయింగ్‌కు ఏమాత్రం అవకాశం లేకుండా దాదాపు 30 వేల సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించబోతున్నామని, ప్రతి సెంటర్‌పై ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందని ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణాదిత్య తెలిపారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి అరగంట ముందే చేరుకోవాలని ఆయన సూచించారు. ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినా అనుమతిస్తామని... కానీ, ఆ ఆందోళన వల్ల విద్యార్థులు నష్టపోయే అవకాశం ఉందని, అందుకే నిర్ణీత సమయానికి హాజరుకావాలని కోరారు. అలాగే మధ్యాహ్నం 12 గంటల వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యార్థులను బయటకు పంపమని, పరీక్షా పత్రాలను కూడా అప్పటి వరకు బయటకు తీసుకెళ్లకూడదని చెప్పారు. ఏదైనా అవాంఛనీయ ఘటనలు లేదా మాల్ ప్రాక్టీస్ జరిగితే నిర్ణయం తీసుకోవడానికి ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేశారు.ఇక హాల్ టికెట్ల విషయంలో తలెత్తిన వివాదాలపై కూడా ఆయన స్పష్టతనిచ్చారు.

ఫీజులు చెల్లించలేదనే కారణంతో విద్యార్థులను ఇబ్బంది పెట్టకుండా, అందరికీ హాల్ టికెట్లు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కోర్టుకు వెళ్లిన విద్యార్థులకు కూడా ఇప్పటికే హాల్ టికెట్లు జారీ చేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 28,500 మంది ఇన్విజిలేటర్లు విధుల్లో ఉంటారని, విద్యుత్, రవాణా, పోలీస్ శాఖల సమన్వయంతో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని మౌలిక వసతులు కల్పించినట్లు కృష్ణాదిత్య వెల్లడించారు.

## బాల్క సుమన్ బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రాజకీయాల్లో వేడి పుట్టిస్తున్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్ట్ వ్యవహారం ఇప్పుడు కోర్టు మెట్లెక్కింది. కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే అక్రమ కేసులు బనాయించిందని ఆరోపిస్తూ దాఖలైన బెయిల్ పిటిషన్‌పై ఈరోజు కోర్టులో కీలక విచారణ జరిగింది. అయితే, ఈ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేసేందుకు పోలీసు యంత్రాంగం గడువు కోరడంతో, న్యాయస్థానం తదుపరి వాదనలను రేపటికి వాయిదా వేసింది. ప్రస్తుతం ఆయన మంచిర్యాల జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా కొనసాగుతున్నారు.మున్సిపల్ ఎన్నికల వేళ క్యాతనపల్లిలో చెలరేగిన రాజకీయ సెగలే ఈ అరెస్టుకు ప్రధాన కారణమయ్యాయి. అక్కడ బీఆర్ఎస్ అభ్యర్థులు స్పష్టమైన మెజారిటీ సాధించినప్పటికీ, చైర్‌పర్సన్ మరియు వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియలో అధికార పార్టీ ఆటంకాలు సృష్టించిందని సుమన్ పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరును, పోలీసుల వైఖరిని నిరసిస్తూ ఆందోళన చేపట్టడంతో ఆయనపై కేసులు నమోదై జైలుకు వెళ్లాల్సి వచ్చింది. సుమన్ అరెస్టును నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు ఇప్పటికే బంద్ నిర్వహించడంతో రేపు కోర్టు ఏ నిర్ణయం తీసుకుంటుందనేది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

## 2 నెలల చిన్నారి మృతిపై డీజీపీకి బీఆర్ఎస్ వినతి పత్రం

- కుమ్మెర మల్లన్న జాతరలో తోపులాట... చిన్నారి మృతి
- డీజీపీ శివధర్ రెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చిన శ్రీనివాస్ గౌడ్
- బాధిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని విజ్ఞప్తి




**హైదరాబాద్ పెన్ పవర్:**కుమ్మెర మల్లన్న జాతరలో తోపులాట కారణంగా రెండు నెలల చిన్నారి మృతి చెందిన ఘటనకు సంబంధించి చర్యలు తీసుకోవాలని కోరుతూ డీజీపీ శివధర్ రెడ్డికి బీఆర్ఎస్ నాయకులతో కలిసి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ వినతి పత్రం అందించారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి నిజాలు వెలికి తీయాలని కోరారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఇటీవల నాగర్ కర్నూలు జిల్లా కుమ్మెర మల్లన్న జాతరలో తోపులాట జరిగింది. ఈ క్రమంలో గణేశ్, తన భార్య మౌనిక, రెండు నెలల కూతురును పక్కకు తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో చిన్నారి కిందపడి మృతి చెందింది. నిర్వాహకుల కారణంగానే తమ కూతురు కిందపడిందని గణేశ్ దంపతులు ఆరోపిస్తున్నారు.

## గృహ నిర్బంధంలో ఉన్న కామారెడ్డి ఎమ్మెల్యేకి అస్వస్థత

- జ్వరంతో బాధపడుతున్న వెంకటరమణారెడ్డి
- ఆయన నివాసానికి వెళ్లి పరీక్షలు నిర్వహించిన వైద్యులు
- మరో రెండు మూడు రోజులు విశ్రాంతి అవసరమన్న వైద్యులు



**హైదరాబాద్ పెన్ పవర్:**గత కొన్ని రోజులుగా కామారెడ్డి నియోజకవర్గంలో భూ వివాదానికి సంబంధించిన ఆరోపణలు, వరుస సవాళ్లు, ప్రతి సవాళ్ల నేపథ్యంలో బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆయన జ్వరంతో బాధపడుతున్నారు. ప్రస్తుతం పోలీసులు ఆయనను గృహ నిర్బంధంలో ఉంచిన తరుణంలోనే ఈ అనారోగ్యం కలగడం స్థానికంగా చర్చనీయాంశమైంది.ఎమ్మెల్యే అస్వస్థతకు గురయ్యారన్న సమాచారం అందుకున్న వైద్య బృందం ఆయన నివాసానికి చేరుకుని ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించింది. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు తెలిపారు. కోలుకోవడానికి మరో రెండు మూడు రోజుల పాటు పూర్తి విశ్రాంతి అవసరమని వారు సూచించారు.మరోవైపు, డిగ్రీ కళాశాల భూముల వివాదంలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం నడుస్తుండటంతో కామారెడ్డిలో ఉద్రిక్తత కొనసాగుతోంది. ఈ క్రమంలోనే తమ నాయకుడి ఆరోగ్యం గురించి తెలుసుకునేందుకు బీజేపీ శ్రేణులు, కార్యకర్తలు ఆయన నివాసం వద్దకు చేరుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఎమ్మెల్యే అస్వస్థతకు గురయ్యారన్న వార్తతో నియోజకవర్గ వ్యాప్తంగా బీజేపీ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది. శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు ఆయన ఇంటి వద్ద పహారాను మరింత కట్టుదిట్టం చేశారు.

## డీజీపీ గారూ... అవి ఫేక్ న్యూస్ క్లిప్పింగ్స్: హరీశ్ రావు



**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తనపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారంపై తీవ్రంగా స్పందించారు. "పోలీసుల అంతు చూసేదాకా వదలబోము" అంటూ తన పేరిట ఓ ఫేక్ వీడియో క్లిప్ సర్క్యులేట్ అవుతుండటంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంలో నిందితులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ అండదండలు ఉన్నాయా? అని ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు.ఈ మేరకు తెలంగాణ డీజీపీని ట్యాగ్ చేస్తూ హరీశ్ రావు సోమవారం ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ చేశారు.

"తెలంగాణ డీజీపీ గారూ, పోలీసులను, ప్రజలను రెచ్చగొట్టి, తప్పుదోవ పట్టించేందుకు ఉద్దేశపూర్వకంగా కొన్ని ఫేక్ న్యూస్ క్లిప్పులను ప్రచారంలోకి వదులుతున్నారు. ఇది నేరుగా సంస్థాగత విశ్వసనీయతపై చేస్తున్న దాడి. ఈ విషయంలో తెలంగాణ పోలీసులు తక్షణమే చర్యలు తీసుకుంటారా? లేదంటే ఇలాంటి తప్పుడు సమాచారాన్ని ఇలాగే అడ్డుఅదుపు లేకుండా వదిలేస్తారా? ముఖ్యమంత్రి, హోంమంత్రి రేవంత్ రెడ్డి గారి కింద ఈ దుష్ప్రచారం చేస్తున్న వారికి రాజకీయ అండదండలు ఉన్నందువల్లే మీరు ఇలా ఎంపిక చేసుకుని మరీ మౌనంగా ఉంటున్నారా? పోలీసు శాఖ గురించి ఫేక్ న్యూస్ వ్యాప్తి చేస్తున్న వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని మేము డిమాండ్ చేస్తున్నాం" అంటూ హరీశ్ రావు ట్వీట్ చేశారు.

# హాస్టల్‌లో చికెన్ గురించి లొల్లి.. తలలు పగిలేలా కొట్టుకున్నరు.. కాకతీయ యూనివర్సిటీలో ఉద్రిక్తత

**హన్మకొండ: పెన్ పవర్:** హాస్టల్‌లో చికెన్ కోసం గొడవపడి విద్యార్థులు తలలు పగిలేలా ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్న ఘటన వరంగల్ కాకతీయ యూనివర్సిటీ పరిధిలో జరిగింది. ఈపరిణామంతో.. వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో ఉద్రిక్తత నెలకొంది. ఎంబీఏ, ఎకనమిక్స్ విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. విద్యార్థులు తలలు పగిలేలా కొట్టుకున్నారు. పలువురిపై కేసు నమోదైంది. కేయూలో పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశారు. హాస్టల్‌లో చికెన్ కోసం విద్యార్థులు గొడవపడ్డారు. పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. చికెన్ పంపకాల్లో లొల్లి మొదలైంది. నిన్న (ఫిబ్రవరి 22) ఆదివారం కావడంతో లంచ్ టైంలో హాస్టల్‌లో చికెన్ పెట్టారు. విద్యార్థులంతా చికెన్ తిన్నారు. అయితే.. అప్పటికీ చికెన్ కొంత మిగిలింది. ఆ మిగిలిపోయిన చికెన్ మాకు కావాలంటే మాకు కావాలని ఎంబీఏ, ఎకనమిక్స్ స్టూడెంట్స్ గొడవ పడ్డారు. ఈ గొడవ పెద్దదైంది. ఒకరిద్దరితో మొదలైన గొడవ హాస్టల్‌లో ఉన్న విద్యార్థులంతా ఇన్వాల్వ్ అయ్యే వరకూ వెళ్లింది. ఈ గొడవ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.



02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు'
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

## రెండు కార్లు ఢీ..ఒకరు మృతి

**సూర్యాపేట: పెన్ పవర్:** కోదాడ మండలం ద్వారకుంట వద్ద జాతీయరహదారి పై రెండు కార్లు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా ఏడుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. టైరు పేలడమే ప్రమాదానికి కారణం. విజయవాడ నుంచి హైదరాబాద్ వెళు_న్న కారు టైరు పేలి, డివైడర్ దాటి అవతలి వైపు కారును ఢీకొట్టింది. ప్రమాదంలో కోదాడ నయా నగర్కు చెందిన పాస్టర్ ఉప్పెల్లి సత్యంబాబు (54) అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన వారిని కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్లోని ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారు.

## సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ వార్షిక క్రీడా పోటీలను ప్రారంభించిన పోలీస్ కమిషనర్

**సిద్దిపేటపెన్ పవర్:** స్థానిక పోలీస్ పెరేడ్ మైదానంలో సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ వార్షిక క్రీడా పోటీలను పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారుల గౌరవ వందనాన్ని స్వీకరించిన అనంతరం క్రీడలను ఉద్దేశించి ప్రసంగించారు. ఇటీవల జరిగిన 4వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ క్రీడల్లో సిద్దిపేట కమిషనరేట్ పోలీసులు అద్భుత ప్రతిభ కనబరిచిందని కమిషనర్ ప్రశంసించారు.ఈ పోటీల్లో మన సిద్దిపేట విభాగం:

3 బంగారు పతకాలు
2 వెండి పతకాలు
7 కాంస్య పతకాలు

మొత్తం 12 పతకాలను సాధించి కమిషనరేట్ కీర్తిని రాష్ట్ర స్థాయిలో చాటిన విజేతలను ప్రత్యేకంగా అభినందించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.నిరంతరం విధులతో ఒత్తిడికి గురయ్యే పోలీస్ సిబ్బందికి క్రీడలు ఎంతో ఉపశమనాన్ని ఇస్తాయని తెలిపారు. క్రీడల వల్ల తోటి సిబ్బందిలో స్ఫూర్తిని నింపుతాయని, మైదానంలో ఆడే శారీరక క్రీడలు ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తాయి. అధికారులు మరియు సిబ్బంది సమయాన్ని వృథా చేసే, ఆర్థికంగా నష్టపరిచే ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆకర్షితులు కావద్దని, అటువంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. క్రీడా స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ తమ ప్రతిభను చాటాలని ఆకాంక్షిస్తూ, క్రీడాకారులందరికీ శుభాకాంక్షలు తెలిపి పోటీలను అధికారికంగా ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ అడ్మిన్ కుశాల్కర్, అదనపు డీసీపీ ఎఆర్ సుభాష్ చంద్రబోస్, ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం.. బ్రిడ్జి పై నుంచి ఆర్టీసీ బస్సు

**ఆదిలాబాద్ ఫిబ్రవరి 23: పెన్ పవర్:** ఆదిలాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఉట్నూరు మండలం శ్యామ్‌పూర్‌లో సోమవారం ఉదయం బ్రిడ్జి పై నుంచి ఆర్టీసీ బస్సు కింద పడింది. ఈ ఘటనలో ఐదుగురు ప్రయాణికులు గాయపడ్డారు.ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలికి వచ్చిన పోలీసులు, అత్యవసర సేవల సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన బస్సును ఆసిఫాబాద్ డిపోనకు చెందినదిగా గుర్తించారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

## 'గోవర్ధనగిరిధారి' అలంకరణలో యాదగిరీశుడు భక్తుఇలకు దర్శనం

**యదాద్రి భువనగిరి ఫిబ్రవరి 23 పెన్ పవర్:** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజైన సోమవారం యాదగిరీశుడిని 'గోవర్ధనగిరిధారి' అలంకరణలో భక్తులు సేవించారు. భక్తజన రక్షణే ధ్యేయంగా అవతారాలు దాల్చిన స్వామివారు ప్రకృతి బీభత్సం నుంచి కాపాడే భక్తజన బాంధవుడిగా శ్రీకృష్ణుడి లీలలను ప్రతిబింభించే అలంకరణలో దివ్య మనోహరంగా భక్తజనులకు దర్శనమిచ్చారు. తన చిటికెన వేలుతో గోవర్ధన పర్వతాన్ని ఎత్తిపట్టి గోపాలులను రక్షించిన మహిమలను అర్చకులు అలంకార విశిష్టతను భక్తులకు వివరించారు.భక్తుల గోవిందనామ స్మరణల మధ్య వైభవంగా ఊరేగించారు.

## మోస్ట్ వాంటెడ్ డ్రగ్ మాఫియా డాన్ ఎల్ మెంచో హతం

**హైదరాబాద్ పెన్ పవర్:** మెక్సికో లో మోస్ట్ వాంటెడ్ డ్రగ్ మాఫియా డాన్ నెమెసియో రూబెన్ ఒసెగుయెరా అలియాస్ 'ఎల్ మెంచో హతమయ్యాడు. ఆదివారం జరిగిన ఆపరేషన్‌లో మెంచోను మట్టుబెట్టినట్లు మెక్సికో ఆర్మీ వెల్లడించింది. అయితే ఈ ఘటన మెక్సికో వ్యాప్తంగా హింసాత్మక ఘటనలకు తెరలేపింది. ఎల్ మెంచో అనుచరులు దేశంలోని పలు రాష్ట్రాల్లో హింసకు పాల్పడ్డారు. వాహనాలను, దుకాణ సముదాయాలను తగులబెట్టారు.కాగా, 59 ఏళ్ల ఎల్ మెంచోను పట్టుకోవడం కోసం మెక్సికో సైన్యం ఆదివారం స్పెషల్ ఆపరేషన్ చేపట్టింది. అమెరికా నిఘావర్గాల సమాచారం మేరకు జాలిస్కో రాష్ట్రంలోని తపాల్ప పట్టణంలో అతడు దాగి ఉన్న ప్రాంతాన్ని చుట్టుముట్టింది. ఈ క్రమంలో మెంచో అనుచరులు సైనికులపై కాల్పులకు పాల్పడ్డారు. దాంతో సైన్యం ఎదురుదాడి చేసింది. ఈ భీకర ఆపరేషన్‌లో మెంచో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని సైనికులు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. ఈ విషయాన్ని మెక్సికో సైన్యం వెల్లడించింది.మెక్సికో సైన్యం చేపట్టిన ఆపరేషన్‌లో ఎల్ మెంచోతోపాటు అతడి ముఠాకు చెందిన మరో ఆరుగురు కూడా మరణించినట్లు అధికారులు తెలిపారు. అయితే మెంచోను అంతం చేయడానికి ప్రతీకారంగా అతడి అనుచరులు మెక్సికోలోని పలు రాష్ట్రాల్లో హింసాత్మక ఘటనలకు పాల్పడ్డారు. పలు ప్రాంతాల్లో వాహనాలను తగలబెట్టారు. రహదారులను దిగ్బంధించారు. సూపర్ మార్కెట్లు, బ్యాంకులకు నిప్పంటించారు. ఆందోళనలను అణిచివేసేందుకు సైన్యం బలగాలను భారీగా మోహరించింది. దాంతో మెక్సికోలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.కాగా, ఎల్ మెంచో 2009లో జాలిస్కో న్యూ జనరేషన్ కార్టెల్ (జజీచీ+) అనే మాదకద్రవ్యాల ముఠాను స్థాపించాడు.

## పత్తి రైతులకు వారం రోజుల్లో బకాయిలు విడుదల చేయాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** కాంగ్రెస్ ప్రభుత్వం 15 లక్షల మంది రైతులకు రుణమాఫీ ఎగ్గొట్టింది. ప్రజల కోసం కొత్త ఆయుధాన్ని సిద్ధం చేస్తున్న.. ఆ ఆయుధం మీ చేతిలో రాజకీయ అస్త్రమవుతది. రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడుదు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు కచ్చితంగా బుద్ధి చెబుతారని జాగృతి అధినేత కవిత అన్నారు.

జోగులాంబ గద్వాల్ లో జరిగిన రైతు సంఘర్షణ సభ లో ఆమె మాట్లాడారు.నడిగడ్డ సీడ్ పత్తి రైతులకు వారంలోగా బకాయిలు చెల్లించాలి. లేదంటే రైతులందరితో కలిసి గద్వాల్ దీక్ష చేపడతాం. తుమ్మిళ్ల, నెట్టింపాడు పనులు చూసి నత్తలు కూడా సిగ్గుపడుతున్నాయి. నడిగడ్డ ప్రజలను బీఆర్ఎస్ మోసం చేసింది. కాంగ్రెస్ కూడా అన్యాయం చేస్తోంది. రైతుల గురించి నిలదీసే కొత్త రక్తాన్ని ప్రోత్సహించాలని కోరుతున్నానని అన్నారు.

నాగర్ కర్నూల్ లో కూలం పేరుతో దూషించి కొట్టటంతో రెండు నెలల చిన్నారి చనిపోయింది. ఈ సంఘటన చాలా బాధ కలిగించింది. పాప మృతికి సంతాపంగా మౌనం పాటిద్దాం. ఇలాంటి కుల వివక్ష మన తెలంగాణలో ఉండకూడదు. జోగులాంబ అమ్మవారంటే నాకు చాలా సెంటిమెంట్ ఉంది. తెలంగాణ ఉద్యమ సమయంలో ఏ కీలకమైన కార్యక్రమమైనా ఉత్తర తెలంగాణ నుంచి ప్రారంభమయ్యేది. కానీ జాగృతి తరపున భవిష్యత్ లో ఏ కార్యక్రమం జరిగిన సరే జోగులాంబ గద్వాల్ నుంచే ప్రారంభిస్తాం. ఎందుకంటే నడిగడ్డ ప్రజలు నీతి, నియత్ ఉన్న మంచివాళ్లు. అలాంటి ప్రజల నుంచి గడ్డ నుంచి ఏ కార్యక్రమం మొదలు పెట్టిన సరే అమ్మవారి ఆశీస్సులు తప్పకుండా ఉంటాయని నమ్ముతున్నానని అన్నారు.

మహిళలు లేకుండా ఏ పంట కూడా చేతికి రాదు. కుటుంబాన్ని వదిలి కన్న బిడ్డ మాదిరిగా పంటను చూసుకుంటారు మహిళలు. ఇక్కడి సీడ్ పత్తి విత్తనమే దేశం మొత్తం వెళ్తుంది. కానీ కంపెనీలు మాత్రం ప్రజలను నిమిష, నిమిషానికి వేధిస్తున్నారు. మీ కష్టాన్ని వాళ్ల దగ్గర పెడుతున్నారు. కానీ మీకు డబ్బులు మాత్రం రావటం లేదు. బకాయిలు చెల్లిస్తామంటూ కలెక్టర్ ముందు చెప్పిన సరే ఆ తర్వాత ఇవ్వటం లేదు. సీడ్ పత్తి రైతులకు వారం రోజుల్లో బకాయిలు విడుదల చేయాలి. లేదంటే తెలంగాణలో రైతులందరితో కలిసి ఈ ప్రాంతంలో దీక్ష చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నా. అందరూ కూడా ఇద్దరు అన్నలకు భయపడుతారు. ఒకటి అడవిలో అన్నకు, రెండోది రైతన్నకు. కానీ ఓ వైపు అడవిలో అన్నలను అత్యంత అమానవీయంగా చంపేస్తున్నారు. రైతన్నను కూడా దారుణంగా ఇబ్బంది పెడుతున్నారని అన్నారు.

అర్ధరాత్రి కరెంట్ ఇవ్వటంతో రైతులంతా కుటుంబాన్ని వదిలి రాత్రి పూట పొలాలకు వెళ్లాల్సిన పరిస్థితి వస్తోంది. పాములు, తేళ్ల భయంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇక రైతులకు కనీసం యూరియా కూడా ఇవ్వటం చేతకావటం లేదు. యాప్ ద్వారా రైతులు యూరియా బుక్ చేసుకోవాలంట. రైతుల దగ్గర స్మార్ట్ ఫోన్లు లేవు. ప్రభుత్వమే అందరికీ ఐ ఫోన్లు ఇచ్చి తర్వాత యాప్ ద్వారా బుక్ చేసుకోమని చెప్పాలి. యూరియా ఇవ్వటం చేతకాకపోవటం కారణంగానే కొర్రీలు పెడుతున్నారు. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం తాము అధికారంలోకి వచ్చిన వెంటనే సోనియమ్మ పుట్టిన రోజు నాడు రుణమాఫీ అని ప్రకటించింది. కుటుంబంలో ఉన్న అందరూ 2 లక్షలు రుణం తెచ్చుకోవాలని రేవంత్ రెడ్డి చెప్పిండు. కానీ



రైతులందరికీ మాత్రం రుణమాఫీ చేయలేదు. 40 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేస్తామని ప్రగల్భాలు పలికి 25 లక్షల మంది రైతులకే రుణమాఫీ చేశారు. ఈ లెక్కలపై చర్చకు రావాలని మేము ఛాలెంజ్ చేసిన ప్రభుత్వం సైలెంట్ గా ఉండిపోయింది. ఇంకా 15 లక్షల మంది రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారు. 50 వేలు, లక్ష రుణం తీసుకున్న రైతులకు కూడా రుణమాఫీ కావటం లేదు. ప్రతి రైతుకు రుణమాఫీ చేయాల్సిందేనని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. రైతు భరోసా వేశాక జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు పెడతానని సీఎం చెబుతున్నాడు. రైతు భరోసా అనేది ఎన్నికలకు ఇచ్చే గిఫ్ట్ మాదిరిగా చేస్తున్నారు. ఎన్నికలప్పుడు మాత్రమే రైతు గుర్తుకు వస్తున్నాడు. సర్పంచ్ ఎన్నికల్లో నారాణయ పేట్ దగ్గర మా తమ్ముడు గవినోళ్ల శ్రీనివాస్ ఏకగ్రీవంగా సర్పంచ్ గా ఎన్నికయ్యారు. సర్పంచ్ ఎన్నికల్లో జాగృతి బోణీ కొట్టింది. మున్సిపల్ ఎన్నికల్లో కూడా వడ్డెపల్లి మున్సిపాలిటీని గెలుచుకున్నాం. గద్వాల్ నుంచే జాగృతి జైత్రయాత్ర మొదలైందని అన్నారు.

వాళ్లు మనతో ఉన్నారా? లేదా అన్నది తర్వాత విషయం. ఏ పార్టీలో గెలిచినా సరే ముఖ్యమంత్రి వాళ్లను తమ పార్టీలోకి లాక్కుంటున్నాడు. గద్వాల్ జిల్లాలో ఇలాంటి పిచ్చి రాజకీయాలు నడుస్తున్నాయి. గద్వాల్ లో ఉన్న ఎమ్మెల్యే గారు రేపు ప్రెస్ మీట్ పెట్టి ఏ పార్టీలో ఉన్నారో చెప్పండి. ఏ పార్టీలో ఉన్నావో చెప్పలేని ఎమ్మెల్యే ఎందుకు? అలాంటి వ్యక్తి ప్రజలకు ఏమీ చేస్తాడో ఎలా చెప్పగలడు? నన్ను బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేస్తే...ఎమ్మెల్సీ పదవికి నిమిషాల్లో రాజీనామా చేశా. రాజకీయాలు చేయాలంటే ధైర్యం, నియత్ ఉండాలి. ఇప్పటికీ కూడా ఇక్కడి ఎమ్మెల్యే తన జీతం నుంచి బీఆర్ఎస్ కు పార్టీ ఫండ్ వెళ్తుందని చెబుతున్నాడని అన్నారు. ఇవ్వటానికి ఎమ్మెల్యేకు, తీసుకోవటానికి బీఆర్ఎస్ కొంచెమైనా ఇంగితం ఉండాలి. కృష్ణమ్మ, తుంగభద్ర నదులు మనల్ని దాటుకొని వెళ్తున్న సరే నీళ్లు రావటం లేదు. తుమ్మిళ్ల, నెట్టింపాడు పనులు నత్త నడకన సాగుతున్నాయి. నత్తాలు కూడా సిగ్గుపడుతున్నాయి. ఇలా అయితే నడిగడ్డకు నీళ్లు ఎప్పుడు రావాలి. రైతులు గుండె మీద చేయి వేసుకొని ఎప్పుడు హాయిగా ఉండాలి? నడిగడ్డను పూర్తిగా అన్యాయం చేసి మోసం చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వం. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఈ ప్రాంతానికి న్యాయం చేయటంలో ఫెయిల్ అయ్యింది. అందుకే మన ప్రతి సమస్యను అడిగే వ్యక్తులే మన ప్రజాప్రతినిధులుగా ఉండాల్సిన అవసరముంది. అందుకే మీకోసం నిలదీసే ఆయుధాన్ని సిద్ధం చేస్తున్నాం. మీ ఆశీస్సులు కావాలి. మేము తెచ్చే ఆయుధం నడిగడ్డకు నీళ్లు తెచ్చే వజ్రాయుధం అవుతుంది. గద్వాల్ జిల్లాలో అత్తా, అల్లుడే కాదు కొత్త నాయకత్వం కూడా రాబోతోంది. మీకోసం కొట్లాడుతున్న రంజిత్ ను మీరు కచ్చితంగా గెలిపించుకోవాల్సిన అవసరముందని అన్నారు.

త్వరలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు రాబోతున్నాయి. మళ్లీ డబ్బుల మూటలతో వస్తారు. వారిచ్చే డబ్బులు తీసుకోండి. అవి మీ నెత్తి కొట్టి సంపాదించిన డబ్బులే. కానీ ఓటు మాత్రం మీ కోసం పనిచేసే వారికే వేయండి.

రైతు ఏడ్చినా రాజ్యం బాగుపడుదు. ఈ ప్రభుత్వం రైతును ఏడిపిస్తోంది. కచ్చితంగా ఈ ప్రభుత్వం ఎక్కువ కాలం నిలబడదు. రైతుల సమస్యలపై కలెక్టర్ కు వినతి పత్రం ఇచ్చేందుకు అందరం కలిసి వెళ్దాం. రైతుల కోసం మిట్ట మధ్యాహ్నం జాగృతి వాళ్లు నడుస్తున్నారని అందరికీ తెలియాలి. రైతులు, ఆడబిడ్డలు అన్ని అంశాలపై నేను ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటా. మహిళకు ఇస్తానన్న రూ. 2500, తులం బంగారం ఇవ్వాల్సిందేనని అన్నారు.

## రాబోవు రోజుల్లో మరింత శ్రమిస్తే జాతీయ స్థాయిలోను రాణించచగలం

**-వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ప్రీత్ సింగ్,**
**రాష్ట్ర స్థాయి క్రీడల్లో రాణించిన పోలీస్ క్రీడాకారులకు అభినందన సభ.**
**-విధి నిర్వహణలో ఎన్ని ఒత్తిళ్ళు వున్న పతకాలను సాధించడం అభినందనీయం**

**వరంగల్: పెన్ పవర్:** మరింత శ్రమిస్తే జాతీయ స్థాయిలో కూడా పతకాలను సాధించగలమని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. సైబరాబాద్ కమిషనరేట్ వేదికగా జరిగిన రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో పతకాలను సాధించిన వరంగల్ కమిషనరేట్ పోలీస్ క్రీడాకారులకు అభినందన సభను సోమవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయము ఏర్పాటు చేసారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ప్రీత్ సింగ్ ముఖ్య అతిధిగా పాల్గోన్న ఈ అభినందన కార్యక్రమములో పోలీస్ కమిషనర్ ముందుగా పతాకాలను సాధించిన క్రీడాకారులను వ్యక్తిగతంగా కలిసి అభినందనలు తెలియజేసారు. ఈ సందర్భంగా హాకీ క్రీడాకారులు సంయుక్తంగా కలసి వరంగల్ పోలీస్ కమిషనర్కు హాకీ జెర్సీని బహుకరించడంతో పాటు, ఈ రాష్ట్ర స్థాయిలో క్రీడల్లో టెబుల్ టెన్నిస్ క్రీడలో కాంస్య పతకాన్ని సాధించిన వరంగల్ పోలీస్ కమిషనర్కు ఈస్ట్జోన్ డిసిపి అంకిత్ కుమార్ చేతుల మీదుగా సీపీ పతకాన్ని అందజేసారు. అనంతరం పోలీస్ కమిషనర్ క్రీడాకారులను ఉద్యేశిస్తూ మాట్లాడుతూ ముందుగా పతకాలను గెలిచిన క్రీడాకారులతో పాటు, ఈ క్రీడల్లో పాల్గోన్న క్రీడాకారులకు సైతం అభినందనలు తెలియజేస్తూ, వరంగల్




కమిషనరేట్ పోలీస్ క్రీడాకారులు ఈ రాష్ట్రా స్థాయిలో క్రీడల్లో అద్భుత ప్రదర్శనతో గత ఏడాది కంటే ఎక్కువ సంఖ్యలో పతకాలను కైవసం చేసుకోవడం చాలా సంతోషాన్ని కలిగిస్తోందని. ఇదే ప్రదర్శన రాబోవు రోజుల్లో కనబర్చాలని, ముఖ్యంగా జాతీయ స్థాయిలో జరిగే క్రీడల్లో పతకాలను సాధించేందుకుగా ముమ్మరంగా సాధన చేయాలని, క్రీడల్లో రాణించే వారికి తప్పక సహకారం అందించడం జరుగుతుందని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలియజేసారు.

ఈ కార్యక్రమములో డిసిపిలు దార కవిత, అంకిత్ కుమార్, ట్రైనీ ఐపిఎస్ మనిషా నేహ్రా, అదనపు డిసిపిలు సురేష్ కుమార్, రవి, శ్రీనివాస్, ఏసిపిలు నాగయ్య, సురేంద్ర, జితేందర్ రెడ్డి, మధుసూదన్, అంతయ్య, ఆర్.ఐలు స్పర్జన్ రాజ్, సతీష్, ఇన్స్పెక్టర్ శుకూర్, ఆర్.ఎస్.ఐ శరత్, మణి కృష్ణ ఇతర పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గోన్నారు.

# గ్రెగేరియన్ కేలండర్ మొదలైన రోజు

ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అనుసరిస్తున్న గ్రెగేరియన్ కేలండర్ ఎప్పుడు రూప కల్పన చేయబడి అమలుకు నోచుకున్నదో తెలుసా? క్రీస్తు శకం 1582 ఫిబ్రవరి 24వ తేదీన. నేపుల్సుకు చెందిన అలోయిసియస్ లిలియస్ అనే వైద్యుడు జూలియన్ కాలెండరుకు చేసిన సవరణల ఫలితమే నూతన గ్రెగేరియన్ కేలండర్. దీన్ని పోప్ గ్రెగొరీ 13 తయారు చేయించి 1582 ఫిబ్రవరి 24 న అమలు పరచాడు. ఆయన పేరు మీదుగా దీనికి గ్రెగోరియన్ కాలెండరు అనే పేరు వచ్చింది. దీనికి సంబంధించిన పూర్వాపరాలు తెలుసుకుందాం.

ప్రపంచంలో వివిధ ప్రాంతాలలో సంవత్సరాది పండగను వివిధ దినాలలో జరుపుకుంటారు. ఇలా జరుపుకోవడానికి కారణం సంవత్సర పరిగణన వేరువేరు మాసాలలో జరగడమే. ప్రపంచంలో అత్యధికులు ఆచరించేది ప్రస్తుత గ్రెగేరియన్ క్యాలెండర్ క్రీ.శ.1582లో రూపొందించినది. జనవరి 1వ తేదీన నూతన సంవత్సర తొలి రోజును పండగలా జరుపుకోవడం నాటికి కొత్త విషయం.క్రీ.పూ.2000లో వసంత సమరాత్రి సమయాన మార్చి మధ్య కాలంలో మెసపొటేమియాలో నూతన సంవత్సర ఉత్సవాలు తొలి నాళ్ళలో జరుపుకునే వారు. అలాగే వివిధ ప్రాంతాలలో రుతు సంబంధంగా ప్రాచీనులు విభిన్న రోజులలో సంవత్సరాదిని పాటించేవారు. ఈజిప్టియన్లు, ఫొయెనిషియన్లు, పర్షియన్లు సమరాత్రి ప్రారంభం, గ్రీకులు శీతకాల ఆయనాంత సమయాన జరుపుకునే వారు. పూర్వపు రోమన్లు మార్చి నెల 1వ తేదీని కొత్త సంవత్సర ఆరంభ దినంగా నియమం పెట్టుకున్నారు.ఆనాటి క్యాలెండర్ మార్చితో ప్రారంభమై 10నెలలతో కూడి ఉండేది. లాటిన్ లో "సెప్టెం" అనగా ఏడు అని, "అక్టో" అనగా ఎనిమిది అని "నొవం" అనగా తొమ్మిది అని, "దశం" అనగా పది అని అర్థం. క్రీ.పూ.153లో ప్రప్రథమంగా జనవరి 1న నూతన సంవత్సర తొలి రోజుగా పరిగణించారు. వాస్తవానికి క్రీ.పూ.700 వరకు జనవరి మాసం ఉనికే లేదు. రోమ్ రెండవ రాజైన నుర్మా పొంటిలియస్ జనవరి, ఫిబ్రవరి మాసాలను జత చేయడం జరిగింది. రోమ్ సామ్రాజ్యంలో పౌర యుద్ధం చోటు చేసుకుని, గణతంత్ర రాజ్యంలో ఇరువురు ఉన్నతాధికారులైన అమాత్యులు కొత్తగా ఎన్నికైన సందర్భాన వారి పదవీ కాలాన్ని ఏడాదిగా నిర్ణయించారు. ఆ సందర్భంగా మార్చి నుండి జన వరికి తొలి రోజును మార్చినా, అది ఖచ్చితంగా పాటించ బడలేదు. అప్పటికీ మార్చి 1ననే కొత్త సంవత్సర వేడుకలు జరిగేవి.క్రీ.పూ.46లో జూలియస్ సీజర్ ప్రాచీన చాంద్రమా నాధారిత రోమన్ క్యాలెండర్ ను మెరుగు పరిచి, సౌర మాన ఆధారిత నూతన క్యాలెండర్ ను పరిచయం చేయగా, సదరు క్యాలెండర్ జనవరి 1ననే కొత్త సంవత్సర ప్రారంభ దినంగా పరిగణింప చేయగా, అది క్రమేణ నిలకడగా పాటించ బడింది. మధ్య యుగాన ఐరోపాలో నూతర వత్సర సంబరాలు అన్యమత సంబంధమైనవిగా భావించ బడగా, క్రీ.శ.567లో జనవరి 1వ తేదీన నూతన సంవత్సర ప్రారంభ దినాన్ని పాలకులచే రద్దు చేయబడింది. మధ్యయుగ క్రైస్తవులు ఐరోపాలో చాలా వరకు కొత్త సంవత్సర దిన వేడుకలను జీసస్ జన్మదిన సందర్భంగా డిసెంబర్ 25న, మార్చి 1న, మార్చి 25న, ఈస్టర్ సందర్భంగా పాటించేవారు.నేపుల్సుకు చెందిన అలోయిసియస్ లిలియస్ అనే వైద్యునిచే 1582వ సంవత్సరం ఫిబ్రవరి 24వ తేదీన సంస్కరింపబడి, జూలియన్ కాలెండరుకు పునరుద్దరింప బడిన గ్రెగేరియన్ క్యాలెండర్ జనవరి 1వ తేదీని నూతన సంవత్సర తొలి రోజుగా ప్రకటింపగా, వెనువెంటనే చాలా వరకుక్యాథలిక్ దేశాలు స్వీకరించాయి. తర్వాత క్రమంగా ప్రొటెస్టెంట్ దేశాలు కూడా స్వీకరించాయి. అయితే 1752 వరకు బ్రిటిషర్లు స్వీకరించలేదు. అప్పటికీ బ్రిటిష్ సామ్రాజ్యం, వారి అమెరికన్ కాలనీలు మార్చి మాసంలోనే నూతన సంవత్స వేడుకలు జరుపుకునే వారు. 1752 తర్వాత బ్రిటిష్ రాచరిక పాలకులు తమ ఆధీనంలోని దేశాలన్నింటిలో జనవరి 1వ తేదీని నూతన సంవత్సర తొలి రోజుగా ఆచరించే చర్యలు గైకొన్నారు. మొట్టమొదటి సారిగా గ్రెగేరియన్ క్యాలెండర్ కు, జూలియస్ సీజర్ క్యాలెండర్ కు గల రోజుల వ్యత్యాసాన్ని సవరించి, 1582 అక్టోబర్ మాసంలో 5 నుండి 14వ తేదీలను ఇటలీ, పోర్చుగల్, స్పెయిన్, పోలండ్ దేశాలలో లేకుండా చేసి, 4తర్వాత 15ను మార్చడం జరిగింది. 1752 సెప్టెంబరులో 3నుండి 13 తేదీలు తొలగించి, 11రోజులను లేకుండా సరి చేశారు..

జనవరి 7 ఈజిప్టియన్లు, 11న ఓల్డ్ స్కాటిష్, 14న ఈస్టర్న్ ఆర్థడాక్స్, 21న కొరియన్లు, మార్చి 1న రోమన్లు, ఏప్రిల్ 13,14ను (బైసాకి) నానక్ సాహి క్యాలెండర్ ఆధారంగా సిక్కులు, ఉగాదిని తెలుగువారు, ఏప్రిల్ 14ను ఆగ్నేయాసియా దేశాలు, ఏప్రిల్ మొదటి వారంలో పౌర్ణమిని బౌద్ధులు, మొహర్రం నెల మొదటి రోజు ఇస్లాం, జూన్ 21ని ఏనిషియెంట్ గ్రీక్, జూలై 8ని ఆర్మేనియన్, ఆగస్టు 8ని మళయాళీలు, 23ను జొరాస్ట్రియన్, సెప్టెంబర్ 1ని రష్యన్ ఆర్తడాక్స్ క్రిస్టియన్, 11ను ఇథియోపియన్, అక్టోబర్ 3ను మొరాకో, నవంబర్ లో దీపావళిని జైనులు, డిసెంబర్ లో సిక్కిం న్యూ ఇయర్ డేగా పాటించడం ఆనవాయితీ.

# ప్రజాసేవలో మేటి జెట్టి

ఆమె బాబాసాహెబ్ అంబేడ్కర్ అడుగు జాడలలో నడిచిన ధీర వనిత. రాజకీయాలలో నైతిక విలువల కోసం ఉద్యమించిన నిజాయితీ పరురాలు. ఉత్తమ శాసన సభ్యురాలు, నిరాడంబ రతకు, నిస్వార్థ సేవకు ప్రతిరూపం. దేశభక్తి, ప్రజాసేవ, మహిళా భ్యుద యం ఆమె దృక్పథం. లంచగొండి అధికారులకు సింహ స్వప్నం. భార తీయ రిపబ్లికన్ పార్టీ నాయకురా లిగా, అంబేద్కరు వాది గా, దళిత సంక్షేమ కర్తగా,సమాజ సేవకురా లిగా సుపరిచితులు. ఆమే జెట్టి ఈశ్వరీబాయి. ఆమె పోరాట పటిమ చరిత్రలో అద్వితీయం, అనితర సాధ్యం.

పూర్వపు హైదరాబాద్ సంస్థానంలో సామాజిక సేవారంగంలో గణనీయ మైన కృషి సలిపిన వారిలో ఒకరు జెట్టి ఈశ్వరీబాయి. తరతరాల నుంచి సమాజంలో పీడనకు గురి అవుతూ, బానిసత్వంలో మగ్గుతూ అణగారిన ప్రజలకు విముక్తి కలిగించ డానికి ఆమె చేసిన కృషి చిరస్మరణీయం.ఈశ్వరీబాయి తన బాల్యం నుంచి స్త్రీ, పురుషుల మధ్య కులాలు, మతాల మధ్య ఈ అంతరాల గురించి ఆలోచించేది, మదన పడేది. ఉద్యమించకుండా, పోరాడ కుండా, ఆత్మగౌరవంతో ప్రజలకు ఏదీ దక్కదని అర్థం చేసుకుని ప్రజలను అందుకు సన్నద్ధం చేసేది. చిన్న, సన్నకారు రైతుల సమస్య లు, రైతు కూలీల కనీస వేతనాలు, ఎస్సీ, ఎస్టీలకు బంజరు భూమితో పాటు ఇండ్ల స్థలాల కేటాయింపు, చేనేత, బీడీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆర్పీఐ నాయ కత్వంలో ఆమె అనేక ఉద్యమాలు నిర్వహించారు.

ఈశ్వరీబాయి 1918, డిసెంబరు 1 వ తేదీన సికింద్రాబాదు లోని చిలకల గూడలో ఒక సామాన్య దళిత కుటుంబంలో జన్మించారు. తల్లి రాములమ్మ, తండ్రి బల్లెపు బలరామ స్వామి. ప్రాథమిక విద్య ఎస్.పి.జి. మిషన్ పాఠశాలలో, అనంతరం కీస్ హైస్కూలులో ఉన్నతవిద్య చదువుకున్నారు. ఆమె వివాహం 13వ ఏటనే పూణే లోని ఒక సంపన్న కుటుంబానికి చెందిన దంత వైద్యుడు జెట్టి లక్ష్మీనారాయణతో జరిగింది. ఆమెకు ఒక కూతురు పుట్టిన అనంతరం భర్త చనిపోగా, ఈశ్వరీ బాయి కూతుర్ని తీసుకొని హైదరా బాదులోని పుట్టింటికి తిరిగి వచ్చారు. తన కాళ్ళపై తాను నిలబడి, సాంఘిక అభ్యుదయానికి కృషి చేశారు. చిలకలగూడా లోని మురికివాడలకి వెళ్లి వయోజ నులకు చదువు చెప్తానని ఈశ్వరీబాయి అక్కడ ఓ బోర్డు పెట్టి, ఓ వరండాలో అందరినీ జమచేసి చదువు చెప్పేవారు. భర్త చనిపోయి పుట్టింట్లో ఉన్నా ఈశ్వరీబాయి ఎవరిమీదా ఆధార పడకుండా స్వతంత్రంగా జీవించా రు. మెట్రిక్ పాసై పరోపకారిణి అనే ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయు రాలిగా వృత్తి జీవితం ప్రారంభిం చారు.. ఆ పాఠశాలలో పనిచేస్తూనే కొందరు సంపన్న కుటుంబాల పిల్లలకు బోధనా తరగతులను నిర్వహించేవారు. స్వంత డబ్బు తోనే గీతా ప్రైమరీ స్కూలు, గీతా మిడిల్ స్కూలు అనే విద్యా సంస్థలను ప్రారంభించారు. ఈశ్వరీ బాయికి తెలుగు, హిందీ, ఉర్దూ, మరాఠీ, ఇంగ్లీషు భాషలలో మంచి పరిజ్ఞానం ఉండేది. హైదరాబాదు ప్రజలతో కలిసి పనిచేయడానికి బహుభాషా పరిజ్ఞానాన్ని ఆమె సద్వినియోగ పరుచుకున్నారు. ఎవరు ఏ భాషలో మాట్లాడితే ఆ భాషలోనే సమాధాన మిచ్చేవారు. అలా అందరికీ ఆత్మీయు లయ్యారు. ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం చేస్తూనే, సాంఘిక సేవలో పాల్గొన్నారు. ఈశ్వరీబాయి రెడ్ క్రాస్ సొసైటీ జీవిత కాలపు సభ్యురాలుగా, చాలా కార్యక్రమా ల్లో పని చేశారు. 1951లో హైదరాబాదు – సికింద్రా బాదు నగర పురపాలక సంఘానికి ప్రజాస్వామ్య రీతిలో తొలిసారిగా ఎన్నికలు జరగగా. ఆమె చిలకల గూడ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి, విజయం సాధించారు. కౌన్సిలరుగా మురికివాడల్లో మంచి నీటి సౌకర్యం, వీధి దీపాల ఏర్పా ట్లు, మరుగుదొడ్ల నిర్మాణం ఇతర ఎన్నో కార్యక్రమాలను చేపట్టారు. కార్మికులకు ఇళ్లస్థలాలను ఇప్పిం చారు. మున్సిపల్ కౌన్సిలర్గా శక్తివంచన లేకుండా అహర్నిశలు శ్రమించారు. కౌన్సిలరుగా రెండు పర్యాయాలు పని చేశారు. వెను కటి హైదరాబాద్ రాష్ట్రంలో షెడ్యూ ల్డు కులాల ప్రజల సంక్షేమానికి 1950లో షెడ్యూల్డు కులాల ఫెడరేషన్ అనే కొత్త కమిటీ ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత ఎ.పి. షెడ్యూల్డు కులాల ఫెడరేషన్ గా రూపొందింది. దీనికి ఈశ్వరీ బాయి ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 1956 అక్టోబర్ ఇందిరాగాంధీ విధించిన ఎమ ర్జెన్సీని సైతం వ్యతిరేకించి శాసన సభ నుండి వాకౌట్ చేసి ఈశ్వరీ బాయి సంచలనం సృష్టించారు. పెద్ద మనుషుల ఒప్పందాన్ని ఉపేక్షించడాన్ని దుయ్యబట్టారు. తెలంగాణలో అమలవుతున్న నిర్బంధం, తెలంగాణ ఉద్యమంలో పాల్గొని కాల్పులలో మరణించిన అమరుల గూర్చి, ఆంధ్ర ప్రాంతం వారు తెలంగాణ ప్రాంతానికి చేస్తున్న అన్యాయం గురించి శాసన సభలో ఆమె సింహగర్జన చేశారు. సాంఘిక దురాచారాలైన జోగిని వ్యవస్థకు, రెండు గ్లాసుల పద్ధతికి వ్యతిరేకంగా బొజ్జా తారకం, సౌడ కాంతయ్యలతో కలిసి ఆమె అలుపెరుగని పోరాటం చేశారు. ఈశ్వరీబాయి కొంతకాలం మహిళా, శిశు సంక్షేమ బోర్డుకు అధ్యక్షు రాలిగా ఉన్నారు.

1952 నుండి 1990 వరకు నాలుగు దశాబ్దాలకు పైగా ప్రజాసేవా రంగంలో పనిచేస్తూ దళిత ప్రజలు, వెనుకపడిన, బలహీ న, బడుగువర్గాల, మహిళల అభ్యు దయానికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టి వాటిని అమలు జరిపారు. ఈశ్వరీబాయి జ్ఞాపకార్థం ట్రస్టు, నర్సింగ్ కాలేజి నిర్వహించ బడుతున్నాయి.ఈశ్వరీబాయి ఏకైక పుత్రిక జె. గీతారెడ్డి. ఆమెను వైద్య విద్యలో పట్టభద్రురాలను చేసి, విదేశాలలో ఉన్నత చదువులు చదివించి డాక్టర్ని చేశారు. తన వలెనే తన కూతురు కూడా సమాజసేవలో పాల్గొనాలని ఆమె అభిలషించారు. గీతారెడ్డి రాష్ట్ర మంత్రిణిగా పనిచేశారు.ఈశ్వరీబాయి క్యాన్సర్ వ్యాధికి గురై 1991, ఫిబ్రవరి 24 వ తేదీన హైదరాబాదులో మరణించారు.

# అటా..ఇటా..? కారా...హస్తమా.. ?

## సందిగ్ధంలో పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం

**సంగారెడ్డి: పెన్ పవర్:** బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక పటాన్చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కారు దిగి హస్తం గూటికి చేరిన విషయం తెలిసిందే. వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన గూడెం మహిపాల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే సోదరుడు మధుసూదన్ రెడ్డి పేరుతో ఉన్న క్రషర్ల వద్ద తనిఖీలు చేయడం, ఈడీ దాడులు జరగడం, ఆ పై మధుసూదన్ రెడ్డి అరెస్టు, రూ. 300 కోట్ల మేర క్రషింగ్ లో అక్రమ మైనింగ్ జరిగిందని అధికారులు గుర్తించడం ఈ వరుస వివాదాలతో మహిపాల్ రెడ్డి అప్పట్లో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. తన సోదరుడు మధుసూదన్ రెడ్డిమనోవేదనకు గురై కన్నీళ్లు పెట్టుకున్న సందర్భం కూడా లేకపోలేదు. కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఏనాడూ అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్న దాఖలాలు లేవని కనీసం ఇన్చార్జి మంత్రి కొండా సురేఖ వచ్చినా వెళ్లకుండా నిమ్మకుండి పోయారు. ఇదే క్రమంలో పటాన్చెరువు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరినా ఏనాడు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడం లేదని, కాంగ్రెస్ పార్టీ నాయకులను దూరం పెడుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డి ఫోటోని పెట్టకుండా మాజీ సీఎం కేసీఆర్ ఫోటోని ఎందుకు పెట్టారని ఆందోళనకు దిగారు. సీఎం రేవంత్ రెడ్డి ఫోటోలతో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించి కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డి ఫోటోని ఏర్పాటు చేసి కార్యాలయంలోని ఫర్నిచర్ ను ధ్వంసం చేయడంతో రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ ప్రారంభమైంది. మరోవైపు పార్టీ మారిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని కేసు వేయడంతో ఎక్కడ అనర్హుడిగా తన సభ్యత్వం రద్దు అవుతుందోనని భయంతో తిరిగి బి ఆర్ ఎస్ లో చేరేందుకు నిర్ణయించు కున్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ధ్వంసం చేసి గలాటా సృష్టించిన కాంగ్రెస్ నాయకుల తీరుకు స్పందించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సీఎం ఫోటో పెట్టుకోవడం తన ఇష్టమని మాజీ సీఎం కేసీఆర్ ఎన్నో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారని ఆయన ఫోటో ఉంటే తప్పేమిటని ఆయన కాంగ్రెస్ పార్టీ నాయకులను ప్రశ్నించారు. గుమ్మడిదల మండలంలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్ విషయమై కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి వద్దకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ తరఫున మద్దతు ఇవ్వాలని కోరగా తాను కాంగ్రెస్ పార్టీలో ఉన్నానని చెప్పింది ఎవరని అదొక పార్టీనా మీరు ఒక నాయకులేనా అంటూ దూషించడం పై కాంగ్రెస్ నాయకులు ఖంగు తిన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసిన ఘటనలతో మనస్థాపానికి గురైన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తిరిగి బిఆర్ఎస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారని విశ్వసనీయ సమాచారం. అప్పట్లో జరిగిన అసెంబ్లీలో మాజీ సీఎం కేసీఆర్ ను పటాన్చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి కలవడంతో తిరిగి గులాబీ గూటికి చేరతారా ఆని ప్రచారం జోరుగా సాగింది.ఇక బీఆర్ఎస్ 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వరంగల్ లో నిర్వహించిన రజతోత్సవ వేడుకల్లో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసిఆర్ సమక్షంలో చేరాలని నిర్ణయించుకున్నప్పటికీ అది కూడా వాయిదా పడింది. కాంగ్రెస్ పార్టీతో అంటి ముట్టనట్టు ఉంటున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను కాకుండా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కార్యకర్తలకు సమావేశంలో సూచించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ఇక బీఆర్ ఎస్ ను విడిచి వెళ్లిన వారిని తిరిగి పార్టీలోకి తీసుకోమని కేటీఆర్, హరీష్ రావులు స్పష్టం చేశారు. మరి కాంగ్రెస్ , బీ ఆర్ ఎస్ లు వద్దంటే గూడెం మహిపాల్ రెడ్డి భవిద్యత్తు ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది. .

## ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు

**అదిలాబాద్, ఫిబ్రవరి 23: పెన్ పవర్:** ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలో సోమవారం ఉదయం ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. శ్యాంపూర్ వద్ద ఇరుకు వంతెన వద్ద బస్సు అదుపుతప్పి వాగులో పడింది. ఈ ప్రమాదంలో పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి ప్రయాణికులను బస్సు నుంచి బయటకు తీసి 108 కు ఫోన్ చేసి ఉట్నూర్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 32మంది ఉన్నారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని అధికారులు తెలిపారు. ఆర్టీసీ బస్సు కండక్టర్ చెయ్యి విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. మరో 10 మందికి గాయాలయ్యాయి. ఇరుకు వంతెనలపై ప్రతి ఏడాది ప్రమాదాలు సంభవిస్తూనే ఉన్నాయి. ఇదే బ్రిడ్జి వద్ద పదుల సంఖ్యలో వాహనాలు పడినప్పటికీ అధికారులు వెడల్పు వంతెనల ఏర్పాటుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, ఉట్నూర్ ఆసిఫాబాద్ రహదారి సైతం గుంతల మయంగా మారి రెండేళ్లుగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇరుకు వంతెనలు ఉట్నూర్ ఆసిఫాబాద్ రహదారి గురించి కథనం ప్రసారం చేసింది. అప్పటికి కొంత మేర అధికారులు గుంతలు పూడ్చారు. కానీ భారీ వర్షాల కారణంగా మళ్లీ ఎక్కడిక్కడ రహదారులు గుంతల మయంగా మారాయి. ఇరుకు వంతెనలు అలాగే ఉన్నాయి. =ఒదీ శాఖ, ప్రభుత్వం ఇప్పటికైనా ఇరుకు వంతెనలు కూల్చి వెడల్పు వంతెనల ఏర్పాటుకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

హైదరాబాద్: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలం శ్యాంపూర్ వద్ద సోమవారం తెల్లవారుజామున జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాదంపై పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే మంత్రి స్పందించి ఆదిలాబాద్ జిల్లా అదికాకారులతో మాట్లాడారు. సహాయక చర్యలు, గాయపడిన ప్రయాణికులకు అందిస్తున్న వైద్యంపై ఆరా తీశారు. తక్షణమే మెరుగైన వైద్యసేవలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.ఆదిలాబాద్ జిల్లాలో ఉదయం ఉట్నూరు మండలం శ్యామ్ పూర్ లో అసిఫాబాద్ డిపోకు చెందిన ఋ20ు 9369 ఆర్టీసీ బస్సు బ్రిడ్జి పై నుండి కింద పడడంతో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విచారం వ్యక్తం చేశారు. ఘటనకు గల కారణాల పై ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తెల్లవారుజామున ఇరుకైన శ్యామ్ పూర్ బ్రిడ్జి పై ప్రొటెక్షన్ వాల్ లేకపోవడంతో ఘటన జరిగినట్లు ప్రాథమికంగా వెల్లడించారు.ఘటనపై ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ ,ఎస్పీ తో ఫోన్ లో మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్ గాయపడిన క్షతగాతులకు నాణ్యమైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ఘటన స్థలంలో ఆదిలాబాద్, ఆసిఫాబాద్ ఆర్టీసీ అధికారులు ఆర్ఎం, డీఎంలు పర్యవేక్షిస్తున్నారు.

## 25 నుంచి ఇంటర్ పరీక్షలు

**హైదరాబాద్ ఫిబ్రవరి 23: పెన్ పవర్:** తెలంగాణ ఇంటర్మీడియట్ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. ఈ నెల 25 నుంచి మార్చి 18 వరకు జరగనున్న ఈ పరీక్షల నిర్వహణపై ఇంటర్ బోర్డు సెక్రటరీ, ఐఏఎస్ అధికారి కృష్ణాదిత్య కీలక వివరాలను వెల్లడించారు. ఈ ఏడాది మొత్తం 9,97,075 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాబోతున్నారు. ఇందులో మొదటి సంవత్సరం నుంచి 4,89,126 మంది, ద్వితీయ సంవత్సరం నుంచి 5,07,949 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు.రాష్ట్రవ్యాప్తంగా 1,495 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 404 ప్రభుత్వ కళాశాలలు, 221 ఎయిడెడ్ కాలేజీలు, 863 ప్రైవేట్ జూనియర్ కళాశాలలతో పాటు 7 ఇతర విద్యా సంస్థలను సెంటర్లుగా ఎంపిక చేశారు. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ప్రైవేట్ కాలేజీల్లో అధికంగా సెంటర్లు ఉండగా, మిగిలిన జిల్లాల్లో ఎక్కువగా ప్రభుత్వ కళాశాలలనే ప్రాధాన్యతలోకి తీసుకున్నారు. మాస్ కాపీయింగ్కు ఏమాత్రం అవకాశం లేకుండా దాదాపు 30 వేల సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించబోతున్నామని, ప్రతి సెంటర్పై ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందని ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణాదిత్య తెలిపారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి అరగంట ముందే చేరుకోవాలని ఆయన సూచించారు. ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినా అనుమతిస్తామని... కానీ, ఆ ఆందోళన వల్ల విద్యార్థులు నష్టపోయే అవకాశం ఉందని, అందుకే నిర్ణీత సమయానికి హాజరుకావాలని కోరారు. అలాగే మధ్యాహ్నం 12 గంటల వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యార్థులను బయటకు పంపమని, పరీక్షా పత్రాలను కూడా అప్పటి వరకు బయటకు తీసుకెళ్లకూడదని చెప్పారు. ఏదైనా అవాంఛనీయ ఘటనలు లేదా మాల్ ప్రాక్టీస్ జరిగితే నిర్ణయం తీసుకోవడానికి ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేశారు.ఇక హాల్ టికెట్ల విషయంలో తలెత్తిన వివాదాలపై కూడా ఆయన స్పష్టతనిచ్చారు. ఫీజులు చెల్లించలేదనే కారణంతో విద్యార్థులను ఇబ్బంది పెట్టకుండా, అందరికీ హాల్ టికెట్లు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కోర్టుకు వెళ్లిన విద్యార్థులకు కూడా ఇప్పటికే హాల్ టికెట్లు జారీ చేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 28,500 మంది ఇన్విజిలేటర్లు విధుల్లో ఉంటారని, విద్యుత్, రవాణా, పోలీస్ శాఖల సమన్వయంతో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని మౌలిక వసతులు కల్పించినట్లు కృష్ణాదిత్య వెల్లడించారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి:

**కరీంనగర్ పెన్ పవర్:** ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యమిచ్చి వెను వెంటనే పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించగా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్ తో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించారు. మొత్తం 367 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో అత్యధికంగా కరీంనగర్ నగరపాలిక సంస్థకు 41, హౌసింగ్ శాఖకు సంబంధించి 37 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహేష్ బాబు, ఏవో సుధాకర్ వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్లోబల్ వాల్యూ క్రియేషన్ హబ్ గా 'హైదరాబాద్'

**'రెడీ టూ వర్క్ ఫోర్స్' గా తెలంగాణ యువత**

**ఆవిష్కరణలకు ఊతమిచ్చే ఇన్నోవేషన్ ఎకో సిస్టం**

**'ది హార్ట్ ఫోర్డ్ ఇండియా టెక్నాలజీ సెంటర్' ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు**

**హైదరాబాద్ పెన్ పవర్:** ఐటీ మాత్రమే కాకుండా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్, ఏరో స్పేస్, మాన్యుఫ్యాక్చరింగ్, ఫిన్ టెక్, డీప్ టెక్, రిటైల్ తదితర రంగాల్లోనూ హైదరాబాద్ ను 'గ్లోబల్ వాల్యూ క్రియేషన్ హబ్'గా మార్చేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పునరుద్ఘాటించారు. అందుకోసం... పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తెలంగాణ యువతను 'రెడీ టూ వర్క్ ఫోర్స్'గా తీర్చిదిద్దడం, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించే గ్లోబల్ ఇన్నోవేషన్ ఎకోసిస్టం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. సోమవారం నానక్ రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లో అంతర్జాతీయ బీమా దిగ్గజం హార్ట్ ఫోర్డ్ 1.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 1200 మంది ఉద్యోగుల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన 'ది హార్ట్ ఫోర్డ్ ఇండియా టెక్నాలజీ సెంటర్'ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... అంతర్జాతీయ విస్తరణలో భాగంగా రెండు శతాబ్దాల ఘన చరిత్ర కలిగిన హార్ట్ ఫోర్ట్ హైదరాబాద్ ను ఎంపిక చేసుకోవడం ఇక్కడి ప్రతిభకు, డిజిటల్ ఇంజనీరింగ్లో మన నాయకత్వానికి దక్కిన గుర్తింపుగా భావిస్తున్నామన్నారు. ఈ కేంద్రం ద్వారా ఏఐ, రిస్క్ ఇంటెలిజెన్స్తో కూడిన ఆధునిక బీమా రంగంలో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ మరింత పెరుగుతుందన్నారు. నగరంలో ఇప్పటికే 400కు పైగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు(జీసీసీ) సేవలు అందిస్తున్నాయన్నారు. ఈ జాబితాలో మారియట్, మెక్డొనాల్డ్స్, యూబీఎస్, డాజన్, వాన్గార్డ్, ఎలీ లిల్లీ, హెచ్ సీఏ హెల్త్ కేర్, సిటిజన్స్ బ్యాంక్ లాంటి దిగ్గజ సంస్థలు ఈ జాబితాలో ఉన్నాయన్నారు. వీటిని కేవలం బ్యాక్ ఎండ్ ఆపరేషన్స్కు మాత్రమే పరిమితం చేయకుండా... గ్లోబల్ వాల్యూ సెంటర్లుగా మార్చేలా అవసరమైన వ్యూహాత్మక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. పారదర్శక పాలన, సమర్థవంతమైన నాయకత్వం, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్లో సంస్కరణలు, ఆధునిక డిజిటల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి తదితర అంశాలు హార్ట్ ఫోర్డ్ లాంటి అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు తెలంగాణను తమ గమ్యస్థానంగా ఎంచుకునేందుకు దోహదపడుతున్నాయన్నారు. తాజాగా ప్రారంభించిన ఈ కార్యాలయం యూఎస్ లోని హార్ట్ ఫోర్డ్, చికాగో, షార్లెట్, కొలంబస్ లో ఉన్న టెక్నాలజీ కేంద్రాలకు అనుబంధంగా పని చేస్తూ... ఏఐ, డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్, అడ్వాన్స్డ్ టెక్నాలజీ డెవలప్ మెంట్ పై దృష్టి సారిస్తూ 'ఇంజనీరింగ్ ఎక్స్ లెన్స్ హబ్ ' గా పని చేస్తుందని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. కార్యక్రమంలో హార్ట్ ఫోర్డ్ ప్రెసిడెంట్ మోరిస్ టూకర్, చీఫ్ మార్కెటింగ్ అండ్ కమ్యూనికేషన్స్ ఆఫీసర్ క్లైర్ బర్న్స్, సీఐవో శేఖర్ పన్నాల, హార్ట్ ఫోర్డ్ ఇండియా ఎండీ అండ్ హెడ్ సూర్య తమ్మిరాజు, సీటీవో ఇమ్రాన్ మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

# చిత్రహింసలు పెడుతున్నాడు బీఆర్ఎస్ కౌన్సిలర్ భార్య ఆరోపణ

**హైదరాబాద్ పెన్ పవర్:** వికారాబాద్ జిల్లా తాండూర్ ఒకవైపు రాజకీయాల్లో కీలక పదవిలో ఉంటూ, మరోవైపు ఇంట్లో భార్యను చిత్రహింసలకు గురిచేస్తున్న 7వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ ఇర్షాద్ అసలు రూపం బయటపడింది. తన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి రాజకీయ డ్రామాలు ఆడుతున్నారని ఆయన భార్య అతీయ మీడియా సాక్షిగా కన్నీటి పర్యంతమయ్యారు. తనకు, తన సోదరులకు తన భర్త ఇర్షాద్ నుంచి ప్రాణహాని ఉందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పెళ్లయిన మూడు నెలల నుంచే ఇర్షాద్ తనను వేధించడం మొదలుపెట్టారని ఆమె పేర్కొన్నారు. ఏ చిన్న కారణం దొరికినా క్రూరంగా కొట్టేవాడని, పశువుకన్నా హీనంగా చూసేవాడని వాపోయారు. నన్ను చిత్రహింసలకు గురిచేస్తూ నరకం చూపించాడు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ఇంత నీచంగా ప్రవర్తిస్తారని అనుకోలేదు అని ఆమె ఆరోపించారు. ఇర్షాద్ ఒక యువతితో అక్రమ సంబంధం పెట్టుకున్నాడని, మరో యువతీతో రహస్యంగా రెండో వివాహం కూడా చేసుకున్నాడని అతీయ సంచలన విషయాన్ని బయటపెట్టారు. ఈ రెండో పెళ్లి విషయం బయటకు తెలిస్తే చంపేస్తానని తనను కత్తితో బెదిరించాడని ఆమె పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు రోజు కూడా తనపై దాడి చేసి భయపెట్టాడని, ప్రాణభయంతోనే తన సోదరులకు సమాచారం అందించానని వివరించారు. తప్పు తన దగ్గర పెట్టుకుని ఇర్షాద్ కావాలనే రాజకీయం అంటూ తప్పుదోవ పట్టిస్తున్నాడు. తన అక్రమ సంబంధాలను ప్రశ్నించినందుకే నాపై కక్ష గట్టాడని, గతంలో కూడా నా సోదరులను చంపేస్తానని, తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపిస్తానని బెదిరించాడు అని అతీయ తెలిపారు. ప్రస్తుతం ఈ ఉదంతం రాజకీయ వర్గాల్లో పెను దుమారం రేపుతోంది. ఒక ప్రజాప్రతినిధి తన భార్యపైనే ఇలాంటి దాడులకు పాల్పడటంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు తక్షణమే స్పందించి తనకు న్యాయం చేయాలని ఆమె వేడుకుంటున్నారు...

# తుక్కు అంటుకుని అగ్ని ప్రమాదం

**సంగారెడ్డి: పెన్ పవర్:** ఇస్నాపూర్ లో బహిరంగ ప్రదేశంలో రాత్రి తుక్కు అంటుకొని పెద్ద ఎత్తున మంటలు అంటుకొని అగ్నిప్రమాదం చోటుచేసుకుంది బహిరంగ ప్రదేశంలో వేసి ఉంచిన ప్లాస్టిక్ తుక్కు రాత్రి సమయంలో అంటుకుని మంటలు చెలరేగాయి. రాత్రి సమయం కావడంతో సకాలంలో ఎవరు చూడకపోవడంతో మంటలు దావానంలా వ్యాపించి పెద్ద ఎత్తున తగలబడి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికుల సమాచారంతో అగ్రమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను చాలా సేపు తర్వాత అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం సంభవించలేదని అగ్ని మాపక శాఖ అధికారులు తెలిపారు.

# జీపీఆర్ వెంచర్ లో భారీ మోసం ప్లాట్ ఓనర్ల ఆవేదన

**పటాన్ చెరు: పెన్ పవర్:** రుద్రారం జీపీఆర్ వెంచర్లో భారీ భూ మోసం జరుగుతోందని ఆరోపిస్తూ ప్లాట్ ఓనర్లు కీలక సమావేశం నిర్వహించారు. కౌన్సిలర్ లక్ష్మి నరసింహారెడ్డి సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో బాధితులు తమ ఆవేదనను వెల్లడించారు. ప్లాట్ చేసిన భూమికి అక్రమంగా పట్టేదార్ పాస్బుక్లు జారీ చేయడం, అదే భూమిని మళ్లీ విక్రయించడం వంటి మోసపూరిత లావాదేవీలు జరిగాయని వారు ఆరోపించారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్, ఆర్డీవో సంగారెడ్డి, పటాన్చెరు ఎమ్మార్వోలకు ఇప్పటికే ప్రాతినిధ్యాలు సమర్పించినట్లు తెలిపారు. జిల్లా కోర్టు ఆదేశాల మేరకు సంబంధిత సర్వే నంబర్లను రిజిస్ట్రేషన్, రెవెన్యూ రికార్డుల్లో బ్లాక్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్లాట్ ఓనర్లు డిమాండ్ చేశారు.

# కుమ్మెర జాతర ఘటనపై బీఆర్ఎస్ స్పందన డీజీపీని కలిసిన మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

**నాగర్ కర్నూలు: పెన్ పవర్:** నాగర్ కర్నూలు జిల్లా కుమ్మెర జాతరలో దైవదర్శనానికి వెళ్లిన రెండేళ్ల చిన్నారి అనుమానాస్పద మృతి ఘటనపై రాష్ట్ర డిజిపిని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ కలిసారు.

శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ నాగర్ కర్నూల్ జిల్లాలో బీసీ కుటుంబానికి చెందిన మహిళపై దాడి, 2నెలల పసికందు మరణం పై డిజిపికి పిర్యాదు చేశాం. సభ్య సమాజం తలదించుకునే విధంగా అత్యాచారాలు,మనబంగాలు జరుగుతున్న దుర్భాగ్య స్థితి కాంగ్రెస్ పాలనలో కొనసాగుతుందని అన్నారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడినాక తెలంగాణలో పోలీసులు నిమిషాలలో కేసు ఛేదించే వారు. ఇప్పుడు పట్టపగలు అత్యాచారాలు జరుగుతున్న పట్టించుకోని దౌర్భాగ్య పరిస్థితి నెలకొంది. ఒక నిరుపేద మహిళపై దాడి చేసి,ప్రైవేట్ పర్ట్స్ పై చేతులు వేస్తూ దాడి చేశారు. ఒక జాతరలో దైవ దర్శనానికి వస్తే.. తక్కువ కులం అని మహిళపై దాడి చేసి కాంగ్రెస్ రౌడీలు చిన్న పసికందును తన్ని చంపారని అన్నారు.

బాధితులు పిర్యాదు చేసిన కూడా పట్టించుకోకుండా పోలీసులు వ్యవహరిస్తున్నారు. కొంత మంది పోలీసులు అవినీతికి పాల్పడుతున్నారు. అధికార పార్టీ మెప్పు కోసం పనిచేస్తున్నారు. బాధిత మహిళకు కోటి రూపాయల ఆర్థిక సాయం,ఒక ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. బాధితులపై అత్యాచారాం కేసు కింద కేసు నమోదు చేసి చట్టరీత్య చర్యలు తీసుకోవాలని అన్నారు.

బాధితులకు న్యాయం చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతాం. ఈ కేసుపై నిర్లక్ష్యం వహించిన పోలీసులను సస్పెండ్ చేయాలి. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి కులం పనిచేసి సంతోషం గా జీవించాలని కేసీఆర్ ప్రభుత్వం పని చేసిందని అన్నారు.

# ఎంపి రఘునంధన్ రావుకు పాడే కట్టిన ముదిరాజులు

**సంగారెడ్డి: పెన్ పవర్:** జిన్నారం మండలం జిన్నారం చౌరస్తా వద్ద మెదక్ ఎంపీ రఘునందన్ రావు పాడేకట్టి రఘునందన్ రావు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ శవయాత్రతీసి పాడేను ముదిరాజులు కాల్చారు.

బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా ఇస్నాపూర్ మున్సిపాలిటీ చేర్మెన్ ఎన్నికల్లో ఎక్స్ ఆఫీషియా ఓటు వేసి బీఆర్ఎస్ పార్టీని గెలిపించిన మెదక్ ఎంపీ రఘునందన్ రావుపై ముదిరాజులు ఫైర్ అవుతున్నారు.

కాంగ్రెస్ పార్టీనుండి బరిలో ఉన్న ఒక ముదిరాజ్ బిడ్డ నీలంమధు సతీమణి నీలం కవితను ఇస్నాపూర్ మున్సిపల్ చేర్మెన్ అవ్వనివ్వకుండా అడ్డుపడ్డ అగ్రకులానికి చెందిన ఎంపీ రఘునందన్ రావు ఎక్స్ ఆఫీషియా ఓటువేసి నీలంకవిత ను ఓడించడంతో ముదిరాజ్ సంఘం నాయకులు రఘునందన్ రావుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు

# కేంద్రంలో బి సి లకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి చట్టసభల్లో బీసీ బిల్లు వెంటనే ప్రవేశపెట్టాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు, బీసీ రిజర్వేషన్ల సాధన సమన్వయ జేఏసీ చైర్మన్ దుండ్ర కుమారస్వామి డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కుమారస్వామి మాట్లాడారు. బీసీల భవితను మార్చే జాతీయ ఉద్యమాన్ని నిర్మించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా బీసీ వర్గాల న్యాయబద్ధమైన హక్కుల సాధన కోసం జాతీయ స్థాయిలో నేషనల్ ఓబీసీ కార్యవర్గ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ దళ్కు రెండు తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడిగా నియమితులైన సామాజికవేత్త డి.వి.వి. సత్యనారాయణకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దశాబ్దాలుగా బీసీలను నిర్లక్ష్యం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో చేపట్టే జనగణనలో కులగణనను తప్పనిసరిగా నిర్వహించాలని కోరారు.

# హైడ్రా పై మండిపడ్డ ఎమ్మెల్యే మాధవరం

**కూకట్ పల్లి: పెన్ పవర్:** సున్నం చెరువు లో కాంగ్రెస్ పార్టీ నాయకులు కబ్జాలు చేరాలని ఎమ్మెల్యేకు కాలని అసోసియేషన్ సభ్యులు మాధవరం కృష్ణరావుకు కాలనీ వాసులు పిర్యాదు చేసారు. దాంతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు,మాజీ కార్పొరేటర్ సభిహ గౌసుద్దిన్ సున్నం చెరువును అభివృధి పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ సున్నం చెరువులో ఉన్న భూమిని వదిలేసి హైడ్రా అధికారులు ఫెన్సింగ్ వేస్తున్నరని మండిపడ్డారు. ప్రభుత్వ భూమిని కాంగ్రెస్ పెద్దలు అప్పగించే ధోరణిలో హైడ్రాధికారులు వున్నారు. సర్వేనెంబర్ 30లో ఉన్న ప్రభుత్వ భూమిని ప్రభుత్వ అధికారులే 47 లక్షలతో ఫెన్సింగ్ వేశారు. అదే ప్రభుత్వ అధికారులు వేసిన ఫినిషింగ్ను తీసివేసి హైడ్రాధికారులు కాంగ్రెస్ నేతలకు కోట్ల రూపాయల భూములను అప్పగిస్తున్నారు. బిఆర్ఎస్ పార్టీకి సంబంధించిన ఎమ్మెల్యేలు నాయకులు అడిగితే స్పందించట్లేదు హైడ్రా కమిషనర్ రంగనాథ్ . హైదరాబాద్ లోని చెరువులను కుంటలను అభివృద్ధి చేసింది కేసీఆర్ ప్రభుత్వం. గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి ప్రజలకు తెలవద్దని లైట్లను సైతం వెలగకుంట చేస్తున్నారు అధికారులని ఆరో?పించారు. ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టడం ఇబ్బందులు గురి చేయడమేనా రేవంత్ రెడ్డి సర్కార్ పనితనం. 2017లో ప్రభుత్వ భూమిని రక్షించాలని అధికారులు పెన్సింగ్ వేశారు. కాంగ్రెస్ పార్టీ నేతలు కన్నేసి అధికారులను అడ్డంపెట్టుకొని కబ్జాలు దర్జాగా చేస్తున్నారు. పేదల ఇండ్లను కూల్చివేయడం పెద్దలకు ఆస్తులు కూడబెట్టడమేనా హైడ్రా అధికారుల దౌర్జన్యం. మూసీ నదిపై గాంధీ విగ్రహాన్ని కట్టడం కోసం 498 ఇండ్లను కూల్చేస్తారా...? ప్రభుత్వ భూములు ఉన్న చోట గాంధీ విగ్రహాన్ని నిర్మిస్తే ఏమవుతుంది. సున్నం చెరువులో కాంగ్రెస్ పార్టీ నేతలు కబ్జాలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకొని పేదలను రోడ్డుపాలు చేయకండి. ప్రభుత్వ భూములను మూడు లక్షల కోట్ల రూపాయలు కాపాడమని చెప్పుకునే హైడ్రా కమిషనర్ రంగనాథ్ , సున్నం చెరువులో ఉన్నటువంటి ప్రభుత్వ భూమిని కూడా చెరువులో కలిపి ఫెన్సింగ్ వేయాలి . కాంగ్రెస్ నేతలు కబ్జాలు చేస్తే దానికి హైడ్రా కమిషనర్ రంగనాథ్ మద్దతు పలికితే బిఆర్ఎస్ పార్టీ సహించదు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# కవితాలోకాన కల్పవల్లి.. దేవులపల్లి

**తెలుగు భావ కవితా రంగంలో ఆయన ఒక ముఖ్య అధ్యాయం.**

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆయన కవిత్వంలో భావుకత్వం వెల్లివిరుస్తుంది.. ఆయన రాసే గీతాల్లో లాలిత్యం పాఠకులను తన్మయత్వంలో మునిగితేలేలా చేస్తుంది. తెలుగు సినిమా రంగాన ఆయన పాటలు జగద్విఖ్యాతం. ఆంధ్రా షెల్లీగా ప్రఖ్యాతి గాంచి "కృష్ణపక్షం" వంటి గొప్ప రచనను తెలుగు పాఠకులకు అందించిన ఆ మేటి సాహితీ దురంధరుడే "దేవులపల్లి కృష్ణశాస్త్రి". రేడియోలో లలిత గీతాలు, నాటికలు, సినిమాల్లో పాటలు రాయడం ద్వారా ప్రఖ్యాతి పొందారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి తూర్పు గోదావరి జిల్లా, పిఠాపురం దగ్గరలోని రామచంద్రపాలెం గ్రామంలో తమ్మన్నశాస్త్రి, సీతమ్మ దంపతులకు నవంబరు 1, 1897 తేదీన జన్మించారు. అతని విద్యాభ్యాసమంతా పిఠాపురం పాఠశాలలో సాగింది. పాఠశాల రోజుల్లోనే కూచి నరసింహం, రఘుపతి వెంకటరత్నం వంటి రచయితల వద్ద ఆంగ్ల సాహిత్యాన్ని ఔపోసన పట్టాడు కృష్ణశాస్త్రి. 1918లో విజయ నగరం వెళ్లి డిగ్రీ చేస్తున్న రోజుల్లోనే ఆయనకు కవిత్వం రాయడం పట్ల మమకారం ఏర్పడింది. డిగ్రీ పూర్తి చేసి పెద్దాపురంలో ఉపాధ్యాయుడిగా ఉద్యోగంలో చేరాక ఆయన పూర్తిస్థాయిలో రచనా వ్యాసంగాన్ని మొదలు పెట్టారు. బ్రహ్మసమాజం లోను, నవ్య సాహితీసమితి లోను సభ్యునిగా, భావ కవిత్వోద్యమ ప్రవర్తకునిగా దేశమంతటా ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సమయంలో ఎందరో కవులతోను, పండితులతోను పరిచయాలు కలిగాయి. ప్రాచ్య, పాశ్చాత్య సాహిత్యాన్ని అధ్యయనం చేశారు. పిఠాపురంలోని హరిజన వసతి గృహంతో సంబంధం ఏర్పరచుకొని హరిజనోద్ధరణ కార్యక్రమాలలో పాల్గొన్నందున బంధువులు అతనిని వెలివేశారు. అయినా వెనుకాడని కృష్ణశాస్త్రి వేశ్యావివాహ సంస్థను ఏర్పాటు చేసి ఎందరో కళావంతులకు వివాహాలు నిర్వహించారు. 1922లో కృష్ణశాస్త్రి సతీమణి అర్థాంతరంగా మరణించడంతో కొన్నాళ్లు అదే బాధలో గడిపారు ఆయన. అదే బాధలో అనేక విషాద కవితలు రాశారు. ఊహా ప్రేయసి, ఆత్మాశ్రయత్వం, ప్రవాసము, ఊర్వశి వంటి ఖండకావ్యాలు అలా పుట్టినవే. 1929లో రవీంద్ర నాథ్ టాగుర్తో ఏర్పడిన పరిచయం కృష్ణశాస్త్రి జీవితాన్ని మరో మలుపు తిప్పింది. మరిన్ని కవితా రచనలను చేసేలా ప్రేరేపించింది. లాలిత్యం, సారళ్యం, ప్రకృతి సౌందర్యం – కృష్ణశాస్త్రి పాటల్లోని ప్రధాన లక్షణాలు. భావోద్వేగాలకు, హృదయ స్పందనలకు అక్షర రూపమిచ్చి భావ కవితలంత సుకుమారంగా ప్రణయ విరహ గీతాల్ని రాసిన కవి. చందమామ లోని చల్లదనాన్ని, మందార పువ్వులోని మకరందాన్ని, గుండెలోని ఆర్ద్రతని రంగరించి రాస్తే అది కృష్ణశాస్త్రి పాటవుతుంది. పట్టు పరికిణిలో ఒదిగిన సింగారం కృష్ణశాస్త్రి పాట. ఆయన తెలుగు పదం అమ్మమ్మ చేతిలో నేతి నైవేద్యం. వర్షం వచ్చేముందు వీచే చల్లనిగాలి తెమ్మెర తనువును తాకితే ఎంత పులకరిస్తామో, కృష్ణశాస్త్రి కవిత వింటుంటే అదే పులకరింత వీనుల విందుగా వస్తుంది. భావ కవిత్వానికి సినిమా పాటల ద్వారా ఒక శాశ్వత స్థానాన్ని ఏర్పాటు చేసి, దిశానిర్దేశం చేసిన అతి కొద్ది మంది కవులలో కృష్ణశాస్త్రి ముందుంటారు. తెలుగు సినిమాల్లో జనని జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి.. అని భరతమాతను కీర్తించినా, జయ జయ జయ ప్రియ భారత జనయిత్రీ దివ్య ధాత్రి.. అంటూ దేశభక్తిని చాటినా.. ఆకులో ఆకునై , పువ్వులో పువ్వునై , నునులేత రెమ్మనై, సెలయేటిలో పాటనై, తెరచాటు తేటినై , నీలంపు నిగ్గునై... అని మగువ ఆర్ద్రతకు పెద్దపీట వేసినా అది కృష్ణశాస్త్రికే చెల్లింది. భావ కవిగా, 'ఆంధ్రా షెల్లీ'గా ప్రసిద్ధులైన దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి... 1942లో బి.ఎన్.రెడ్డి ప్రోత్సాహంతో 'మల్లీశ్వరి (1951)'తో చిత్రరంగంలో అడుగుపెట్టి, సినిమా పాటకు కావ్య గౌరవం కలిగించి, మల్లీశ్వరితో ప్రారంభించి కృష్ణశాస్త్రి ఎన్నో చక్కని సినిమా పాటలు అందించారు. అవి సామాన్యులనూ, పండితులనూ కూడా మెప్పించే సాహితీ పుష్పాలు. తరువాత అనేక చిత్రాలకు సాహిత్యం అందించాడు. 1957లో ఆకాశవాణిలో చేరి తెలుగు సాహిత్య ప్రయోక్తగా అనేక గేయాలు, నాటికలు, ప్రసంగాలు అందించారు. పిలిచిన బిగువటరా, -- మనసున మల్లెల మాలలు, ఆకాశ వీధిలో హాయిగా , ఔనా.. నిజమేనా? సడి సేయకో గాలి
ప్రతి రాత్రి వసంత రాత్రి,

**రానిక నీకోసం, ఆకులో ఆకునై,**

ఆరనీకుమా ఈ దీపం, గోరింట పూచింది, పగలైతే దొరవేరా, గట్టుకాడ ఎవరో, కుశలమా.. నీకు కుశలమేనా, చుక్కలతో చెప్పాలని, అడుగడుగున గుడి ఉంది, రావమ్మా మహాలక్ష్మి, ఎవరు నేర్పేరమ్మ ఈ కొమ్మకు, ఈనాటి బంధం ఏనాటిదో, వేళ చూస్తే.. సందె వేళ, చీకటి వెలుగుల కౌగిటిలో, పాడనా తెనుగు పాట, ఇది మల్లెల వేళయనీ, మావి చిగురు తినగానే, లాంటి పాటలు సినీ సాహిత్యంలో అజరామరాలు. 1975లో– ఆంధ్ర విశ్వవిద్యాలయం – కళాప్రపూర్ణ, 1978లో సాహిత్య అకాడమీ అవార్డు, 1976లో పద్మ భూషణ్ దేవులపల్లి ని వరించాయి. 1964 లో తిరుపతిలో అన్నమయ్య జయంతి ఉత్సవంలో కృష్ణశాస్త్రి పాల్గొన్నారు. ఆయన వెంట బాలాంత్రపు రజనీ కాంతరావు కూడా వెళ్లారు. ఉపన్యాసం చదివేందుకు ఉద్యుక్తుడైన కృష్ణశాస్త్రి గొంతు బొంగురు పోయింది. దాంతో తన ఉపన్యాసాన్ని రజనీకాంతరావు చేత చదివించారు. వైద్య పరీక్షల్లో అది గొంతు క్యాన్సర్ అని నిర్ధారణ అయింది. మద్రాసులో కృష్ణశాస్త్రి స్వరపేటికను తొలగించారు. స్వరపేటిక తొలగించిన తరువాత కృష్ణశాస్త్రి దాదాపు పదహారేళ్లు బ్రతికినా, మూగవోయిన కంఠంతోనే అనేక సినిమాలకు పాటలు, ఆకాశవాణికి లలిత గీతాలు రాశారు. 1980 ఫిబ్రవరి 24న కృష్ణశాస్త్రి మరణించారు. తెలుగు దేశపు నిలువుటద్దం బద్దలైంది. షెల్లీ మళ్లీ మరణించాడు' అంటూ కృష్ణశాస్త్రి చనిపోయిన రోజున శ్రీశ్రీ రోదించాడు. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ స్పందిస్తూ 'ఒక్క షెల్లీ యే కాదు, కీట్స్, వర్డ్స్వర్త్ వంటి మహాశయుల సంయుక్త స్వరూపం కృష్ణశాస్త్రి' అన్నారు.

# ఆంధ్ర విశ్వవిద్యాలయ తొలి ఉపకులపతి

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలుగు సాహిత్యం, విద్యా రంగాల్లో చిరస్మరణీయ మహనీయులలో ఒకరైన కట్టమంచి రామలింగారెడ్డి (1880--1953) ప్రముఖ కవి, రచయిత, సంఘసంస్కర్త, విద్యావేత్త. 20వ శతాబ్దపు తెలుగు సాహిత్యానికి కొత్త గుణాత్మకతను అందించిన ఆయన, విద్యా రంగంలో చేసిన సేవల ద్వారా సమాజ మార్పుకు కృషి చేశారు. జననం...డిసెంబర్ 10, 1880న ఆంధ్రప్రదేశ్ లోని చిత్తూరు జిల్లాలోని కట్టమంచి గ్రామంలో జన్మించారు. ఈ గ్రామమే ఆయన పేరుతో పరిచితమైంది. విద్యాభ్యాసం...మద్రాసు క్రిస్టియన్ కళాశాలలో చదువుకున్నారు. ఆంగ్ల సాహిత్యం, తత్వశాస్త్రంలో ఆసక్తి చూపి, పండితుడిగా ఎదిగారు. విద్యాబోధన, రచనలతో నిమగ్నమైన రామలింగారెడ్డి కుటుంబ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారువిద్యా రంగానికి చేసిన సేవలువిద్యా సంస్కరణలు...రామలింగారెడ్డి విద్యను సమాజ మార్పు సాధనంగా భావించారు. ఆయన మహిళా విద్యకు ప్రాధాన్యత ఇచ్చి, విద్యను అందరికీ అందుబాటు లోకి తీసుకు రావడానికి కృషి చేశారు. విద్యా ప్రమాణాలను మెరుగు పరచడంలో ముఖ్య భూమిక పోషించారు. ఆంధ్రా విశ్వవిద్యాలయం:ఆంధ్ర విశ్వవిద్యాలయానికి తొలి ఉపకులపతిగా నియమించబడ్డారు. ఆర్థిక సమస్యలు, బడ్జెట్ సమస్యలు ఉన్నప్పటికీ, విశ్వవిద్యాలయ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశారు."విద్యార్థి నైతికతే సమాజ భవిష్యత్తు" అనే దృక్పథంతో విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించడంలో ఆయన విశేషంగా కృషి చేశారు. సాహిత్య కృషికట్టమంచి రామలింగారెడ్డి తెలుగులో పలు విభిన్న ప్రక్రియలకు పునాది వేశారు. ఆయన రచనల్లో సామాజిక చైతన్యం, నైతిక విలువల ప్రతిఫలనం స్పష్టంగా కనిపిస్తుంది. ప్రసిద్ధ రచనలు:ముసలమ్మ మరణం...గ్రామీణ జీవితంలోని నైతిక సమస్యలు, సామాజిక పరిస్థితులను వాస్తవంగా చర్చించిన కావ్యం. మంచి...నైతిక విలువలను, వ్యక్తిగత సమాజ బంధాలను విశదీకరించిన గీతకావ్యం. చిత్రలేఖ...అందమైన గీతకావ్యం, సమాజానికి కొత్త ఆలోచనలతో రూపుదిద్దింది. హరిశ్చంద్ర, శాంతిశ్రీ...ఇతిహాస గాథల ఆధారంగా రచించిన ఈ నాటకాలు పాఠకుల మన్ననలు పొందాయి. సాహిత్యంలో విశిష్టత:"గద్య కవిత్వం" అనే నూతన ప్రక్రియను ప్రవేశపెట్టారు. రచనల ద్వారా సామాజిక సమత్వం, నైతికత, వ్యక్తిగత అభివృద్ధి వంటి అంశాలను విశదీకరించారు. సమాజ సేవసామాజిక చైతన్యం...బాలికల విద్య, స్త్రీ స్వాతంత్ర్యం కోసం రచనల ద్వారా సామాజిక ఉద్యమాలకు ప్రేరణ కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్య, ఆర్థిక సమానత్వం కోసం తన ఆలోచనలను వ్యాప్తి చేశారు. హేతువాద ఆలోచనలు...ప్రాచీన ఆచారాలను తిరస్కరిస్తూ, ఆధునిక దృక్పథాలను సమర్థించారు. విద్య ద్వారా సమాజాన్ని మారుస్తారని నమ్మి, ఆ దిశగా సేవ చేశారు. రామలింగారెడ్డి ప్రత్యేకతబహుముఖ ప్రజ్ఞావంతుడు...కవి, రచయిత, హేతువాది, శాస్త్రవేత్త, న్యాయవాది వంటి అనేక పాత్రల్లో ప్రతిభ చూపారు. ఆదర్శవాది...

తన జీవితంలో ఉన్నత ఆచారాలను పాటిస్తూ, సమాజానికి ఆదర్శంగా నిలిచారు. సాహిత్య సేవల విలువ...కేవలం రచయితగానే కాకుండా, సమాజానికి మార్గదర్శకుడు, చైతన్యవంతుడు. మరణం1953 ఫిబ్రవరి 24న ఆయన పరమ పదించారు. కానీ, ఆయన రచనలు, విద్యాపరమైన సంస్కరణలు తెలుగు

ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచి పోయాయి. కట్టమంచి రామలింగారెడ్డి తెలుగు సాహిత్యం, విద్యారంగాల్లో చేసిన కృషి అపారమైనది. ఆయన రచనలు నేటికీ తెలుగు భాషాభిమానులకు స్ఫూర్తినిస్తున్నాయి. విద్య, సాహిత్యం, సమాజ సేవలలో ఆయన చూపిన నిబద్ధత ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా ఉంది.

# అక్రమ సంబంధం ప్రియుడితో కలిసి భర్తను కడతేర్చిన భార్య

**చేవెళ్ల: పెన్ పవర్:** అక్రమ సంబంధం పెట్టుకున్న భార్య ప్రియుడితో కలిసి భర్తను కడతేర్చింది. రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో ఘటన జరిగింది. నిద్రిస్తుండగా దిండుతో ఊపిరాడకుండా చేసి భర్తను చంపింది. భార్య రాజేశ్వరి, ప్రియుడు శరత్ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు. మృతుడి తల్లి ఫిర్యాదుతో వచ్చిన దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది.

సీఐ వెల్లడించిన వివరాల ప్రకారం.. శంకర్పల్లి మండలం పర్వేద గ్రామానికి చెందిన నారగూడం కృష్ణ (35), జీడిమెట్లకు చెందిన రాజేశ్వరిని 2018లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. చేవెళ్లలోని చంద్రారెడ్డినగర్లో నివసిస్తూ కూలీ పనులు చేసుకుంటున్నారు. ఆరు నెలల క్రితం రాజేశ్వరికి శరత్ అనే యువకుడితో ఇన్స్టాగ్రామ్లో పరిచయం ఏర్పడి, అది వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ విషయంపై భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి.

ఈ క్రమంలో కృష్ణను అడ్డు తొలగించుకోవాలని రాజేశ్వరి, శరత్ నిర్ణయించుకున్నారు. గురువారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చిన కృష్ణతో రాజేశ్వరి గొడవపడింది. అతను నిద్రలోకి జారుకున్నాక, ప్రియుడు శరత్కు ఫోన్ చేసి పిలిపించింది. ఇద్దరూ కలిసి కృష్ణ కాళ్లు, చేతులు కట్టేసి, ముఖంపై దిండు పెట్టి ఊపిరాడకుండా చేశారు. అనంతరం శరత్ అతని ఛాతీపై బలంగా కొట్టడంతో కృష్ణ మృతి చెందాడు.

హత్య తర్వాత ఏమీ తెలియనట్లు నటించిన రాజేశ్వరి, శుక్రవారం ఉదయం తన భర్త పలకడం లేదంటూ ఆసుపత్రికి తీసుకెళ్లింది. అయితే, అప్పటికే కృష్ణ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కృష్ణ మృతిపై అనుమానం వ్యక్తం చేసిన అతని తల్లి అంజమ్మ పోలీసులకు

ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు రాజేశ్వరిని విచారించగా అసలు నిజం ఒప్పుకుంది. ఆమె ఇచ్చిన సమాచారంతో ప్రియుడు శరత్ను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు నిందితులను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించినట్లు సీఐ తెలిపారు.

# అనంతబాబు అడ్డంగా ఇరుక్కున్నట్టేనా

**రాజమండ్రి, ఫిబ్రవరి 22, పెన్ పవర్:** ఏపీ పాలిటిక్స్‌లో సంచలనం సృష్టించిన వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో ట్విస్టులే ట్విస్టులు చోటు చేసుకుంటున్నాయి. నాలుగేళ్లుగా ఎన్నో మలుపులు తిరుగుతూ వస్తున్న మర్డర్ కేసుపై..లేటెస్ట్‌గా సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. అప్పట్లో ఈ కేసు విషయంలో పోలీసులు వ్యవహరించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. దర్యాప్తు సంస్థలు, నిందితుడు ఒక్కటైనట్లుగా బిహేవ్ చేశారని మండిపడింది. దర్యాప్తులో పోలీసుల తీరును తప్పుబట్టిందినిందితుడితో పోలీసులు ఇప్పటికీ చెట్టాపట్టాలు వేసుకుని తిరుగుతున్నట్లు కనిపిస్తోందని..ఇంత దారుణంగా వ్యవస్థలు నిర్వీర్యం అవుతుంటే డీజీపీ, ఎస్పీలు ఏం చేస్తున్నారని ప్రశ్నించింది కోర్టు. అనంతబాబుకు బెయిల్ వచ్చేలా ఉద్దేశపూర్వకంగానే ఛార్జిషీట్ దాఖలు వేయడంలో ఆలస్యం చేశారని, నిందితుడితో పోలీసులు కుమ్మక్కైనట్లు స్పష్టం అవుతుందని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. నవంబర్ 18లోపు ట్రయల్ కోర్టు విచారణను పూర్తి చేసి, కేసు విచారణ కోసం మార్చి 31 లోగా హైకోర్టు ఒక సీనియర్ జ్యుడిషియల్ ఆఫీసర్‌ను ప్రత్యేకంగా నియమించాలని కూడా ఆదేశించింది కోర్టు. 2022 మే 19న ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య జరిగింది.ఈ కేసులో ఆరోపణలు ఫేస్ చేస్తున్న అనంతబాబు బెయిల్ మీదున్నారు. ఇప్పుడాయన అజ్ఞాతంలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. హత్యలో అనంతబాబు భార్య ప్రమేయం ఉందని ఆరోపించిన సిట్..చార్జిషీట్‌లో ఆమెను ఏ-2గా పేర్కొంది. ప్రస్తుతం అనంతబాబు సతీమణి లక్ష్మీదుర్గ కూడా పరారీలో ఉన్నట్లు చెబుతున్నారు. అయితే నిందితుడు 2022 నుంచి మధ్యంతర బెయిల్ మీదున్నా..ఇప్పటికీ దర్యాప్తు పూర్తి కాకపోవడం ఏంటంటూ సుప్రీంకోర్టు మండిపడింది.ఇది పోలీసుల నిర్లక్ష్యం కాకపోతే మరేమిటని కూడా ప్రశ్నించింది. సాక్షులను బెదిరించడానికి ప్రయత్నించినా, ఆధారాలను మాయం చేయాలని చూసినా బెయిల్ రద్దు చేస్తామని హెచ్చరించింది కోర్టు. అయితే లేటెస్ట్‌గా సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలతో నాడు ఈ కేసు దర్యాప్తులో కీలకంగా పనిచేసిన పోలీసుల చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఈ ఘటన జరిగినప్పుడు కాకినాడ జిల్లా ఎస్పీగా ఉన్న రవీంద్రనాథ్‌రెడ్డితో పాటు..అప్పటి అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్, డీఎస్పీలు భీమారావు, మురళీ, సీఐ మురళీకృష్ణారెడ్డిపై వేటు తప్పదని పోలీస్ శాఖలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి.కీలక పోలీస్ ఆఫీసర్లు.. డ్రైవర్ సుబ్రహ్మణ్యం మర్డర్‌ను.. అనుమానాస్పద హత్యగా నమోదు చేయడానికి ప్రయత్నించారన్న ఆరోపణలు ఉన్నాయి. బాధితులు, దళిత సంఘాల ఆందోళనలతో కేసును హత్య కేసుగా మార్చారు. కానీ, అనంతబాబును అరెస్ట్ చేయడానికి కనీసం ప్రయత్నం చేయలేదని అప్పట్లో పెద్ద దుమారం నడిచింది. పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు రావడంతో తప్పని పరిస్థితుల్లో



అనంతబాబును అరెస్ట్ చేశారన్న విమర్శలు వచ్చాయి.అనంతబాబు అరెస్టు సమయంలో పోలీసులు వ్యవహరించిన తీరు కాంట్రవర్సీ అయింది. నిందితుడిగా ఆరోపిస్తున్న వ్యక్తిని జిల్లా ఎస్పీ అనంతబాబు గారు అని సంబోధించడం హాట్ టాపిక్ అయింది. హత్య జరిగిన ఘటనా స్థలిలో సీసీ ఫుటేజీలను..నిందితుల కాల్ రికార్డులు సేకరించలేదని..గూగుల్ టేకవుట్ కోసం సకాలంలో ప్రయత్నించాల్సి ఉన్నా, కావాలని లేట్ చేశారని ఎన్నో అలిగేషన్స్ ఉన్నాయి. హత్య తర్వాత అనంతబాబు నుంచి పోలీసులు సీజ్ చేసిన ఫోన్‌ను ఇప్పటికీ ఓపెన్ చేయలేదని అంటున్నారు.పైగా అనంతబాబుకు నేర చరిత్ర లేదంటూ చార్జిషీటులో మెన్షన్ చేసి..బెయిల్ రావడానికి మార్గం సుగమం చేశారన్న విమర్శలు వచ్చాయి. ఫైనల్‌గా ఇప్పుడు సుప్రీంకోర్టు ఆదేశాలతో కేసు దర్యాప్తు మరింత స్పీడప్ అయ్యే అవకాశం ఉంది. కోర్టు అనంతబాబు బెయిల్‌ను కంటిన్యూ చేయడంతో..ఏ-2గా ఉన్న ఆయన భార్య లక్ష్మీదుర్గను అరెస్ట్ చేసేందుకు పోలీసులు రెడీ అవుతున్నట్లు టాక్ నడుస్తోంది. ఇక అప్పటి పోలీస్ అధికారులపై వేటు వేస్తారన్న ప్రచారం కూడా ఊపందుకుంది. అనంతబాబు డ్రైవర్ హత్య కేసు ఇంకా ఎన్ని మలుపులు తీసుకుంటుందో.? ఏం జరగబోతుందో వేచి చూడాలి మరి.

# ఆ నాలుగు సీట్ల కోసం 40 మంది పోటీ

**విజయవాడ, ఫిబ్రవరి 22, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఇప్పుడు అందరి దృష్టి రాజ్యసభ వైపు మళ్లింది. వచ్చే జూన్ నెలలో ఖాళీ కాబోతున్న నాలుగు స్థానాలు అటు ఢిల్లీలోనూ, ఇటు అమరావతిలోనూ వేడి పుట్టిస్తున్నాయి. రాష్ట్ర అసెంబ్లీలో కూటమికి ఉన్న తిరుగులేని బలంతో ఈ నాలుగు స్థానాలు ఏకగ్రీవం కావడం ఖాయం. అయితే, ఆ సీట్లు ఎవరికి దక్కుతాయి? అధినేతల మనసులో ఉన్న ఆ అదృష్టవంతులు ఎవరు? అన్నదే ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నకూటమిలోని మూడు పార్టీల మధ్య ఇప్పటికే ఒక అవగాహన కుదిరినట్లు తెలుస్తోంది. మొత్తం 4 స్థానాల్లో టీడీపీ 2, జనసేన 1, బీజేపీ 1 చొప్పున పంచుకోబోతున్నాయి. వైఎస్సార్సీపీకి చెందిన అయోధ్య రామిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, పరిమళ్ నత్వానీ సీట్లు ఖాళీ అవుతుండడంతో ఆ స్థానాలను భర్తీ చేసేందుకు కసరత్తు వేగవంతమైంది.టీడీపీకి దక్కే రెండు స్థానాల్లో ఒకటి ప్రస్తుత సభ్యుడు సానా సతీష్ కు దాదాపు ఖాయమైనట్లే కనిపిస్తోంది. ఇక మిగిలిన ఒక్క సీటు కోసం అమరావతిలో భారీ ఎత్తున లాబీయింగ్ జరుగుతోంది. పార్టీ కోసం ఏళ్ల తరబడి పనిచేస్తున్న సీనియర్ నేత యనమల రామకృష్ణుడు, క్రమశిక్షణకు మారుపేరుగా ఉండే వర్ల రామయ్య ఈ రేసులో ముందున్నారు. పార్టీలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న టీడీ జనార్ధన్ పేరు కూడా పరిశీలనలో ఉంది. వీళ్లు కాకుండా పలువురు యువకులు కూడా రాజ్యసభ సీటు ఆశిస్తున్నారు. 2024 ఎన్నికల్లో సోషల్ మీడియా బాధ్యతలు చూసి, పార్టీ గెలుపుకు దోహదపడిన చింతకాయల విజయ్ కూడా సీటు ఆశిస్తున్నారు. ఇక లోకేశ్ స్నేహితుడు కిలారి రాజేష్ పేరు కూడా వినిపిస్తోంది. మరోవైపు పార్టీ అంతర్గత వ్యవహారాల్లో కీలకంగా ఉండే సురేశ్ కోనేరు పేరు కూడా అమరావతిలో వినిపిస్తోంది. అంతేకాక భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ కూడా సీటు ఆశిస్తున్నారు.ఇక జనసేన కోటాలో ఒక సీటు ఉండటంతో ఆశావహుల జాబితా చాంతడంత ఉంది. ఇటు పవన్, అటు చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడైన ప్రముఖ పారిశ్రామికవేత్త లింగమనేని రమేష్ పేరు దాదాపు ఖాయమైందనే ప్రచారం చాలారోజులుగా వినిపిస్తోంది. అయితే ఇప్పుడు పవన్ కల్యాణ్ ఆలోచన మారినట్లు సమాచారం. సినిమా ఇండస్ట్రీ నుంచి ఓ ప్రముఖుడిని రాజ్యసభకు పంపించే ఆలోచనలో పవన్ కల్యాణ్ ఉన్నట్టు సమాచారం. ఒకవేళ అది జరగకపోతే... పార్టీ గళాన్ని వినిపిస్తున్న వేములపాటి అజయ్ కుమార్ లేదా పార్టీ కోసం త్యాగాలు చేసిన ఇతర సీనియర్ నేతల పేర్లు కూడా పరిశీలించే అవకాశం ఉంది.ఇక బీజేపీ తన సీటును సామాజిక సమీకరణాలకు వేదికగా మార్చుకోబోతున్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా ఎస్సీ వర్గీకరణ విషయంలో అండగా నిలిచిన మందకృష్ణ మాదిగ పేరు దాదాపు ఖరారైనట్లు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇప్పటికే అగ్రనాయకత్వం ఆయనతో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. మందకృష్ణకు టీడీపీ, జనసేన కూడా సంపూర్ణ మద్దతు తెలిపినట్లు సమాచారం.జూన్ లో పదవీకాలం ముగుస్తున్నప్పటికీ, ముందస్తుగానే అభ్యర్థులను ఖరారు చేసి వ్యూహాత్మకంగా ముందుకు వెళ్లాలని కూటమి భావిస్తోంది. ఫిబ్రవరి ఆఖరులో లేదా మార్చి మొదటి వారంలో ఈ పేర్లపై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. మొత్తానికి ఈ నాలుగు సీట్ల కేటాయింపు కూటమిలోని అంతర్గత సమీకరణాలను, భవిష్యత్తు రాజకీయాలను ప్రతిబింబించబోతోంది.

# రాజకీయాలకు అతీతంగా లోకేశ్



**విజయవాడ, ఫిబ్రవరి 22, పెన్ పవర్:** ప్రస్తుత రాజకీయాల్లో పార్టీల మధ్య వైరం, విమర్శలు సర్వసాధారణం. కానీ, ప్రజాప్రతినిధి అంటే కేవలం తన పార్టీ వారికి మాత్రమే కాదని, ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ అండగా నిలిచేవాడే నిజమైన నాయకుడని మంత్రి నారా లోకేష్ మరోసారి నిరూపించారు. రాజకీయ రంగులు చూడకుండా, మానవత్వమే పరమావధిగా ఆయన స్పందించిన తీరు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వీరాభిమాని, సోషల్ మీడియాలో ఆ పార్టీ తరఫున చురుగ్గా ఉండే భాస్కర్ అనే యువకుడి తండ్రి ఇటీవల ఒక రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న తన తండ్రిని కాపాడుకోవడానికి భాస్కర్ తన వద్ద ఉన్న శక్తినంతా ధారపోశాడు. అయితే, వైద్య ఖర్చులు భారమవ్వడంతో ఆందోళన చెందిన అతను, నిస్సహాయ స్థితిలో తన పార్టీ అధినేత వైఎస్ జగన్‌తో పాటు మంత్రి నారా లోకేష్‌ను కూడా ట్యాగ్ చేస్తూ ఎక్స్ వేదికగా సాయం కోరాడు.భాస్కర్ ట్వీట్ చూసిన వెంటనే మంత్రి లోకేష్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా స్పందించారు. అతను తనను గతంలో ఎంతగా విమర్శించాడు లేదా ఏ పార్టీకి చెందినవాడు అనే విషయాలను పక్కన పెట్టి, ఒక సాటి మనిషి ప్రాణం కాపాడటమే ముఖ్యం అని భావించారు. “మీ నాన్నగారికి జరిగిన ప్రమాదం గురించి విని బాధపడ్డాను భాస్కర్. ఆయన త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను. మా టీమ్ మిమ్మల్ని సంప్రదించి అవసరమైన సహాయం అందిస్తుంది” అంటూ భరోసా ఇచ్చారు.చెప్పినట్లుగానే లోకేష్ తన వ్యక్తిగత బృందాన్ని రంగంలోకి దింపారు. వెంటనే బాధితుడి కుటుంబాన్ని సంప్రదించి, మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు. ఒక వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు, టీడీపీ ప్రధాన కార్యదర్శి, మంత్రి స్థాయి వ్యక్తి స్వయంగా ఫోన్ చేయించి సాయం చేయడం రాజకీయ వర్గాల్లో ఆశ్చర్యాన్ని కలిగించింది.ఈ ఘటన నారా లోకేష్‌లోని పరిణతి చెందిన నాయకత్వ లక్షణాలను తెలియజేస్తోంది. ఎన్నికల సమయంలో విమర్శలు ఉండవచ్చు, కానీ కష్టం వచ్చినప్పుడు మాత్రం అందరూ ఒక్కటే అనే సంకేతాన్ని ఆయన ఇచ్చారు. ప్రభుత్వం అనేది అందరిది అని, ఆపదలో ఉన్న ప్రజలకు అండగా ఉండటమే తమ ప్రాధాన్యత అని ఆయన నిరూపించారు. సోషల్ మీడియాలో దూషణలు చేసుకునే కార్యకర్తలకు, నాయకులు ఒకరికొకరు ఎలా గౌరవించుకుంటారో, ఎలా సాయం చేసుకుంటారో ఈ ఘటన ఒక కనువిప్పులా నిలిచింది.లోకేష్ చేసిన సహాయానికి భాస్కర్ చలించిపోయాడు. “థ్యాంక్యూ నారా లోకేష్ అన్నగారు.. పార్టీ చూడకుండా మా నాన్న గారి పరిస్థితిని చూసి ఒక అన్నలా సహాయం చేయడానికి ముందుకు వచ్చినందుకు కృతజ్ఞతలు” అంటూ తిరిగి ట్వీట్ చేశాడు. ఆపద సమయంలో పార్టీ జెండాలు కాదు, మనిషికి మనిషి తోడవ్వడమే ముఖ్యమని అతను కూడా గ్రహించాడు.నారా లోకేష్ చేసిన ఈ చిన్న సాయం ఒక కుటుంబానికి కొండంత అండగా నిలిచింది. పదవులు వస్తుంటాయి, పోతుంటాయి కానీ ఇలాంటి మానవీయ విలువలే నాయకుడిని ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలబెడతాయి. రాజకీయాల కంటే మానవత్వం గొప్పదని చాటిచెప్పిన లోకేష్ స్పందన నిజంగా అభినందనీయం. ఈ తరహా రాజకీయ సంస్కృతి రాష్ట్రంలో ఆరోగ్యకరమైన వాతావరణానికి నాంది పలుకుతుందని ఆశించవచ్చు=

# వైసీపీకి తలనొప్పిగా స్లోగన్



**విజయవాడ, ఫిబ్రవరి 23, పెన్ పవర్:** సిగరెట్ తాగడం ఆరోగ్యానికి హానికరం... ఇది సిగరెట్ ప్యాకెట్ పైనే ఉంటుంది. చాలామందిని ఆలోచింపజేస్తుంది కూడా. అయితే సిగరెట్ కు ఎడిక్ట్ అయినవారు మానుకో లేరు కానీ.. ఈ స్లోగన్ చదివిన వారు మాత్రం కాస్త దూరంగానే ఉంటారు. అయితే రాజకీయంగాను ఇప్పుడు అదే స్లోగన్ వినిపిస్తోంది. సాధారణంగా పొలిటికల్ స్లోగన్స్ బలంగా వెళ్తాయి ప్రజల్లోకి. అప్పట్లో జగన్మోహన్ రెడ్డి విషయంలో.. రావాలి జగన్.. కావాలి జగన్ అనే స్లోగన్ బలంగా వెళ్ళింది ప్రజల్లోకి. 2019లో జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చేందుకు దోహద పడింది. సైకో పోవాలి.. సైకిల్ రావాలి అనే నినాదం తో ముందుకు వెళ్ళింది తెలుగుదేశం పార్టీ 2024 ఎన్నికల్లో. ఘనవిజయం సొంతం చేసుకుంది. పొలిటికల్ స్లోగన్స్ తో పాటు రాజకీయ పార్టీల పాటలు ఇప్పుడు చాలా ప్రభావితం చేస్తున్నాయన్నమాట.మరోవైపు తాజాగా ఏపీ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఒక పొలిటికల్ స్లోగన్ ను బయటకు తీశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విషయంలో ఆరోగ్యానికి హానికరం అనే ట్యాగ్ ను జత చేశారు. ఈ రాష్ట్రానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హానికరం అన్న మాట అనేసారు. అది ఇప్పుడు టిడిపి కూటమి శ్రేణుల్లోకి బలంగా వెళ్ళింది. తటస్థులతో పాటు వైసిపి వ్యతిరేకులకు ఎంతగానో ఆకర్షిస్తోంది ఈ నినాదం. వైసిపి హయాంలో.. టిడిపి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నారా లోకేష్ జగన్మోహన్ రెడ్డిని ఉద్దేశించి సైకో అని వ్యాఖ్యానించారు. వైసీపీ నుంచి అనుకున్న స్థాయిలో దీనిపై రియాక్షన్ రాలేదు. క్రమేపి ఈ సైకో అనే పదం కూటమి పార్టీల వాడుక అస్త్రంగా మారిపోయింది. సామాన్యులు సైతం సైకో నినాదంతో వైసిపి చర్యలను తప్పుపట్టేవారుజగన్ పాలనలో రాష్ట్రం 20 ఏళ్ల పాటు వెనక్కి వెళ్ళిపోయింది అనే మాట కూడా ప్రజల్లోకి బలంగా వెళ్ళింది. సంక్షేమం పేరుతో అభివృద్ధిని మరుగున పడేసారన్న విమర్శ ఉంది. అప్పట్లో బీజేపీ నేత పురందేశ్వరి జగన్ చేసిన అప్పులను ప్రస్తావించారు. పెద్ద ఎత్తున విమర్శలు చేయడంతో.. అప్పుల ప్రభుత్వం అన్న నినాదం ప్రజల్లోకి బలంగా వెళ్ళిపోయింది. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఎక్కువగా డ్యామేజ్ చేసేది ఈ స్లోగన్స్. తాజాగా పయ్యావుల కేశవ్ చేసిన.. రాష్ట్రానికి వైసీపీ హానికరం అనే నినాదం కూడా.. ఓ రేంజ్ లో ప్రభావం చూపడం ఖాయం అన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి.

# బుట్టా ఫ్యామిలీ దివాలా..!

**కర్నూలు, ఫిబ్రవరి 22, పెన్ పవర్:** ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లోనూ, వ్యాపార రంగంలోనూ అత్యంత సంపన్నురాలుగా పేరుగాంచిన మాజీ ఎంపీ బుట్టా రేణుక ప్రస్తుతం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నారు. ఆమె దంపతులు తీసుకున్న వందల కోట్ల రుణాలు బకాయిలుగా మారడంతో, వారు తాకట్టు పెట్టిన ఖరీదైన ఆస్తులను వేలం వేసేందుకు బ్యాంకింగ్, ఆర్థిక సంస్థలు రంగం సిద్ధం చేశాయి. ముఖ్యంగా ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ ఈ వేలం ప్రక్రియను చేపట్టింది.బుట్టా రేణుక, ఆమె భర్త బి.ఎస్.నీలకంఠ 2018లో తమ వ్యాపార అవసరాల కోసం ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ నుండి సుమారు రూ. 310 కోట్ల రుణాన్ని తీసుకున్నారు. బుట్టా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్, బుట్టా కన్వెన్షన్ సర్వీసెస్, మెరిడియన్ ఎడ్యుటెక్ సర్వీసెస్ వంటి తమ సంస్థల నిర్వహణ కోసం ఈ నిధులను వినియోగించారు. 15 ఏళ్ల కాలపరిమితితో తీసుకున్న ఈ రుణానికి సంబంధించి ప్రారంభంలో కొన్ని వాయిదాలు చెల్లించినప్పటికీ, గత ఐదేళ్లుగా వారు చెల్లింపులను పూర్తిగా నిలిపివేసినట్లు సమాచారం. వడ్డీతో కలిపి ఈ బకాయిలు ప్రస్తుతం రూ. 340 కోట్ల నుండి రూ. 360 కోట్ల వరకు చేరాయివాయిదాలు చెల్లించకపోవడంతో బకాయిల వసూలు కోసం ఎల్ఐసీ హెచ్ఎఫ్ఎల్ హైదరాబాద్‌లోని అత్యంత విలువైన ప్రాంతాల్లో ఉన్న పలు ఆస్తులను వేలానికి పెట్టింది. హైదరాబాద్ కేపీహెచ్‌పీ కాలనీలో సర్వే నెంబర్ 1009లోని 3823 చదరపు గజాల స్థలాన్ని వేలం వేయడానికి ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ ఫైనాన్స్ బెంగళూరు బ్రాంచి అధికారిక ప్రకటన జారీ చేసింది. ప్రస్తుతం ఆ స్థలంలో మెరీడియన్ స్కూల్ కొనసాగుతుంది. అయితే, మార్చి 24న ఈ స్థలాన్ని ఎల్ఐసీ వేలం వేయబోతోంది. మెరిడియన్ స్కూల్ ఉన్న ఆస్తి కనీసం విలువ రూ.65కోట్లుగా అధికారులు నిర్ణయించారు.బుట్టా రేణుక 2014 సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారిగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున కర్నూలు ఎంపీగా పోటీ చేసి విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో ఏపీలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. ఆ తరువాత మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో బుట్టా రేణుక తెలుగుదేశం పార్టీకి మద్దతు ప్రకటించారు. మళ్లీ 2019 ఎన్నికల సమయానికి తిరిగి వైసీపీ గూటికి చేరుకున్నప్పటికీ.. ఆమెకు టికెట్ దక్కలేదు. వైసీపీ అధికారంలోకి రావడంతో రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ గా నియమించారు. 2024 ఎన్నికల్లోనూ ఆమెకు ప్రత్యక్షంగా పోటీ చేసే అవకాశం రాలేదు. ఆ తరువాత ఆమె క్రియాశీల రాజకీయాల్లో పెద్దగా కనిపించడం లేదు.బంజారాహిల్స్‌లోని సుమారు 5,000 గజాల ఖరీదైన స్థలం వేలానికి వచ్చింది. దీని రిజర్వు ధర సుమారు రూ. 145 కోట్లుగా నిర్ణయించారు. మాదాపూర్‌లోని 7,205 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న ప్రముఖ బుట్టా కన్వెన్షన్ సెంటర్ కూడా వేలం జాబితాలో ఉంది. గతంలో కూడా వీటిని వేలం వేయాలని ప్రయత్నించినప్పటికీ, సాంకేతిక కారణాల వల్ల లేదా వేలం దారుల నుండి స్పందన లేకపోవడం వల్ల ప్రక్రియ వాయిదా పడుతూ వచ్చింది.బుట్టా రేణుక కుటుంబం కేవలం రాజకీయాల్లోనే కాకుండా.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అతిపెద్ద వ్యాపార సామ్రాజ్యాల్లో ఒకటిగా పేరుగాంచిన బుట్టా గ్రూప్ ను నిర్వహిస్తోంది. ఈ గ్రూపు పలు రంగాల్లో విస్తరించింది. విద్యారంగం, ఆటోమొబైల్ రంగం, హాస్పిటాలిటీ, రియల్ ఎస్టేట్ రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోన్నట్లు తెలుస్తోంది. ఇంకా పలు రంగాల్లో వీరికి పెద్దఎత్తున పెట్టుబడులు ఉన్నట్లు సమాచారం.==

# ప్రతి 100 కిలోమీటర్ల పరిధిలో ట్రామా సెంటర్

**విజయవాడ, ఫిబ్రవరి 22, పెన్ పవర్:** సంకీర్ణ ప్రభుత్వానికి ప్రతి ప్రాణం విలువైనదేనని వైద్యారోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ అసెంబ్లీలో నొక్కిచెప్పారు. రాష్ట్ర ప్రజారోగ్య మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి అనేక చర్యలను ప్రకటించారు. ప్రశ్నోత్తరాల సమయంలో ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ.. ముఖ్యంగా 50 పడకల కంటే తక్కువ వైద్య సౌకర్యాలు ఉన్న నియోజకవర్గాలలో ఆసుపత్రులను అప్‌గ్రేడ్ చేయడానికి ప్రభుత్వం సమగ్ర విధానాన్ని రూపొందిస్తోందని అన్నారు.’మొదటి దశలో ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం పద్ధతిలో 61 నియోజకవర్గాలలో మల్టీ-స్పెషాలిటీ ఆసుపత్రులను ఏర్పాటు చేయాలని మేం నిర్ణయించాం. అవసరమైన చోట, క్రిటికల్ కేర్ బ్లాక్ యూనిట్లను కూడా ఏర్పాటు చేస్తున్నాం.’ అని సత్యకుమార్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సెకండరీ ఆసుపత్రులను అప్‌గ్రేడ్ చేయడానికి దాదాపు 40 ప్రతిపాదనలు వచ్చాయని సభకు తెలియజేశారు. వీటిలో విజయవాడ శివార్లలోని గన్నవరం, నెల్లూరు జిల్లాలోని కొవ్వూరు, తూర్పు గోదావరి జిల్లాలోని కొవ్వూరు ఉన్నాయి. మంగళగిరి, పిఠాపురంలోని 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను 100 పడకలకు అప్‌గ్రేడ్ చేయడానికి, చింతూరులోని 50 పడకల ఆసుపత్రిని 100 పడకల సౌకర్యంగా విస్తరించడానికి ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్టుగా వెల్లడించారు.2014-19లో టీడీపీ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం 81 ఆసుపత్రులలో పడకల సామర్థ్యాన్ని పెంచాలని నిర్ణయించినప్పటికీ, గత ప్రభుత్వం 2019-2024 మధ్య నిర్మాణ పనులను పూర్తి చేయలేదని మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఆళ్లగడ్డలోని 30 పడకల ఆసుపత్రిని 50 పడకలకు అప్‌గ్రేడ్ చేయడంతో సహా పెండింగ్‌లో ఉన్న ఈ పనులను సంకీర్ణ ప్రభుత్వం ఇప్పుడు వేగవంతం చేసిందని ఆయన అన్నారు.నాబార్డ్ మద్దతుతో రూ.1,518.80 కోట్ల వ్యయంతో 188 ఏరియా ఆసుపత్రులు, సీహెచ్‌సిలలో నిర్మాణ పనులు జరుగుతున్నాయని సత్యకుమార్ తెలిపారు. ఇందులో రూ.111 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయని, 60 ఆసుపత్రి భవనాలు ముగింపు దశకు చేరుకున్నాయని వెల్లడించారు.ప్రతి జిల్లాలో ఒకటి చొప్పున 24 క్రిటికల్ కేర్ బ్లాక్ భవనాలు రూ.600 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణంలో ఉన్నాయని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. వీటిలో 14 పూర్తి దశల్లో ఉన్నాయి. చిత్తూరు, అమలాపురం, అన్నమయ్య, పోలవరం జిల్లాల్లో అదనపు క్రిటికల్ కేర్ బ్లాక్‌ల కోసం రాష్ట్రం కేంద్ర అనుమతిని కోరింది. ప్రతి 100 కి.మీ. రహదారులకు ఒక ట్రామా కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలనే ఇటీవలి కేంద్ర బడ్జెట్ ప్రతిపాదనను సత్యకుమార్ యాదవ్ ప్రస్తావిస్తూ, ప్రమాద సంబంధిత మరణాలను నివారించడానికి తగిన ప్రదేశాలలో ట్రామా సెంటర్‌లను గుర్తించడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.గుడివాడ నియోజకవర్గంలోని నందివాడ మండలంలోని రుద్రపాక గ్రామంలో కొత్త ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్ర భవనం నిర్మాణం జరుగుతోందని మంత్రి తెలియజేశారు. రూ.1.94 కోట్ల ప్రాజెక్టు వ్యయంతో, ఇప్పటివరకు రూ.54 లక్షల విలువైన పనులు పూర్తయ్యాయని అన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# డిజిటల్ మోసాల బారిన పడొద్దు

**బ్యాంకు ఖాతాల పాస్‌వర్డ్స్ తరుచూ మార్చండి : మన్ కీ బాత్‌లో ప్రధాని మోడీ**



**హైదరాబాద్ పెన్ పవర్:** బ్యాంకు ఖాతాల పాస్‌వర్డ్‌లను తరుచూ మారుస్తుం డాలని దేశ ప్రజలకు ప్రధాని మోడీ సూచించారు. నో యువర్ కస్టమర్ (కేవైసీ)ని అప్‌డేట్ చేయమని, రీ–కేవైసీని చేయమని బ్యాంకు నుంచి వచ్చే రిక్వెస్టులను చూసి అస్సలు చిరాకు పడవద్దని ప్రజలను ఆయన కోరారు. సొంత డబ్బును కాపాడుకునేందుకే ఈ పనిని చేస్తున్నామనే విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. ఆదివారం 131వ మన్ కీ బాత్ కార్యక్రమంలో మోడీ పలు కీలక అంశాలను ప్రస్తావించారు. ఇప్పటికీ బ్యాంకు ఖాతా కేవైసీని చేశాం కదా, దీన్ని మళ్లీ మళ్లీ ఎందుకు చేయాలనే ప్రశ్న చాలామంది మదిలో ఉదయిస్తుంటుందని ప్రధాని అన్నారు. 'మళ్లీమళ్లీ కేవైసీ ఎందుకంటే, బ్యాంకు ఖాతా భద్రత కోసమే' అని అందరూ గ్రహించాలని ఆయన పిలుపునిచ్చారు. డిజిటల్ అరెస్టు లాంటి ఆన్‌లైన్ ఆర్థిక మోసాల బారినపడకుండా అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ప్రజలకు సూచించారు. ఈ కాలంలో పెన్షన్, రాయితీలు, బీమా, యూపీఐ సహా అన్నీ బ్యాంకు ఖాతాతోనే లింకై ఉన్నాయని మోడీ గుర్తుచేశారు. అందుకే ఖాతాలకు మెరుగైన భద్రతను కల్పించేందుకు రీ కేవైసీని బ్యాంకులు చేయిస్తాయన్నారు.

# రైల్వే మాజీ మంత్రి కన్నుమూత



**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమబెంగాల్ రాజకీయాల్లో అపర చాణక్యుడిగా పేరుపొందిన నాయకుడు, రైల్వే మాజీ మంత్రి, అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత ముకుల్ రాయ్ ఇకలేరు. అనారోగ్య కారణాలతో గత కొంతకాలంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 71 ఏళ్ల రాయ్.. కార్డియాక్ అరెస్ట్ కు గురై కన్నుమూశారు. ముకుల్ రాయ్ కుమారుడు సుబ్రాన్ష్ ఈ విషయాన్ని మీడియాకు వెల్లడించారు.రాయ్ మరణవార్త తెలిసి పశ్చిమబెంగాల్‌కు చెందిన పలువురు రాజకీయ నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. కాగా తృణమూల్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక సభ్యుల్లో ముకుల్ రాయ్ ఒకరు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జికి ఆయన అత్యంత నమ్మకస్తుడు. టీఎంసీలో రెండో అత్యంత శక్తిమంతమైన నేతగా పేరొందిన ముకుల్ రాయ్.. 2017లో పార్టీని వీడి అందరినీ ఉలిక్కిపాటుకు గురిచేశారు. 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు బీజేపీలో చేరిన ఆయన.. బెంగాల్‌లో పార్టీని విస్తరించడంలో కీలకపాత్ర పోషించారు.ఆ ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ బెంగాల్‌లో 18 స్థానాల్లో గెలుపొందింది. 2021లో జరిగిన బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో రాయ్ బీజేపీ నుంచే పోటీ చేసి విజయం సాధించారు. అయితే, అదే ఏడాది మళ్లీ తృణమూల్ కాంగ్రెస్ గూటికి తిరిగొచ్చారు. ఒకప్పుడు ఆయనను బెంగాల్ రాజకీయ చాణక్యుడిగా పిలిచేవారు. కేంద్రంలో యూపీఏ సర్కారు రెండో దఫా అధికారంలో ఉన్న సమయంలో రైల్వే శాఖ మంత్రిగా వ్యవహరించారు.2023లో డిమెన్షియా బారిన పడిన ఆ యన.. అప్పటి నుంచి క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్నారు. డిమెన్షియా కారణం గా గత ఏడాది ముకుల్ రాయ్ శాసనసభ సభ్యత్వాన్ని కూడా కలకత్తా హైకోర్టు రద్దు చేసింది.

# క్యూబాకు అండగా రష్యా.. చమురు ట్యాంకర్ తరలింపు

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా విధించిన క్రూరమైన ఆంక్షల కారణంగా ఇంధన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న క్యూబాకు రష్యా ఒక చమురు ట్యాంకర్‌ను పంపింది. సముద్ర నిఘా సంస్థ కెప్లర్ ప్రకారం, 'సీ హార్స్' నౌక 200,000 బ్యారెళ్ల ఇంధనంతో బయలుదేరింది. ఈ నౌక మార్చి ప్రారంభంలో క్యూబాకు చేరుకుంటుంది. క్యూబా ప్రజలకు సంఘీభావం తెలిపిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, అమెరికా ఆంక్షలను అంగీకరించడానికి రష్యా సిద్ధంగా లేదని ప్రకటించారు. క్యూబా వైపు వెళ్తున్న తొమ్మిది ఇంధన నౌకలను అమెరికా స్వాధీనం చేసుకుంది. అయితే, రష్యా చమురు ట్యాంకర్‌ను అమెరికా స్వాధీనం చేసుకుంటుందా అని ప్రపంచం నిశితంగా పరిశీలిస్తోంది.

పది సంవత్సరాలలో క్యూబాకు ఇంధనం చేరని మొదటి నెల జనవరి. డిసెంబర్‌లో అందుకున్న చమురు కొన్ని వారాల్లో అయిపోతుందని అంతర్జాతీయ వాణిజ్య పరిశీలకులు అంచనా వేస్తున్నారు. వంట, రవాణా మరియు విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన ఇంధనం లేకుండా క్యూబా సంక్షోభంలో ఉంది. ఉపగ్రహ చిత్రాల ప్రకారం, క్యూబాలో రాత్రిపూట కాంతి పరిమాణం 50 శాతం వరకు తగ్గిందని అంతర్జాతీయ వార్తా సంస్థలు నివేదిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే రష్యా క్యూబాకు చమురు సరఫరా చేయడానికి ప్రయత్నిస్తోంది.వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో, అతని భార్య కిడ్నాప్ తర్వాత ట్రంప్ పరిపాలన క్యూబాకు చమురు రవాణాను నిలిపివేయాలని ఆదేశించింది. క్యూబాకు ఇంధనం సరఫరా చేసే దేశాలపై ప్రతీకార సుంకాలు విధిస్తామని బెదిరించిన తర్వాత మెక్సికో చమురు సరఫరాలను నిలిపివేసింది. వెనిజులా నుండి ఇంధనం లేకపోవడం, చమురు దిగుమతులు తగ్గడం ఆ దేశాన్ని సంక్షోభంలోకి నెట్టాయి.

## ట్రంప్ రిసార్టులో కాల్పుల కలకలం..ఒకరు మృతి

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు చెందిన ఫ్లోరిడాలోని పామ్‌బీచ్ రిసార్ట్ వద్ద ఒక్కసారిగా కాల్పుల కలకలం రేగింది. రిసార్టులోకి గన్ పట్టుకుని అక్రమంగా చొరబడేందుకు ప్రయత్నించిన ఓ వ్యక్తిని భద్రతా సిబ్బంది కాల్చి చంపారు. వివరాల్లోకి వెళితే.. ఫ్లోరిడాలోని పామ్‌బీచ్‌లో ఉన్న ట్రంప్ నివాసం కమ్ రిసార్ట్ వద్దకు ఒక వ్యక్తి గన్‌తో వచ్చి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించాడు. అక్కడ కాపలా ఉన్న భద్రతా సిబ్బంది అతడిని అడ్డుకున్నప్పటికీ, అతను మొండిగా ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించడంతో సిబ్బంది కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో సదరు వ్యక్తి స్పాట్‌లోనే ప్రాణాలు కోల్పోయాడు.అయితే, సాధారణంగా డొనాల్డ్ ట్రంప్ వారాంతాల్లో ఈ పామ్‌బీచ్ రిసార్ట్‌లోనే గడుపుతుంటారు. అయితే, ఈ ప్రమాదం జరిగిన సమయంలో ట్రంప్ అక్కడ లేరని, ఆయన వాషింగ్టన్ డీసీలోని వైట్‌హౌస్‌లోనే ఉన్నారని అధికారులు స్పష్టం చేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది. ఈ ఘటనతో రిసార్ట్ పరిసర ప్రాంతాల్లో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. అమెరికా సీక్రెట్ సర్వీస్, స్థానిక పోలీసులు రంగంలోకి దిగి ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. మృతి చెందిన వ్యక్తి ఎవరు.. అతడు రిసార్టుపై దాడికి ఎందుకు ప్లాన్ చేశాడు? అనే కోణంలో విచారణ చేపడుతున్నారు.

## ట్రంప్ ఎస్టేట్‌లోకి చొరబాటు..

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నివాసంలో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. ఫ్లోరిడాలో ఉన్న ఆయన నివాసంలోకి ఓ సాయుధ దుండగుడు చొరబడటం కలకలం రేపింది. దీంతో వెంటనే స్పందించిన సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు అతడిని హతమార్చారు. ఈ ఘటన సమయంలో ట్రంప్ దంపతులు వైట్‌హౌస్‌లోనే ఉన్నట్టు పోలీసులు తెలిపారు. ఫ్లోరిడా పామ్ బీచ్‌లో ఉన్న 'మార్ ఎ లాగో' ఎస్టేట్‌కు అధ్యక్షుడు ట్రంప్ వారాంతంలో వస్తుంటారు. ఇక్కడ కట్టుదిట్టమైన భద్రత ఉంటుంది. అర్ధరాత్రి సమయంలో ఓ దుండగుడు ఎస్టేట్ నార్త్ గేట్ నుంచి ప్రవేశించాడు. అతడి చేతిలో ఆయుధంతోపాటు ఇంధనం క్యాన్ ఉన్నట్టు సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు గుర్తించారు. వెంటనే అప్రమత్తమై మట్టుబెట్టినట్టు సీఐఏతోపాటు పామ్ బీచ్ పోలీసులు వెల్లడించారు. అతడి వయసు 20 నుంచి 25 మధ్య ఉండవచ్చని.. ఈ ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హత్యకు గతంలోనూ ప్రయత్నాలు జరిగిన విషయం తెలిసిందే. 2024 జులైలో ఎన్నికల ప్రచారంలో ఉన్న ఆయనపై హత్యాయత్నం జరిగింది. ఆ ఘటనలో మరణం నుంచి తృటిలో తప్పించుకున్నారు. అనంతరం కొన్ని నెలలకు.. పామ్ బీచ్ గోల్ఫ్ కోర్సులో రైఫిల్‌తో అనుమానాస్పదంగా ఉన్న ఓ వ్యక్తినీ పోలీసులు అరెస్టు చేశారు.

# కేరళ ఎన్నికల రాజకీయం

**హైదరాబాద్ పెన్ పవర్:** 'ఎంకి పెండ్లి సుబ్బి చావుకొచ్చిందన్నట్టు.. కేరళ అసెంబ్లీ ఎన్నికలు తెలంగాణ కాంగ్రెస్ నేతల పీకలమీదికి వచ్చిందట. ఆ రాష్ట్ర ఎన్నికల ఖర్చు కింద రూ.వెయ్యి కోట్లు సర్దే బాధ్యతను తెలంగాణ ముఖ్యనేత నెత్తికెత్తుకున్నారని ఢిల్లీ కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి. తన మార్గదర్శిని సీఎం అభ్యర్థిగా ఎంపికచేసినందుకు కృతజ్ఞతగా తాను రూ.500 కోట్లు పంపిస్తానని, ఇంకో రూ.500 కోట్లు మంత్రివర్గం నుంచి ముక్కుపిండి వసూలు చేయిస్తానని ముఖ్యనేత ఒప్పుకున్నట్టు ఢిల్లీ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.అంతేకాదు.. తన రెండో గురువు తరఫున ప్రచారం చేయడానికి ఇప్పటికే తన సొంత చానల్‌గా పేరున్న ఓ 'పెద్ద' తెలుగు టీవీ చానల్‌ను కేరళలో లాంచ్ చేయించినట్టు కాంగ్రెస్ శ్రేణులు చెప్తున్నాయి. అధిష్ఠానం ఈ నెల 19న మంత్రి వర్గాన్ని గంపగుత్తగా ఢిల్లీకి పిలిచిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా 'కేరళ' ఎన్నికల పన్ను వేసినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. 'గాంధీ కుటుంబానికి ఆర్థిక అవసరాలు ఉన్నాయంటే తలా ఒక చెయ్యేసి తెలంగాణ నుంచి రూ.వెయ్యి కోట్లు పోగేసి ఇవ్వగల శక్తి కాంగ్రెస్ కార్యకర్తలకు ఉన్నది' అంటూ ఇటీవల చేసిన వ్యాఖ్యలకు అర్థం ఇదేనా? అంటూ పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతున్నది.సర్దుబాటు బాధ్యత భుజాన వేసుకున్న కాంగ్రెస్ ముఖ్యనేత? ఏప్రిల్ నెలలో కేరళలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఇప్పటికే ఎన్నికల కమిషన్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభించింది. ఓటరు లిస్టును ప్రకటించింది. ఏఐసీసీలో ప్రధాన పోస్టులో ఉన్న నేతనే సీఎం అభ్యర్థిగా దాదాపు ఖరారు చేసినట్టు సమాచారం. దీంతో గురువును గెలుపించుకునే బాధ్యతను తెలంగాణ ముఖ్యనేత భుజాల మీద వేసుకున్నారని కాంగ్రెస్ శ్రేణులు చెప్తున్నాయి.చంద్రబాబు శిష్యరికం వదిలిపెట్టి కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి ముఖ్యనేతకు ఏఐసీసీ ప్రధాన నేత రెండో గురువుగా, మార్గదర్శిగా కొనసాగుతున్నారన్నది బహిరంగ రహస్యం. బాబు ఆదేశాల మేరకు కాంగ్రెస్ అధినేత్రిని బలి దేవతగా పోల్చి, తెలంగాణలో వెయ్యి మందిని బలి తీసుకున్నదని ఆరోపించిన కొద్దిరోజులకే ముఖ్యనేత మూడు రంగుల కండువా కప్పుకున్న సంగతి తెలిసిందే. ఏఐసీసీలో ప్రధాన పదవిలో ఉన్న కేరళ నేత ఆయనకు అక్కున చేర్చుకొన్నారు. గాంధీ కుటుంబాన్నే నమ్ముకొని ఉన్న సీనియర్ కాంగ్రెస్ నేతలను పక్కకు తోసి.. నాడు పార్టీలో ప్రధాన పదవి ఇప్పించడం, నేడు ప్రభుత్వంలో ప్రధాన పదవి దక్కేలా చేయడం వరకు ఆయన అండదండగా ఉన్నారని ఢిల్లీ కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి.




బడేభాయ్ వివాదం, తెలంగాణలో బీజేపీ ఎజెండాను అమలు చేస్తున్నారన్న ఆరోపణలు వచ్చినప్పుడు రాహుల్‌గాంధీ ముఖ్యనేతను దూరం పెట్టారని, ఆ సమయంలో కుర్చీ నుంచి దించేస్తారన్న ప్రచారం జరిగినప్పుడుకూడా కేరళ నేతే ఆయనను కాపాడారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పుడు కేరళ నేతను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎంపిక చేయడంతో తనను ఆదరించిన గురువుకు దక్షిణ చెల్లించుకునేందుకు ఇదే సరైన సమయమని ముఖ్యనేత భావించారని సమాచారం.అందుకే తెలంగాణ కాంగ్రెస్ వర్గాలను ఏకం చేస్తున్నారని గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. నోటిఫికేషన్ వెలువడే నాటి నుంచి ఫలితాలు వచ్చే వరకు ఖర్చంతా తెలంగాణ నుంచే ఇస్తామని ఢిల్లీ నేతలకు హామీ ఇచ్చినట్టు తెలిసింది. దాదాపు రూ.వెయ్యి కోట్లు అవసరమని చెప్పగా, ఇందులో సగం అంటే దాదాపు రూ.500 కోట్లు తాను, నెంబర్ 2 మంత్రి కలిసి సమకూర్చుతామని చెప్పినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. మరో 50 శాతం నిధులు మంత్రివర్గానికి అప్పగించాలని ముఖ్యనేత సూచించినట్టు తెలిసింది.వారు దిగువశ్రేణి నాయకత్వంతో సమన్వయం చేసుకొని సమకూర్చుతారని చెప్పినట్టు చర్చ జరుగుతున్నది. కర్ణాటక నుంచి కూడా కొంత నిధులు తేవాలని మరో ప్రముఖ నేత సూచించగా, ఆ డబ్బు అధిష్ఠానం ఖర్చుల కోసం వాడుకోవాలని, కేరళ అసెంబ్లీ ఎన్నికల ఖర్చు మొత్తం తెలంగాణే చూసుకుంటుందని ముఖ్యనేత మరోసారి స్పష్టంచేసినట్టు తెలిసింది. దీనికితోడు అక్కడ తన మార్గదర్శికి ప్రచారం కోసమే తెలంగాణలో ముఖ్యనేత పెట్టుబడులతో నడుస్తున్నదని గుర్తింపు ఉన్న ఒక తెలుగు ఛానల్‌ను మలయాళంలోనూ లాంచ్ చేసినట్టు చెప్తున్నారు.ఒక్కో మంత్రికి రూ. 35 కోట్లు టార్గెట్‌ముఖ్యనేత సూచన మేరకు పెద్దలు 19న మంత్రి వర్గాన్ని ఢిల్లీకి పిలిచి టా ర్గెట్ పెట్టినట్టు విశ్వసనీయంగా తెలిసిం ది. వారి పదవులకు, శాఖలకు భరోసా కల్పిస్తూ సగటున ఒక్కొక్కరికి రూ.35 కోట్ల టార్గెట్ పెట్టినట్టు ప్రచారం జరుగుతున్నది. ఇటీవల బాధ్యతలు చేపట్టిన డీసీసీల సహాయ సహకారాలు తీసుకోవాలని సూచించినట్టు తెలిసింది. అధినే తే ఎదురుగా కూర్చొని టార్గెట్ నిర్దేశిస్తున్న నేపథ్యంలో మంత్రులు మౌనం గా అంగీకరించినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి.ఆర్థికంగా బలంగా ఉన్న న లుగురు మంత్రులు రూ.100 కోట్ల వర కు వీలైనంత సర్దితే, ఎస్సీ, ఎస్టీ మంత్రు ల టార్గెట్‌లో కొంత మినహాయింపు ఇస్తామని ఆఫర్ ఇచ్చినట్టు సమాచారం. 'ఏమైనా ఇబ్బందులున్నాయా?' అని అగ్రనేత అడుగగా, 'తెలంగాణ వెరీ పొ టెన్షియల్ స్టేట్' అంటూ ఏఐసీసీ ప్రధా న నేత ఒకరు ఊరడించినట్టు తెలిసింది. ఈ నిధుల సమకూర్పులో భాగంగానే శనివారం డీసీసీ అధ్యక్షుల సమావేశం నిర్వహించినట్టు సమాచారం. ఢిల్లీకి అ వసరమైన డబ్బు పంపేందుకు సమాయత్తమై ఉండాలంటూ డీసీసీ అధ్యక్షులను మానసికంగా సిద్ధం చేస్తున్నారని పార్టీలో చర్చ జరుగుతున్నది. నిధుల సమీకరణ బాధ్యతలను ఇన్‌చార్జ్ మంత్రులకు ఇచ్చే ఆలోచనతో ఉన్నట్టు పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు.

# ఉద్యోగాలను ఉద్యమంగా భావించిన న్యాయపతి దంపతులు

**హైదరాబాద్ పెన్ పవర్:** న్యాయపతి రాఘవరావు... ఈ పేరు నేటి తరానికి తెలియక పోవచ్చు. అయితే రేడియో ప్రధాన మనో రంజన సాధనంగా ఉన్న పాతకాలపు రోజుల్లో రేడియో అన్నయ్యగా ఆయన సుపరిచితులు. పిల్లలే సర్వస్వంగా ఎంచి, పిల్లల కోసం అయన ఒక్కరే కాక, సహధర్మచారిణి అయిన కామేశ్వరితో కలిసి ఎన్నో పిల్లల కార్యక్రమాలను నిర్వహించారు. బాలికల శ్రేయస్సు, సాంస్కృతిక వికాసానికి తన జీవితాన్ని అంకితం చేసిన విద్యావేత్త, కళా కోవిదుడు, రచయిత. నాటి రేడియో శ్రోతల హృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించు కున్నారు. పిల్లలారా రారండోయ్...బాల బాలికలు రారండోయ్... బాలల ప్రోగ్రాం విన రారండోయ్... అంటూ ప్రారంభమై, పాటతో మొదలై... 'పోదామా ఇక పోదామా ఇళ్లకు... మన ఇళ్లకు...అనే ముగింపుతో వినిపించే రేడియోలో ప్రసారమయ్యే బాలానందం కార్యక్రమం కోసం పిల్లలే కాదు...పెద్దలు సైతం ఉత్సాహం తో ఎదిరి చూసే వారు. ప్రోగ్రాం ప్రారంభం అయిందంటే శ్రద్ధగా రెడియోలకే అతుక్కు పోయే వారు.న్యాయపతి రాఘవరావు (ఏప్రిల్ 13, 1905 – ఫిబ్రవరి 24, 1984) రేడియో అన్నయ్యగా ప్రసిద్ధుడు, ఆంధ్ర బాలానంద సంఘం సంస్థాపకుడు, బాలసాహిత్యవేత్త, బాలబాలికల శ్రేయస్సు, సాంస్కృతిక వికాసానికి తన జీవితాన్ని అంకితం చేసిన విద్యావేత్త, కళాకోవిదుడు, రచయిత. పిల్లల కోసం ఎవరూ, ఏ సంస్థా , ఏ ప్రభుత్వమూ చేయనంత కృషి సలిపారు రాఘవ రావు.

1905వ సంవత్సరం ఏప్రిల్ 13 న ఒరిస్సాలోని బరంపురం లో అయన జన్మించారు. తండ్రి న్యాయపతి రామానుజస్వామి ప్రముఖ న్యాయవాది. పాఠశాల చదువు అనంతరం విజయనగరం లోని మహారాజ కళాశాల లో డిగ్రీ పూర్తి చేసారు. 1934 లో కామేశ్వరితో పెళ్ళయింది. "రేడియో అక్కయ్య"గా పేరుగాంచిన న్యాయపతి కామేశ్వరి ఆమే. రాఘవరావుకు బాల్యం నుంచి పిల్లలంటే ప్రాణం. వారికి కథలు చెప్పటమన్నా, నటించి చూపటమన్నా మహా ఇష్టం. పాఠశాలలో వక్తృత్వ పోటీల్లో కథలు చెప్పే పోటీల్లో ప్రథమ బహుమతులన్నీ ఆయనకే సొంతం, సొత్తు అయ్యేవి.డిగ్రీ అయ్యాక, మద్రాసు లో "ది హిందూ" పత్రికలో విలేఖరిగా జీవితం ప్రారంభించి, పది సంవత్సరాల తరువాత, దానికి రాజీనామా చేసి , ఆకాశవాణి లో కాంట్రాక్టు పద్ధతిపై చేరాడు. ఆ రోజుల్లో బీ.బీ.సీ లోని పిల్ల కార్యక్రామాల తరహాలో మన దేశంలో కూడ రేడియో చిన్న పిల్లల కొరకు రేడియో ప్రసారలను చేపట్టాలని అప్పటి ప్రభుత్వం జాతీయ స్థాయిలో ఒక నిర్ణయం తీసుకుంది. మద్రాసు రేడియోలో పిల్లల కార్య క్రమాలను దుర్గాబాయి దేశముఖ్ నిర్వహించే వారు. 1933 లో రాఘవ రావు, కామేశ్వరి జంటకు ఆ అవకాశం వరించింది. అక్కడ చేరిన తరువాత చిన్నపిల్లల కార్యక్రమాలను ప్రతి వారం నిర్వహించే పద్ధతిని ప్రవేశ పెట్టారు. ఈ కార్యక్రమం నిర్వహిస్తూ క్రమంగా రాఘవరావు "రేడియో అన్నయ్య" గా పేరొందారు. ప్రతి ఆదివారం "ఆటవిడుపు" అనే కార్యక్రమం ప్రారంభించి, తెలుగు బాల బాలికలను... రారండోయ్ రారండోయ్........ పిల్లల్లారా రారండోయ్ అంటూ పిలుపు నిచ్చారు. ఆయనకు చేదోడు వాదోడుగా ఆయన శ్రీమతి న్యాయపతి కామేశ్వరి అండగా నిలిచి ఆ కార్యక్రమాలను విజయవంతం చేసి "రేడియో అక్కయ్య" గా పేరొందారు. రేడియోలో పనిని వారు ఉద్యోగంగా కాకుండా ఒక ఉద్యమంగా భావించారు.

ఆటవిడుపు కార్యక్రమానికి శ్రోతల సంఖ్య విపరీతంగా పెరిగి పోయింది. దాంతోపాటే ఆ కార్యక్రమంలో పాల్గొనే పిల్లల సంఖ్యకూడా ఎక్కువ కావటంతో పది సంవత్సరాల లోపు పిల్లలకు శనివారం బాలానందం అనీ, పది సంవత్సరాలు పైబడిన వారికి ఇతర కార్యక్రమం పెట్టి బాలబాలికల సృజనాత్మక శక్తిని పెంపొందించే ప్రయత్నంలో రేడియో అన్నయ్య ఎంతో కృషి చేశారు. వారిని ఒడిలో కూర్చో పెట్టుకుని లాలించి, ముద్దాడి, ముద్దు ముద్దు పాటలు పాడిస్తూ, వారి పాట కనుగుణంగా నోటితో రకరకాల ధ్వనులను చేస్తూ మధ్య మధ్యలో అగ్గిపెట్టితో చిత్రవిచిత్ర ధ్వనులు చేస్తూ ఆ కార్యక్రమం వింటున్న వారికి గిలిగింతలు పెట్టే వారు. వాస్తవానికి ఆ కార్యక్రమం కోసం పిల్లలకన్నా పెద్దలే ఆతృతగా వేచి చూసేవారన్నది వాస్తవం.రేడియో అన్నయ్య సృష్టించిన పాత్రల్లో "మొద్దబ్బాయి, పొట్టిబావ, చిట్టిమరదలు, దొడ్డమ్మ" శ్రోతలను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆయన "బూరెల మూకుడు, కొంటె కిష్టయ్య, పిల్లలకే స్వరాజ్యం వస్తే, చీమ కథ, ఏనుగొచ్చిందేనుగు, బడి గంట, మడతకుర్చీ, రామూ సోమూ, పిల్లల దొంగ" ఇంకా అనేక హాస్య నాటికలు, గమ్మత్తు నాటికలు, చిట్టి నాటికలు దాదాపు పన్నెండు వందలకు పైగా రచించి వాటిని పిల్లలతో వేయించారు. దాదాపు పది చలన చిత్రాలలో కూడా పిల్లలచే వేషం వేయించారు. అనేక గ్రామఫోను రికార్డులు ఇచ్చి పిల్లల బంగారు భవిష్యత్తుకు ఎవరూ, ఏ సంస్థా , ఏ ప్రభుత్వమూ చేయనంత కృషి సలిపారు. 1940లో మద్రాసులో ఆంధ్ర బాలానంద సంఘం స్థాపించారు.రేడియో కార్యక్రమాల అనంతరం అన్నయ్య చేపట్టిన మరో బృహత్కార్యం బాలల కోసం "బాల" పత్రిక ను ప్రచురించడం. అంతవరకూ పిల్లల కంటూ ఒక పత్రిక లేదు. "బాలకేసరి" అనే పత్రిక కొంతకాలం వచ్చినా అది వెంటనే ఆగిపోయింది. రేడియో అన్నయ్య పిల్లల పత్రిక అవసరం గుర్తించి 1945లో బాల పత్రిక స్థాపించి బాల సాహిత్యంలో అనేక ప్రయోగాలు చేశారు. అది అపారమైన ప్రభావాన్ని చూపింది.రేడియో అన్నయ్య స్థాపించిన "ఆంధ్ర బాలానంద సంఘం" విజయభేరి మ్రోగించింది. 1956లో హైదరాబాదు లో బ్రాంచి కూడా వెలిసింది. అనంతరం ఈ విజయం గ్రహించి బాలబాలికల పత్రికల సంఘాల అవశ్యకతను గుర్తించి అనేక బాలానంద సంఘాలు ఏర్పడ్డాయి. బాలపత్రికలు ఎన్నో వెలిశాయి. జవహర్ బాలభవన్ (1966), ఆంధ్రప్రదేశ్ బాలల అకాడమీ (1976) స్థాపనకు ఆయన విశేషమైన కృషి చేశారు. ఆ సంఘంలో అనేక చక్కని కార్యక్రమాలు ఇప్పటికీ జరుగుతున్నాయి. సంగీతం , నాట్యం, నాటకం, మేజిక్. హిప్నాటిజం రంగాల్లో కూడా శిక్షణనిస్తూ అదొక బాలల దైవ మందిరంగా అలరారుతోంది.బాలబాలికల ప్రగతికై పాటుబడిన న్యాయపతి రాఘవరావుకు సంతానంలేదు. రేడియో అన్నయ్య , అక్కయ్యల కున్న లక్షల ఆస్తిని ఆంధ్ర బాలబాలికలకే ధారాదత్తం చేసిన త్యాగ ధనులు. బాలబాలికల ఆటపాటలకు, వారిలో నిక్షిప్తమై ఉన్న సహజమైన కళాకౌశలానికి ప్రోత్సాహం అందించే వేదిక కోసం ప్రభుత్వంచే బాలల అకాడమీ స్థాపింప చేసి, ఆయన ఆశయాన్ని సాకారం రేడియో అన్నయ్య ధన్యులు.బాలానందం రేడియో అన్నయ్య 1984 ఫిబ్రవరి 24న పరమపదించారు. రేడియో అన్నయ్య శత జయంతి సందర్బంగా తపాలా శాఖా ఒక ప్రత్యేక కవరు విడుదల చేసింది.

# మెక్సికో డ్రగ్ కింగ్‌పిన్ 'ఎల్ మెంచో' ఖతం: రగులుతున్న దేశం.. ఎటుచూసినా హింసాకాండ!

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన డ్రగ్ కింగ్‌పిన్‌లలో ఒకడైన 'ఎల్ మెంచో' (నెమెసియో రూబెన్ ఒసెగ్వేరా సెర్వంటెస్) హతమయ్యాడు. మెక్సికో సైన్యం చేపట్టిన భారీ ఆపరేషన్‌లో తీవ్రంగా గాయపడిన అతడు ఆసుపత్రికి తరలిస్తుండగా మరణించినట్లు మెక్సికో రక్షణ మంత్రిత్వ శాఖ అధికారికంగా ప్రకటించింది. ఈ వార్త తెలియగానే అతడి అనుచరులు దేశవ్యాప్తంగా హింసాకాండకు దిగడంతో పలు నగరాలు అల్లకల్లోలంగా మారాయి.ఎల్ మెంచో నాయకత్వం వహిస్తున్న జాలిస్కో న్యూ జనరేషన్ కార్టెల్ సభ్యులు జాలిస్కో, గ్వాడలజారా వంటి ప్రధాన నగరాల్లో విధ్వంసం సృష్టిస్తున్నారు. హైవేలపై వాహనాలకు నిప్పుపెడుతూ, రోడ్లను దిగ్బంధిస్తూ భయాందోళనలు కలిగిస్తున్నారు. దీంతో అధికారులు 'కోడ్ రెడ్' ప్రకటించి, ప్రజలు ఇళ్లకే పరిమితం కావాలని సూచించారు. విమానాశ్రయాల్లో ప్రయాణికులు భయంతో పరుగులు తీస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.అమెరికాలోకి టన్నుల కొద్దీ ఫెంటానిల్, కొకైన్ వంటి మాదకద్రవ్యాలను సరఫరా చేస్తున్న ఎల్ మెంచో అమెరికాకి పెద్ద తలనొప్పిగా మారాడు. అందుకే, అతడి ఆచూకీ తెలిపిన వారికి అమెరికా ప్రభుత్వం 15 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 125 కోట్లు) భారీ రివార్డును ప్రకటించింది.మెక్సికోలో పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో అమెరికా, కెనడా తమ పౌరులకు కీలక హెచ్చరికలు జారీ చేశాయి. సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలని సూచించాయి. ఎయిర్ కెనడా వంటి సంస్థలు ప్యూర్టో వల్లార్టాకు తమ విమాన సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించాయి. ఎల్ మెంచో మరణంతో డ్రగ్ వార్ మరింత తీవ్రం కావచ్చని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మెక్సికో ప్రభుత్వం హింస ప్రభావిత ప్రాంతాలకు అదనపు బలగాలను తరలిస్తోంది.

## ట్రేడ్ డీల్ వాయిదా
## భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై పునరాలోచన
## యూఎస్ సుప్రీంకోర్టు తీర్పుతో అనిశ్చితి



న్యూఢిల్లీ : భారతదేశం-అమెరికా మధ్య తాత్కాలిక వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయడానికి ఫిబ్రవరి 23న వాషింగ్టన్‌లో ప్రారంభం కావాల్సిన చర్చలు వాయిదా పడ్డాయి. ఒప్పందంలో భాగంగా జరగాల్సిన ప్రధాన సంధానకర్తల కీలకమైన సమావేశం సోమవారం ప్రారంభం కావాల్సి ఉంది. ట్రంప్‌నకు వ్యతిరేకంగా అమెరికా సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు, తర్వాత ప్రకటించిన కొత్త పన్ను విధానాలు అనిశ్చితిని పెంచాయి. దీంతో సమావేశం వాయిదా పడింది. దర్పన్ జైన్ నేతృత్వంలోని భారత ప్రతినిధి బృందం, అమెరికా వాణిజ్య ప్రతినిధి జామిసన్ గ్రీర్, అతని బృందం సమావేశం కావాల్సి ఉంది. ఫిబ్రవరి 20న, ట్రంప్ పరిపాలన విధించిన దిగుమతి పన్నులు రాజ్యాంగ విరుద్ధమని అమెరికా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది.దీని తర్వాత, ఫిబ్రవరి 24 నుంచి అన్ని దేశాలపై కొత్తగా 10 శాతం పన్ను విధిస్తామని ట్రంప్ ప్రకటించారు. మరుసటి రోజు దాన్ని 15 శాతానికి పెంచుతున్నట్టు ప్రకటించారు. ఈ కొత్త పరిస్థితులు ఆర్థిక వ్యవస్థను ఎలా ప్రభావితం చేస్తాయో అస్పష్టంగా ఉంది. విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న వస్తువులపై విస్తృత సుంకాలు విధించే అధికారాన్ని అమెరికా సుప్రీంకోర్టు కొట్టివేసినప్పటికీ, భారతదేశంతో వాణిజ్య ఒప్పందంలో మార్పు ఉండదని ట్రంప్ వెల్లడించారు. ఒప్పందం ప్రకారం భారతదేశం నుంచి వచ్చే వస్తువులపై విధించిన 18 శాతం సుంకం కొనసాగుతుందని కూడా ఆయన పునరుద్ఘాటించారు.

## క్రెడిట్ కార్డు యూజర్లకు అలర్ట్
## గడువు కంటే ముందే బిల్లు చెల్లిస్తే లాభమా? నష్టమా?




ఈ రోజుల్లో క్రెడిట్ కార్డులు దాదాపు ప్రతి ఒక్కరు వాడుతున్నారు. కానీ నెలవారీ బిల్లు జనరేట్ అయిన వెంటనే, ఒక పెద్ద ప్రశ్న తలెత్తుతుంది. స్టేట్‌మెంట్ అందిన వెంటనే బిల్లు చెల్లించాలా, లేదా గడువు తేదీ వరకు వేచి ఉండటం మంచిదా?బిల్లు చెల్లింపు సమయం మీ క్రెడిట్ స్కోర్‌ను నేరుగా ప్రభావితం చేస్తుంది కాబట్టి ఈ గందరగోళం తరచుగా వినియోగదారులలో కొనసాగుతుంది. ఈ విషయంలో సరైన దశలను, అది మీ ఆర్థిక జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో చూద్దాం..మీ ఇమెయిల్ లేదా ఫోన్‌లో క్రెడిట్ కార్డ్ స్టేట్‌మెంట్ సందేశం వచ్చినప్పుడు, చాలా మంది గడువు తేదీ వరకు వేచి ఉంటే వారి ఐదీఖ్న స్కోరు పడిపోతుందేమో అని ఆందోళన చెందుతారు. వాస్తవం ఏమిటంటే మీరు స్టేట్‌మెంట్ వచ్చిన వెంటనే చెల్లించాలా లేదా గడువు తేదీలోపు మీ బిల్లును చెల్లించడానికి గ్రేస్ పీరియడ్‌ని ఉపయోగించాలా అనేది మీ క్రెడిట్ స్కోరుకు పట్టింపు లేదు. మీ చెల్లింపు బ్యాంకు నిర్దేశించిన గడువులోపు జరిగితే, మీ ఆర్థిక రికార్డు పూర్తిగా సురక్షితంగా ఉంటుంది. మీ ఆర్థిక సౌలభ్యం, నగదు లభ్యతను బట్టి మీరు ఏదైనా ఎంపికను ఎంచుకోవచ్చు.గడువు తేదీ వరకు వేచి ఉండటంలో తప్పు లేదు, కానీ నిర్లక్ష్యం కారణంగా ఈ గడువు దాటితే, మీకు నిజమైన ఇబ్బంది మొదలవుతుంది. బ్యాంకు గడువు తర్వాత చెల్లింపు చేయడం ఆలస్య చెల్లింపుగా పరిగణించబడుతుంది. ఇది మీ మొత్తం క్రెడిట్ చరిత్రను తీవ్రంగా దెబ్బతీసే తీవ్రమైన తప్పు. మీ ఐదీఖ్న స్కోరు దెబ్బతిన్న తర్వాత, భవిష్యత్తులో గృహ రుణం, కారు రుణం లేదా కొత్త కార్డు పొందడం చాలా కష్టం అవుతుంది. అందువల్ల, బిల్లులను సకాలంలో చెల్లించడం ఆర్థిక ప్రాధాన్యతగా చేసుకోవడం చాలా ముఖ్యం.క్రెడిట్ కార్డ్ బిల్లింగ్ స్టేట్‌మెంట్‌లలో ఎల్లప్పుడూ రెండు రకాల మొత్తాలు కనిపిస్తాయి. మొత్తం బకాయి, కనీస బకాయి. కనీస మొత్తాన్ని లేదా కనీస బకాయిని చెల్లించడం వల్ల బ్యాంకు జరిమానాలను నివారించవచ్చని, వారి శ్రేయస్సును నిర్ధారిస్తుందని ప్రజలు తరచుగా అనుకుంటారు. అయితే ఆర్థిక దృక్కోణం నుండి, ఇది ఒక పెద్ద ఉచ్చు అని నిరూపించబడింది. మిగిలిన మొత్తం అంటే కనీస మొత్తం, వచ్చే నెలకు ముందుకు తీసుకెళ్లబడుతుంది. బ్యాంకులు దానిపై గణనీయమైన వడ్డీని వసూలు చేస్తాయి. ఈ అలవాటు క్రమంగా గణనీయమైన అప్పుకు దారితీస్తుంది. మీ క్రెడిట్ స్కోర్‌పై దాని ప్రతికూల ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. ఎల్లప్పుడూ పూర్తి బిల్లును చెల్లించండి.

## భారీగా పతనమైన ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ షేర్లు

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ షేర్లు నాటి ట్రేడింగ్ ఆరంభం నుంచి భారీగా పతనం అవుతున్నాయి. ఒకానొక దశలో దాదాపు 20%శాతం పతనమయ్యాయి. ఆ తర్వాత కొద్దిగా కోలుకొన్నా.. భారీ నష్టాల్లోనే కొనసాగుతున్నాయి. తమ బ్యాంక్ చండీగఢ్ బ్రాంచిలో రూ.590 కోట్ల మేరకు కుంభకోణం జరిగినట్లు అనుమానిస్తున్నామని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ప్రకటించింది. గవర్నమెంట్ ఖాతాల నిర్వహణలో ఈ మోసం జరిగినట్లు భావిస్తున్నారు. ఫలితంగా ఇన్వెస్టర్లలో ఆందోళన తీవ్రమైంది. దీంతో నేడు ట్రేడింగ్ మొదలైన వెంటనే ఈ షేర్లు లోయర్ సర్క్యూట్‌ను తాకాయి. ఇక ఉదయం 11.08 సమయంలో 15.28శాతం నష్టంతో రూ.70.75 వద్ద ట్రేడవుతున్నాయి.హరియాణా ప్రభుత్వ విభాగం ఒకటి ఈ బ్యాంకులో తమ ఖాతాను క్లోజ్ చేసి నిధులను బదిలీచేయమని కోరగా ఈ కుంభకోణం వ్యవహారం వెలుగులోకి వచ్చింది. సదరు విభాగ పుస్తకాల్లో నగదు.. బ్యాంక్‌ఖాతాలో మొత్తానికి సరిపోలకపోవడంతో అనుమానాలు మొదలయ్యాయి. దీంతో హరియాణా ప్రభుత్వంలోని పలు శాఖలు తమ ఖాతాలను సరిచూసుకోవడం మొదలుపెట్టాయి. అయితే చండీగఢ్ శాఖలోని ఖాతాల్లోనే ఈ సమస్య ఉన్నట్లు తెలుస్తోంది.

## ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో రూ.590 కోట్ల మోసం

ముంబయి: హరియాణా ప్రభుత్వం నిర్వహిస్తున్న ఖాతాల్లో తమ ఉద్యోగులు, ఇతరులు చేసిన రూ.590 కోట్ల మోసాన్ని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ఆదివారం వెల్లడించింది. బ్యాంకింగ్ నియంత్రణ సంస్థ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ఈ విషయాన్ని వెల్లడించడంతో పాటు పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారమిచ్చింది. చండీగఢ్‌లోని ఒక శాఖలో కొంతమంది ఉద్యోగులు హరియాణా రాష్ట్ర ప్రభుత్వ ఖాతాల్లో ప్రాథమికంగా అనధికారిక, మోసపూరిత కార్యకలాపాలు నిర్వహించినట్లు గుర్తించినట్లు ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ పేర్కొంది. ఇతర వ్యక్తులు/సంస్థలు/కౌంటర్‌పార్టీలు కూడా ఇందులో భాగమయ్యే అవకాశం ఉందని తెలిపింది. ప్రస్తుతం మోసం విలువను రూ.590 కోట్లుగా అంచనా వేసింది.తదుపరి సమాచారం, క్లెయిమ్‌ల ధ్రువీకరణ, రికవరీల ఆధారంగా తుది మొత్తాన్ని నిర్ణయిస్తామని వివరించింది. హరియాణా ప్రభుత్వ విభాగం ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌తో బ్యాంకింగ్ లావాదేవీలు నిర్వహిస్తోందని.. రుణదాతకు వెల్లడించని తేదీన క్లోజర్, బ్యాలెన్స్ బదిలీ కోసం మరొక బ్యాంకుకు అభ్యర్థన అందిందని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ తెలిపింది. ఈ ప్రక్రియలో ఖాతాలోని బ్యాలెన్స్‌తో పోలిస్తే, పేర్కొన్న మొత్తంలో వ్యత్యాసం కనిపించింది. అలాగే ఈ నెల 18 నుంచి హరియాణా ప్రభుత్వ సంస్థల ఇతర ఖాతాల్లో కూడా ఇలాంటి సమస్యలు గమనించినట్లు వివరించింది.

# మోడీమార్క్..ధరాభారం

**జీఎస్టీ శ్లాబుల కుదింపు ఉత్తిదే**
**ముడిసరుకుల ధరలకు రెక్కలు**
**రేట్లు పెంచకతప్పదంటున్న ఎఫ్ఎమ్‌సీజీ సంస్థలు**
**శ్లాబుల కుదింపు తర్వాత ఇప్పటికే 35 శాతం పెరిగిన ధరలు**
**సామాన్యులపై ఆర్థిక పిడుగు**
**కుడిచేత్తో ఇచ్చి... ఎడమచేత్తో లాక్కుంటున్న కేంద్రం**

**ఎస్ఎస్ఆర్ శాస్త్రి**




కుడిచేత్తో ఇచ్చి ఎడమచేత్తో లాక్కోవడం ప్రధాని నరేంద్రమోడీకి వెన్నతోపెట్టిన విద్య! వస్తు సేవల పన్ను (జీఎస్టీ) శ్లాబుల్ని కుదించి, ప్రజలకు అవసరమైన వస్తువుల ధరలు గణనీయంగా తగ్గించేశామని ప్రచారం చేసుకున్నారు. ఈ మేరకు అనేక ఫాస్ట్ మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్ (ఎఫ్ఎమ్‌సీజీ) సంస్థలు ప్రధాని నరేంద్రమోడీ పెద్దసైజు ఫోటోలు పత్రికల్లో ప్రచురించి, తమ ఉత్పత్తుల రేట్లు తగ్గిస్తున్నామని అర్భాటంగా ప్రచారం చేసిన విషయం తెలిసిందే. 2025 సెప్టెంబర్ 22 నుంచి సవరించిన జీఎస్టీ శ్లాబులు అమల్లోకి వచ్చాయి. నవంబర్ వరకు కొన్ని వస్తువుల ధరలు తగ్గాయి. వాటిని చూపే ఎఫ్ఎమ్‌సీజీలు ప్రధాని మోడీకి ప్రచారాన్ని కల్పించాయి. కానీ డిసెంబర్ నుంచి సీన్ మారింది. క్రమంగా ఒక్కో వస్తువు ధర పెరగడం ప్రారంభమైంది. జీఎస్టీ శ్లాబుల్ని కుదించిన కేంద్ర ప్రభుత్వం డాలర్‌తో రూపాయి మారకాన్ని బలపర్చలేకపోయింది. ఫలితంగా రూపాయి విలువ రోజురోజుకూ పతనం అయ్యి, ప్రస్తుతం ఒక డాలర్‌తో రూపాయి మారకం రూ.93కి పడిపోయింది.ఫలితంగా దిగుమతి వస్తువులతో పాటు, స్వదేశంలో ముడిసరుకుల ధరలు పెరిగాయి. దీనితో ఎఫ్ఎమ్‌సీజీలు తమ ఉత్పత్తుల ధరల్ని ఇప్పటికే గణనీయంగా పెంచేశాయి. మరోసారి 5 నుంచి 10 శాతం వరకు పెంచుతామని ప్రకటించాయి. మరి ప్రధాని మోడీ చేసిన జీఎస్టీ శ్లాబుల కుదింపు ప్రయోజనాలు సామాన్యులకు చేరినట్టా... లేదా...అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ప్రధాని మోడీ జీఎస్టీ శ్లాబుల్ని కుదించి, రూపాయి పతనాన్ని నిలువరించలేకపోవడంతో మళ్లీ సామాన్యులపై ధరల భారం తప్పట్లేదు. విచిత్రంగా గత జీఎస్టీ శ్లాబులకంటే, ఇప్పుడు ధరలు ఎక్కువగా పెరుగుతున్నాయి. జీఎస్టీ శ్లాబుల కుదింపునకు ముందు, ప్రస్తుత మార్కెట్ ధరలు, ఎఫ్ఎమ్‌సీజీలు పెంచాలని భావిస్తున్న ధరలతో పోలిస్తే వినియోగదారులపై అతి భారీగా ఆర్థికభారం పడబోతోంది.

ఎఫ్ఎమ్‌సీజీల వాదననిత్యావసర వస్తువుల ధరల పెంపు తప్పదని ఎఫ్ఎమ్‌సీజీ సంస్థలు స్పష్టంచేస్తున్నాయి. ఆ మేరకు ఇప్పటికే దేశవ్యాప్తంగా నిత్యావసర వినియోగ వస్తువుల (ఎఫ్ఎమ్‌సీజీ) ధరల పెంపుపై ప్రధాన కంపెనీలు, పరిశ్రమలు సంకేతాలు ఇచ్చాయి. కనీసం 5 నుంచి 10 శాతం వస్తువుల ధరల్ని పెంచుతామని చెప్తున్నాయి. ముడి సరుకు ధరల పెరుగుదల, రవాణా వ్యయాల భారంతో పాటు రూపాయి మారకం విలువలో మార్పులు వంటి కారణాలతో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని చెప్తున్నాయి.ఇవీ కారణాలుఎఫ్ఎమ్‌సీజీ సంస్థలు ధరలు పెంచేందుకు పలు కారణాలను చూపుతున్నాయి. ప్రధానంగా పామ్‌ఆయిల్, ప్యాకేజింగ్ ప్లాస్టిక్, పేపర్, గోధుమలు, చక్కెర వంటి ముడి సరుకుల ధరలు పెరిగాయి. ముఖ్యంగా ఎడిబుల్ ఆయిల్స్ (వంటనూనెలు), పాలు, ధాన్యాల ధరల మార్పు కంపెనీలపై ఒత్తిడిని పెంచిందని చెప్తున్నాయి. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ సహా అన్నింటి ధరలు పెరిగాయి. ఫలితంగా రవాణా చార్జీలు పెరిగాయి. గ్రామీణ మార్కెట్లకు సరకు సరఫరా ఖర్చు పెరిగింది. ప్లాస్టిక్, కార్టన్, అల్యూమినియం ఫాయిల్ ధరలు పెరగడంతో ప్యాకేజింగ్ వ్యయం 8 నుంచి 12 శాతం వరకు పెరిగిందని గణాంకాలు చెప్తున్నాయి.ప్రధానంగా దిగుమతి ముడి సరుకులపై ఆధారపడే కంపెనీలకు డాలర్ పెరగడం వల్ల అదనపు ఖర్చు పెరిగింది. కేంద్రంలోని మోడీ ప్రభుత్వ ఆర్థిక విధానాల వల్ల దేశంలోకి దిగుమతులు గణనీయంగా పెరిగాయి. ఆ స్థాయిలో ఎగుమతులు లేకపోవడం గమనార్హం. సహజంగా దిగుమతులు రూపాయిల్లో ఉంటే, చెల్లింపులు డాలర్లలో చేయాలి. ప్రస్తుతం డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ దాదాపు రూ.93 గా ఉంది. అలాగే కార్మికుల వేతనాలు, గిడ్డం గి నిర్వహణ వ్యయాలు కూడా పెరిగాయని ఎమ్ఎమ్‌సీజీలు చెప్తున్నాయి. దీన్ని నియంత్రించకుంటే సామాన్యుల బడ్జెట్ చితికిపోవడం ఖాయంగా కనిపిస్తున్నది.

పెరిగేది ఇలా..పరిశ్రమ అంచనాల ప్రకారం సబ్బులు, షాంపూల ధరలు 5 నుంచి 8 శాతం పెరుగుతాయి. ప్యాకేజ్డ్ ఫుడ్, బిస్కెట్లు 6 నుంచి 10 శాతం, వంటనూనెలు, మసాలా ఉత్పత్తులు 8 నుంచి 15 శాతం, డిటర్జెంట్లు, క్లీనింగ్ ఉత్పత్తులు 4 నుంచి 7 శాతం చొప్పున పెరుగుతాయని మార్కెట్ విశ్లేషకులు చెప్తున్నారు. జీఎస్టీ శ్లాబుల కుదింపునకు ముందు, ప్రస్తుత ధరలు, పెరిగే ధరలతో పోలిస్తే అనేక వస్తువుల ధరలు 40 నుంచి 50 శాతం వరకు పెరిగాయి.

# సాంకేతిక ప్రగతి వెనుక పొంచి ఉన్న నీటి గండం!

**డేటా సెంటర్ల దాహార్తి**
**ఏడాదిలో గూగుల్ ఆవిరి చేసిన మంచినీరు 6.1 మిలియన్ గ్యాలన్లు**
**కరువు ప్రాంతాల్లో పెనుముప్పు**
**పర్యావరణం పైనా తీవ్ర ప్రభావం**



న్యూఢిల్లీ : కృత్రిమ మేధ...అదే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్. ఇప్పుడు ఎవరి నోట విన్నా వినిపిస్తున్న పేరు. ఇప్పటికే అనేక ఐటీ కంపెనీలు ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటున్నాయి. దీనిపై ప్రపంచవ్యాప్తంగా అనేక సదస్సులు, సమావేశాలు జరుగుతున్నాయి. మూడు రోజుల క్రితం దేశ రాజధాని ఢిల్లీలోనూ దీనిపై అంతర్జాతీయ సదస్సును నిర్వహించారు. దీనికి ప్రధాని నరేంద్రమోడీ సహా తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో పాటు పలు రాష్ట్రాల ప్రతినిధులు హాజరయ్యారు.

పలు దేశాలకు చెందిన ఏఐ సంస్థల అధినేతలు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థల మధ్య వేలకోట్ల రూపాయలు విలువైన ఒప్పందాలు జరిగాయి. ఇదంతా నాణేనికి ఓ వైపు.మరోవైపు ఏఐ చేస్తున్న పర్యావరణ విధ్యంసం ప్రపంచానికి ఆందోళన కలిగిస్తుంది. భారీగా ఏర్పాటు చేసే ఏఐ డేటా సర్వర్లు శీతల వాతావరణంలోనే పనిచేస్తాయి. వాటిని చల్లబర్చేందుకు బిలియన్ల కొద్దీ గ్యాలన్ల తాజా నీటిని వినియోగిస్తారు. దీనివల్ల మానవాళికి తాగునీటి సమస్య తీవ్రమయ్యే ప్రమాదం పొంచి ఉందని ఐటీరంగ నిపుణులు చెప్తున్నారు. కరువు కాటకాలతో విలవిలల్లాడే ప్రాంతాల్లో ఏఐ సర్వర్లను ఏర్పాటు చేస్తే, అక్కడి ప్రజలకు మరిన్ని నీటి కష్టాలు తప్పవని హెచ్చరిస్తున్నారు.చల్లదనం ఎందుకు?డేటా సెంటర్లకు చల్లదనం అవస రాన్ని సాంకేతిక నిపుణులు చక్కగా విశ్లేషించారు. కంప్యూటర్లు తీవ్రమైన వేడిని ఉత్పత్తి చేస్తాయి. మీరు ఏఐని ఒక కవిత రాయమనో లేదా ఓ చిత్రాన్ని గీయమనో అడిగితే ఒకేసారి వేలాది ప్రాసెసర్లు పనిచేయాల్సి ఉంటుంది. ఫలితంగా తీవ్రమైన థర్మల్ ఎనర్జీ వెలువడుతుంది. ఆ వేడికి కోట్లాది రూపాయలు ఖరీదు చేసే యంత్రాలు కరిగిపోయే ప్రమాదం ఉంది. దానిని నివారించేందుకే డేటా కేంద్రాలు కూలింగ్ టవర్లను ఉపయోగిస్తాయి. ఈ వ్యవస్థలు ఆవిరైపోయే చల్లదనం ద్వారా పనిచేస్తాయి. వేడిగా ఉన్న ఉపరితలాలపై నీటిని వెదజల్లడం ద్వారా వాతావరణాన్ని చల్లబరుస్తారు. ఈ నీటిలో 80 శాతం ఆవిరి రూపంలో వాతావరణంలో కలిసి పోతుంది. ఆవిరిని రీసైక్లింగ్ చేయలేము కాబట్టి అది స్థానిక నీటి చక్రం నుంచి అదృశ్యమైపోతుంది. అంటే దీనర్థం ఏమిటి? ప్రతి రోజూ మిలియన్ గ్యాలర్ల నీరు ఆవిరైపోతుంది కానీ అందులో ఒక్క చుక్క కూడా తిరిగి ఉపయోగపడదు.రీసైక్లింగ్ నీరు వాడితే...టెక్ కంపెనీలు రీసైక్లింగ్ నీరును లేదా కాలుష్య కారక వ్యర్థ జలాలను ఉపయోగించుకోవచ్చు కదా అనే ప్రశ్న సహజం. కానీ నీటిలో సహజంగానే కాల్షియం, మెగ్నీషియం వంటి ఖనిజాలు ఉంటాయి. శీతలీకరణ ప్రక్రియ ద్వారా నీరు ఆవిరై పోతుంది. అంటే ఈ ఖనిజాలు మరింతగా కేంద్రీకృతమవుతాయన్న మాట. చివరికి అవి లైమ్‌స్కేల్ (గట్టి సున్నపు నిక్షేపం. ఇది తరచుగా వేడి నీటి కోసం ఉపయోగించే బాయిలర్లు, పైపుల లోపల పేరుకుపోతుంది) అనే గట్టి పెంకును ఏర్పరుస్తాయి. ఇది చాలా హానికరమైనది.మందపాటి దుప్పటి మాదిరిగా పనిచేస్తూ వేడిని బంధిస్తుంది. పంపులలో ప్రవాహాన్ని అడ్డుకుంటుంది. రీసైకిల్ చేసిన నీటిలోని ఖనిజాలు ఏఐ డేటా సెంటర్లలోని ఉష్ణ వినిమయాలను నష్టపరుస్తుంది. రీసైకిల్ చేసిన నీటిలో సహజంగానే ఖనిజాలు అధికంగా ఉంటాయి. కాబట్టి అది మొదటి నుంచే తన ప్రభావాన్ని చూపుతుంది. ఆ నీటిని సురక్షితంగా ఉపయోగించాలంటే కంపెనీలు పెద్ద ఎత్తున ఆన్-సైట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను నిర్మించాల్సి ఉంటుంది. ప్రస్తుతం అమెరికాలో ఒక శాతం కంటే తక్కువ నీరే రీసైక్లింగ్ అవుతోంది. రీసైక్లింగ్ అయిన నీటిని పారిశ్రామిక ప్రాంతాలకు అందించే మౌలిక సదుపాయాలు కూడా అనేక నగరాలలో లేవు. కాబట్టి రీసైక్లింగ్ నీటితో పోలిస్తే డేటా సెంటర్లకు మంచి నీరే చౌకగా లభిస్తోంది.చల్లదనం ఉంటేనే పనిచేస్తాయిడిజిటల్ ప్రపంచం ఎలాంటి ఆటంకాలు లేకుండా ఎందుకు సజావుగా నడుస్తోందో ఎప్పుడైనా ఆలోచించారా? భారీ గిడ్డంగులలో నిరంతరం పని చేసుకుంటూపోతున్న సర్వర్లే దీనికి కారణం. అయితే అలా పనిచేస్తూ పోవాలంటే చల్లదనం అవసరం. గూగుల్ కంపెనీకి చెందిన డేటా సెంటర్లు ఒక సంవత్సర కాలంలో 6.1 బిలియన్ గ్యాలన్ల తాజా నీటిని వినియోగించుకున్నాయని ఆ సంస్థకు చెందిన పర్యావరణ నివేదిక (2024) తెలిపింది. నీటి వినియోగం యదార్థమేనని ఆ టెక్ దిగ్గజ సంస్థ అంగీకరించింది. 2014తో పోల్చినప్పుడు గూగుల్ డేటా సెంటర్లు 2023లో వాడుకున్న నీటి వినియోగం 17 శాతం పెరిగింది. అదే సమయంలో విద్యుత్ వినియోగం కూడా పెరిగిందని ఆ నివేదిక తెలియజేసింది.

సముద్రంలో నీటి చుక్క కాదుఈ నీటి వినియోగాన్ని కేవలం సముద్రంలో ఓ నీటి చుక్కగా చూడకూడదు. అమెరికా నైరుతి ప్రాంతంలో ఉన్న 41 గోల్ఫ్ కోర్సులకు నీటి పారుదల సౌకర్యం కల్పించేందుకు ఏటా ఎంత నీరు అవసరం అవుతుందో ఆ పరిమాణంలో నీటిని గూగుల్ డేటా సెంటర్లు వాడుకుంటున్నాయి. కృత్రిమ మేధ దిశగా సాంకేతిక పరిజ్ఞానం పరివర్తన చెందుతున్న తరుణంలో సర్వర్ల నీటి 'దాహాన్ని' తీర్చడం నానాటికీ కష్టమవుతోంది.పర్యావరణంపై ప్రభావంకృత్రిమ మేధ సాంకేతిక పరిజ్ఞానం కోసం డేటా సెంటర్లు మంచి నీటిని అధిక పరిమాణంలో వినియోగించడం పర్యావరణవేత్తలను ఆందోళనకు గురిచేస్తోంది. మోర్గాన్ స్టాన్లే నివేదిక ప్రకారం ఏఐ డేటా సెంటర్ల నీటి వినియోగం 2028 నాటికి 11 రెట్లు పెరుగుతుంది. ఇక్కడ గమనించాల్సిన ముఖ్య విషయమేమంటే నీటి కొరతతో ఇబ్బంది పడుతున్న ప్రాంతాల్లోనే డేటా సెంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఏఐ సర్వర్లను చల్లగా ఉంచడం కోసం మంచి నీటికి పెరుగుతున్న డిమాండ్ కరువు పీడిత ప్రాంతాలలో నీటి సరఫరాకు ముప్పును కలిగిస్తోంది. కృత్రిమ మేధ మన జీవితాలతో పెనవేసుకుపోతున్న కొద్దీ మనకు అత్యంత విలువైన సహజ వనరులపై ఒత్తిడి మరింత తీవ్రమవుతోంది.

# పెంపుడు పిల్లుల నుంచి పాఠాలు నేర్చుకున్నా..!

ఆమె వెండితెరపై నటిస్తుంటే ప్రేక్షకులు మంత్రముగ్ధులవుతారు. కెరీర్ పరంగా ఎన్నో శిఖరాలను అందుకున్న ఈ ముద్దుగుమ్మ, వ్యక్తిగత జీవితంలో మాత్రం చాలా సాదాసీదాగా ఉండటానికే ఇష్టపడుతుంది. తన ఇంట్లో ఉండే పెంపుడు పిల్లులే తనకు గురువులని, అవి నేర్పిన పాఠాలే తనను ఈరోజు ప్రశాంతంగా ఉంచుతున్నాయని ఆమె చెబుతోంది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో తన చిన్ననాటి వెర్షన్‌కు రాసిన ఒక ప్రేమలేఖ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది. స్కూల్ రోజుల్లో ఒక అబ్బాయి కోసం తాను చేసిన పనిని గుర్తు చేసుకుంటూ, తన భర్త గురించి ముందే ఊహించిన ఆ హీరోయిన్ మరెవరో కాదు.. బాలీవుడ్ బ్యూటీ అలియా భట్. ఆమె పంచుకున్న ఆ ఎమోషనల్ అండ్ ఫన్నీ విషయాలు ఏంటో తెలుసుకుందాం..

పిల్లులే నా గురువులు.. అలియా భట్‌కు జంతువులంటే ఎంత ప్రేమో అందరికీ తెలిసిందే. తన ఇంట్లో ఉండే ఎడ్వర్డ్, జునిపెర్ అనే పిల్లులతో ఆమె తరచుగా సమయాన్ని గడుపుతూ ఉంటుంది. తాజాగా ఎస్క్వైర్ ఇండియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన పిల్లుల నుంచి నేర్చుకున్న పాఠాలను వివరించింది. "మిమ్మల్ని మీరు మరీ సీరియస్‌గా తీసుకోవద్దు. ఎవరి నుంచి ఎలాంటి అంచనాలు పెట్టుకోకండి. మీరు ఎంత తక్కువగా ఆశిస్తే, జీవితంలో అంత తక్కువ నిరాశ చెందుతారు. ప్రశాంతంగా నిద్రపోండి.. అప్పుడే జీవితం బాగుంటుంది" అని అలియా చెప్పుకొచ్చింది. జంతువుల నుంచి నేర్చుకున్న ఈ సరళమైన సూత్రాలే తన సక్సెస్‌కు కారణమని ఆమె నమ్ముతోంది.



అలియాకు ప్రేమలేఖ.. ఈ ఇంటర్వ్యూలో అలియా తన చిన్ననాటి వెర్షన్‌ను ఉద్దేశించి రాసిన ఒక లేఖ అందరినీ ఆకట్టుకుంది. అందులో తన చిన్నప్పటి కలలను వదులుకోవద్దని కోరింది. "చిన్నారి అలియా.. నువ్వు ఎప్పుడూ కలలు కంటూనే ఉంటావని నాకు తెలుసు. దయచేసి కలలు కనడం ఆపకు. నీలో ఉన్న ఆ కలలే నీ అతిపెద్ద శక్తి" అని పేర్కొంది. ఈ మాటలు ఆమె ఎంతటి పట్టుదలతో తన కెరీర్‌ను నిర్మించుకుందో తెలియజేస్తున్నాయి. తన టీనేజ్ రోజుల్లో జరిగిన ఒక చేదు జ్ఞాపకాన్ని అలియా సరదాగా గుర్తు చేసుకుంది. "హైస్కూల్‌లో ఆ మూర్ఖపు అబ్బాయి కోసం ఏడవద్దు. వాడు నీ కన్నీళ్లకు అస్సలు అర్హుడు కాదు. ఒక్క విషయం మాత్రం ప్రామిస్ చేస్తున్నాను.. ఒకరోజు నువ్వు ఈ ప్రపంచంలోనే అత్యుత్తమ అబ్బాయిని కలుస్తావు. అతను మరెవరో కాదు, నువ్వు రహస్యంగా ఇష్టపడే క్రష్ (రణబీర్ కపూర్)" అంటూ తన భర్త గురించి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. రణబీర్ పట్ల తనకున్న ప్రేమన అలియా ఈ విధంగా వ్యక్తం చేసింది. మాతృత్వం గురించి మాట్లాడుతూ అలియా ఎంతో ఎమోషనల్ అయ్యింది. తనకు అత్యంత అందమైన కూతురు పుడుతుందని, తన హృదయం ఊహించని విధంగా ప్రేమతో నిండిపోతుందని ఆమె ఆ లేఖలో రాసుకుంది. తన కూతురు రహా గురించి ఒక ప్లేఫుల్ నోట్ లో ఇలా చెప్పింది.. "ఆమె ఒక చిన్న లాయర్ లాగా వ్యవహరించబోతోంది, కాబట్టి నువ్వు ఇప్పుడే సిద్ధంగా ఉండు" అంటూ నవ్వుతూ ముగించింది. కూతురు తెలివితేటలను అలియా ఈ విధంగా ప్రశంసించింది. అలియా భట్ మాటలు వింటుంటే ఆమె ఎంతటి పరిణతి చెందిన వ్యక్తిగా మారిందో అర్థమవుతుంది. పెంపుడు జంతువుల నుంచి నేర్చుకున్న పాఠాలైనా, చిన్నప్పటి చేదు జ్ఞాపకాలను నెమరువేసుకోవడమైనా.. ఆమె నిజాయితీకి అందరూ ఫిదా అవుతున్నారు. మనిషిగా ఎదగాలంటే గతంలోని తప్పులను నవ్వుతూ అంగీకరించాలని అలియా నిరూపించింది.

# నిద్ర పోకపోతే ఏమవుతుంది..? ఈ వ్యాధులు రావడం పక్కా..

ఉరుకుల పరుగుల జీవితంలో మనకు తెలియకుండానే అత్యంత విలువైన నిద్రను కోల్పోతున్నాం. అరచేతిలో మొబైల్, మెదడు నిండా పని ఒత్తిడి.. వెరసి రాత్రిపూట కంటికి కునుకు లేకుండా చేస్తున్నాయి. అయితే నిద్రపోకపోవడం అంటే కేవలం అలసట మాత్రమే కాదు.. అది మీ శరీరాన్ని లోపల నుండి నెమ్మదిగా కాల్చేస్తున్న ఒక నిశ్శబ్ద విషం. నిద్ర సరిగ్గా లేకపోతే ఏ వ్యాధులు వస్తాయంటే.. నేటి ఆధునిక జీవనశైలిలో పని ఒత్తిడి.. మొబైల్ వ్యసనం మన కంటి నిద్రను దూరం చేస్తున్నాయి. రాత్రి ఆలస్యంగా పడుకోవడం, ఉదయాన్నే పరుగుల మీద లేవడం చాలామందికి అలవాటుగా మారింది. అయితే ఈ అసంపూర్ణ నిద్ర మీ శరీరాన్ని లోపల నుండి ఎలా దెబ్బతీస్తుందో తెలిస్తే షాక్ అవుతారు. నిద్రలేమి కేవలం అలసట మాత్రమే కాదు, అది అనేక దీర్ఘకాలిక వ్యాధులకు ఆహ్వానం పలుకుతోంది. ప్రధానంగా ఉదయం లేవగానే తీవ్రమైన నీరసం, రోజంతా చిరాకుగా ఉండటం, దృష్టి కేంద్రీకరించలేకపోవడం, కళ్లు మంటగా అనిపించడం, తల బరువుగా ఉండటం, చిన్న చిన్న విషయాలకే కోపం రావడం, మూడ్ స్వింగ్స్ వంటి లక్షణాలు ఉంటే ఒకవేళ మీరు ఈ సమస్యలు ఎదుర్కొంటుంటే మీ శరీరానికి తగినంత నిద్ర అందడం లేదని అర్థం..గుండె జబ్బుల ముప్పు: నిద్ర లేకపోవడం వల్ల శరీరంలో రక్తపోటు పెరుగుతుంది. ఇది క్రమంగా గుండెపోటు లేదా స్ట్రోక్ వంటి తీవ్రమైన సమస్యలకు దారితీస్తుంది. రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలు పెరగడానికి కూడా నిద్రలేమి ప్రధాన కారణం.శరీరంలో ఇన్సులిన్ పనితీరు నిద్రపై ఆధారపడి ఉంటుంది. తగినంత విశ్రాంతి లేకపోతే రక్తంలో చక్కెర స్థాయిలు అదుపు తప్పుతాయి. ఇది చివరకు డయాబెటిస్‌కు దారితీస్తుంది. మనం సరిగ్గా నిద్రపోనప్పుడు ఆకలిని ప్రేరేపించే హార్మోన్లు యాక్టివేట్ అవుతాయి. దీనివల్ల రాత్రిపూట ఎక్కువగా తినాలనిపించడం, జీవక్రియ మందగించడం



జరిగి ఊబకాయం బారిన పడతారు. నిద్ర లేకపోవడం మెదడులోని నరాల పనితీరును ప్రభావితం చేస్తుంది. ఇది తీవ్రమైన ఆందోళన, ఒత్తిడి, నిరాశ వంటి సమస్యలకు మూలకారణం అవుతుంది. శరీరం వ్యాధులతో పోరాడే సామర్థ్యాన్ని కోల్పోతుంది. దీనివల్ల తరచుగా జలుబు, దగ్గు, జ్వరం వంటి ఇన్ఫెక్షన్ల బారిన పడే ప్రమాదం ఉంది.ప్రతిరోజూ ఒకే సమయానికి పడుకోవడం, మేల్కొనడం అలవాటు చేసుకోండి.పడుకునే గంట ముందు మొబైల్, ల్యాప్‌టాప్ పక్కన పెట్టేయండి.రాత్రిపూట టీ, కాఫీ మానుకోండి. తేలికపాటి భోజనం చేయండి.పగటిపూట కనీసం 30 నిమిషాల నడక లేదా యోగా నిద్ర నాణ్యతను పెంచుతుంది.మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవడానికి లోతైన శ్వాస వ్యాయామాలు చేయండి. ప్రతి మనిషికి రోజుకు కనీసం 7 నుండి 8 గంటల× నాణ్యమైన నిద్ర అవసరం. నిద్ర సమస్యలు దీర్ఘకాలం కొనసాగితే, సొంత వైద్యం కాకుండా వెంటనే నిపుణులైన వైద్యుడిని సంప్రదించడం ఉత్తమం. గుర్తుంచుకోండి, మీరు ఇచ్చే విశ్రాంతే మీ రేపటి ఆరోగ్యానికి పెట్టుబడి!

# బ్యూటీ సీక్రెట్ రివీల్ చేసిన సానియా మీర్జా

ఆమె రాకెట్ పట్టి కోర్టులోకి దిగిందంటే ప్రత్యర్థులకు వణుకు పుట్టాల్సిందే. భారత టెన్నిస్ క్వీన్‌గా అంతర్జాతీయ వేదికలపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసిన ఆ ధ్రువతార.. ఆట నుంచి విరామం తీసుకున్నా తన ఫిజిక్, గ్లామర్ విషయంలో మాత్రం ఏమాత్రం తగ్గడం లేదు. సాధారణంగా క్రీడాకారులు రిటైర్మెంట్ తర్వాత ఫిట్‌నెస్‌ను పక్కన పెడతారు. కానీ ఈ టెన్నిస్ సెన్సేషన్ మాత్రం మునుపటి కంటే ఇప్పుడు మరింత కాంతివంతంగా, అత్యంత ఆకర్షణీయంగా కనిపిస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఒక బిడ్డకు తల్లిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే, తన బిజీ షెడ్యూల్‌లో ఇంత పర్ఫెక్ట్‌గా ఎలా మెయింటైన్ చేస్తోంది? తన గ్లోయింగ్ స్కిన్ వెనుక ఉన్న పది రకాల కోరియన్ పద్ధతులు ఏంటి? చర్మం, జుట్టు కోసం ఆమె ఉపయోగిస్తున్న ఆ వింత 'రెడ్ లైట్ థెరపీ' విశేషాలేంటి? టెన్నిస్ స్టార్ సానియా మీర్జా స్వయంగా వెల్లడించిన తన లేటెస్ట్ హెల్త్ అండ్ బ్యూటీ డైరీ ఇప్పుడొక సెన్సేషన్‌గా మారింది. సానియా మీర్జా తన రోజును భారీ బ్రేక్ ఫాస్ట్ తో కాకుండా ఒక 'హెల్తీ షాట్' తో ప్రారంభిస్తుంది. పసుపు, తేనె, నిమ్మరసం, అల్లం, కొన్ని నల్ల గింజలు (బ్లాక్ సీడ్స్) కలిపి తీసుకుంటుంది. "ఇది తాగడానికి అస్సలు రుచిగా ఉండదు కానీ శరీరానికి మాత్రం చాలా మేలు చేస్తుంది" అని సానియా పేర్కొంది. దీని తర్వాత నీటిలో నానబెట్టిన చియా విత్తనాలు, కాఫీ తీసుకుని జిమ్ కు వెళ్తుంది. ఉదయం పూట 3 నుంచి 4 కోడిగుడ్ల తెల్లసొన తీసుకోవడం ఆమెకు అలవాటు. టెన్నిస్ ఆడుతున్నప్పుడు తన డైట్ ఎలా ఉండేదో, ఇప్పుడు ఎలా ఉందో సానియా వివరించింది. "మునుపు ఆట కోసం నేను కార్బోహైడ్రేట్లు ఎక్కువగా తీసుకునేదాన్ని. ఇడ్లీలు, దోశలు ఇలా ప్రతిదీ తినేదాన్ని. కానీ ఇప్పుడు నా శారీరక శ్రమ 20 శాతానికి



పడిపోయింది. అందుకే ఇప్పుడు కార్బోహైడ్రేట్లు తగ్గించి ప్రోటీన్ ఫుడ్ కే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాను" అని సానియా చెప్పింది. ఇప్పుడు న్యూట్రిషనిస్టులు లేకపోయినా, తనే స్వయంగా తన ప్రోటీన్ ఇన్ టేక్ ను పర్యవేక్షించుకుంటోంది. సానియా వర్కవుట్ లో ఇప్పుడు వెయిట్ ట్రైనింగ్ తో పాటు అవుట్‌డోర్ రన్నింగ్ కు ప్రాధాన్యత ఇస్తోంది. సమయం తక్కువగా ఉండటం వల్ల పైలేట్స్ వంటి పద్ధతులను పక్కన పెట్టింది. వాతావరణం బాగున్నప్పుడు రోజుకు 5 నుంచి 7 కిలోమీటర్ల వరకు రన్నింగ్ చేయడం ఆమెకు ఇష్టం. ఈ జిమ్ ట్రైనింగ్, అవుట్‌డోర్ కార్డియో కలయిక వల్ల తన శరీరం దృఢంగా ఉండటమే కాకుండా ఎంతో ఉత్సాహంగా ఉంటుందని ఆమె నమ్ముతోంది. సానియా మీర్జా తన అందం కోసం ఎంతో శ్రద్ధ తీసుకుంటోంది. "నేను ఉదయం 10 రకాలు, రాత్రి 10 రకాల కోరియన్ స్కిన్ కేర్ పద్ధతులను పాటిస్తాను. ఇది కొంచెం వింతగా అనిపించినా నా స్కిన్ కి మాత్రం అద్భుతంగా పనిచేస్తోంది" అని ఆమె నవ్వుతూ చెప్పింది. అయితే ఇందులో మాయిశ్చరైజర్, సన్‌స్క్రీన్ అనేవి తన ఫేవరెట్ అని, ఇవి గేమ్ చేంజర్స్ అని సానియా అభిప్రాయపడింది. గడిచిన ఏడాది కాలంగా సానియా 'రెడ్ లైట్ థెరపీ'ని తన దినచర్యలో చేర్చుకుంది. ఇది కేవలం చర్మం కోసమే కాకుండా జుట్టు పెరుగుదలకు కూడా ఎంతో సహాయపడుతుందని ఆమె వెల్లడించింది. రోజు మార్చి రోజు అరగంట పాటు ఈ థెరపీ కింద కూర్చోవడం వల్ల చర్మం రీజువినేట్ అవుతుందని, ఎంతో కాంతివంతంగా మారుతుందని సానియా తన అనుభవాన్ని పంచుకుంది. సానియా మీర్జా ప్రయాణం చూస్తుంటే.. క్రమశిక్షణ అనేది కేవలం ఆటలోనే కాదు, జీవితంలోనూ ముఖ్యమని అర్థమవుతుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా తన ఆహారపు అలవాట్లను, వ్యాయామ పద్ధతులను మార్చుకుంటూ ఆమె అందరినీ ఇన్‌స్పైర్ చేస్తోంది.

## ఇంట్లో టైల్స్ తళతళలాడాలంటే..




ఇంటిని శుభ్రంగా ఉంచుకోవాలంటే ప్రతిరోజూ నేలను ఊడ్చి, తడి గుడ్డతో తుడవాల్సి ఉంటుంది. లేకపోతే సూక్ష్మక్రిములు నేలపై స్థిరపడటమే కాకుండా, మరకలు ధూళి కారణంగా టైల్స్, గ్రానైట్ అందం కూడా దెబ్బతింటుంది. రోజురోజుకీ వాటి మెరుపుతగ్గి మరకలు పేరుకుపోతాయి. అందుకే ప్రతిరోజూ నేలను తుడుచుకోవాలి. ఇంటిని శుభ్రంగా ఉంచుకోవడం చాలా ముఖ్యం. అందుకు ప్రతిరోజూ నేలను ఊడ్చి, తడి గుడ్డతో తుడవాల్సి ఉంటుంది. లేకపోతే సూక్ష్మక్రిములు నేలపై స్థిరపడటమే కాకుండా, మరకలు ధూళి కారణంగా టైల్స్, గ్రానైట్ అందం కూడా దెబ్బతింటుంది. రోజురోజుకీ వాటి మెరుపుతగ్గి మరకలు పేరుకుపోతాయి. అందుకే ప్రతిరోజూ నేలను తుడుచుకోవాలి. అయితే ఒక్కోసారి ప్రతిరోజూ క్రమం తప్పకుండా ఫ్లోర్ తుడిచినా కూడా టైల్స్‌పై అంటుకున్న మరకలు పోవడం లేదని చాలా మంది ఫిర్యాదు చేస్తుంటారు. ఇటువంటి పరిస్థితిలో ఖరీదైన క్లీనర్‌లను ఉపయోగించే బదులు ఇంట్లో లభించే ఈ చిన్న చిన్న వస్తువులతో ఇంటిని నిమిషాల్లోనే తళతళలాడించేయొచ్చు.నేల తుడుచుకోవడానికి ఉపయోగించే నీటిలో ఒక టీస్పూన్ రాక్ సాల్ట్, షాంపూ కలపండి. షాంపూకు బదులుగా లిక్విడ్ హ్యాండ్ వాష్ కూడా ఉపయోగించవచ్చు. ఇది నేలపై మరకలు, దుర్వాసనలను సులభంగా తొలగిస్తుంది. పైగా ఫ్లోర్ శుభ్రమై మెరుపును పెంచడానికి సహాయపడుతుంది. ఇలా వారానికి రెండుసార్లు చేయడం వల్ల టైల్స్ పసుపు రంగులోకి మారకుండా నిరోధించవచ్చు. నేలపై పాత మొండి మరకలను తొలగించడానికి.. కప్పులో కొంచెం నీళ్లు, బేకింగ్ సోడా కలిపి మందపాటి పేస్ట్ తయారు చేయాలి. ఈ పేస్ట్‌ను మరకలు ఉన్న ప్రదేశంలో అప్లై చేయాలి. 15-20 నిమిషాలు అలాగే ఉంచి ఆ తరువాత తడి గుడ్డతో స్క్రబ్ చేయాలి. ఇది మరకలను సులభంగా తొలగిస్తుంది. గోరువెచ్చని నీటితో నేలను తుడుచుకోవడం వల్ల పేరుకుపోయిన దుమ్ము త్వరగా తొలగిపోయి నేల శుభ్రంగా కనిపిస్తుంది. ఈ పద్ధతి రోజువారీ శుభ్రపరచడానికి మంచిది. కావాలనుకుంటే ఈ నీటిలో కొన్ని చుక్కల నిమ్మరసం కూడా జోడించవచ్చు. ఇది తేలికపాటి తాజా సువాసనను ఇస్తుంది.వెనిగర్ ఓ సహజ క్లీనర్. నేలను తుడుచుకోవడానికి నీటితో ఇది కలిపి శుభ్రం చేయడం వల్ల మరకలు, ధూళి సులభంగా తొలగిపోతాయి. ఇది టైల్స్, పాలరాయిపై మరకల తొలగింపుకు చాలా ప్రభావవంతంగా పని చేస్తుంది.

## టూత్ బ్రష్‌లు బాత్‌రూమ్‌లోనే ఉంచుతున్నారా?



మనం రోజూ వాడే టూత్‌బ్రష్ లక్షల కొద్దీ సూక్ష్మజీవులకు నివాసంగా ఉంటుందని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. టూత్‌బ్రష్‌పై 10 లక్షల నుంచి కోటికి పైగా బ్యాక్టీరియా, వివిధ రకాల సిలింద్రాలు, అలాగే లెక్కలేనన్ని వైరస్‌లు ఆశ్రయం పొందే అవకాశం ఉందని ఎండీపీఐ వెబ్‌సైట్‌లో ప్రచురితమైన ఒక కథనం పేర్కొంది. ఈ సూక్ష్మజీవులు బ్రష్‌ను వాడే వారి నోరు, వారి చర్మం, దాన్ని పెట్టే చోటు వంటి మార్గాల ద్వారా వస్తాయని జర్మనీలోని రైన్-వాల్ యూనివర్సిటీ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్ మైక్రోబయాలజిస్ట్ మార్క్ కెవిన్ జిన్ వివరించారు. కొత్త బ్రష్‌పై కూడా పెద్ద సంఖ్యలో సూక్ష్మజీవులు ఉండొచ్చని బ్రెజిల్‌లో నిర్వహించిన అధ్యయనం తేల్చింది. అయితే, ఈ సూక్ష్మజీవులలో చాలావరకు ప్రమాదకరం కావు. రోథియా డెనోకారియోసా, స్ట్రెప్టోకోకసీ మిటిస్, ఆక్టినోమైసెస్ కుటుంబానికి చెందిన బ్యాక్టీరియాలు దంతక్షయం కలిగించే సూక్ష్మజీవుల నుంచి రక్షించడంలో సహాయపడతాయి. అయినప్పటికీ స్ట్రెప్టోకోక్సీ, స్టాఫైలోకోకి వంటివి దంతక్షయానికి, చిగుళ్ల వాపుకు కారణమవుతాయని బ్రెజిల్‌లోని యూనివర్సిటీ ఆఫ్ సావోపాలో డెంటిస్ట్రీ ప్రొఫెసర్ వినిషియస్ పెడ్రాజీ పేర్కొన్నారు. ఎశ్చరీషియా కోలి, సూడోమోనాస్ ఎరుగినోసా, ఎంటరోబాక్టీరియాసియే వంటి హానికారక బ్యాక్టీరియా, సిలింద్రాలను కూడా టూత్‌బ్రష్‌లపై కనుగొన్నారు. ఇవి పొట్టలో ఇన్ఫెక్షన్లు, ఫుడ్ పాయిజనింగ్‌కు దారితీయవచ్చు. బాత్రూంలో ఉండే వెచ్చని, తేమతో కూడిన వాతావరణం సూక్ష్మజీవుల వృద్ధికి అనుకూలం. టాయిలెట్ ఫ్లష్ చేసిన ప్రతిసారి మలం, నీళ్లు కలిసిన చిన్న నీటి బిందువులు (ఏరోసోల్స్) గాలిలో దాదాపు 1.5 మీటర్ల వరకు వ్యాప్తిస్తాయి. ఈ ఏరోసోల్స్ బ్యాక్టీరియా, ఫ్లూ, కోవిడ్-19, నోరోవైరస్ వంటి వైరస్‌లను కలిగి ఉండవచ్చని జిన్ హెచ్చరించారు. టూత్‌బ్రష్ టాయిలెట్‌కు దగ్గరగా ఉంటే, ఈ వైరస్‌లు బ్రిసిల్స్‌పై పేరుకుపోయే అవకాశం ఉంది. ఫ్లష్ చేసేటప్పుడు టాయిలెట్ సీటును మూసి ఉంచడం మంచిది. అయితే, ఈ నీటి బిందువులు అంత ఆందోళనకరం కాకపోవచ్చని నార్త్‌వెస్టర్న్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎరికా హర్ట్‌మన్ అభిప్రాయపడ్డారు. గాలిలోకి విడుదలయ్యాక అనేక గట్-సంబంధిత సూక్ష్మజీవులు ఎక్కువ కాలం జీవించలేవని ఆమె వివరించారు. అయినప్పటికీ ఇన్ఫ్లుఎంజా, కరోనా వైరస్‌లు టూత్‌బ్రష్‌లపై కొన్ని గంటల పాటు, హెర్పెస్ సింప్లెక్స్ వైరస్-1 వంటివి 48 గంటల వరకు సజీవంగా ఉండగలవని కొన్ని అధ్యయనాలు తెలిపాయి. రోగనిరోధక వ్యవస్థ బలహీనంగా ఉన్నవారికి ఇది కొంచెం ఆందోళన కలిగించే అంశమని జిన్ చెప్పారు. టూత్‌బ్రష్ శుభ్రతకు కొన్ని చిట్కాలు పాటించవచ్చు. బ్రష్‌ను ఉపయోగించిన తర్వాత దానిని గాలికి ఆరేలా పెడితే సూక్ష్మజీవులు తగ్గుతాయి. దంతక్షయానికి కారణమయ్యే స్ట్రెప్టోకోకస్ మ్యూటన్స్ వంటి బ్యాక్టీరియా బ్రష్ బ్రిసిల్స్‌పై ఎనిమిది గంటల వరకు ఉండి, 12 గంటల తర్వాత చనిపోవడం మొదలవుతుంది. అమెరికన్ డెంటల్ అసోసియేషన్, జూ సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ వంటి సంస్థలు టూత్‌బ్రష్ హెడ్‌లను కవర్ చేయవద్దని లేదా మూసి ఉంచిన కంటైనర్లలో ఉంచవద్దని సూచిస్తున్నాయి. టూత్‌పేస్టులు సూక్ష్మజీవుల పెరుగుదలను తగ్గించడంలో సహాయపడతాయి. 1% వెనిగర్ ద్రావణంలో లేదా యాంటీసెప్టిక్ మౌత్‌వాష్ (0.12% క్లోర్‌హెక్సిడైన్ లేదా 0.05% సెటిల్‌పైరిడీనియం క్లోరైడ్)లో బ్రష్ హెడ్‌ను 10 నిమిషాల పాటు ఉంచడం ద్వారా బ్యాక్టీరియా సంఖ్య గణనీయంగా తగ్గుతుందని పెడ్రాజీ సూచిస్తున్నారు. పాత, అరిగిపోయిన బ్రిసిల్స్ తేమ, పోషకాలను ఎక్కువసేపు నిల్వ ఉంచి బ్యాక్టీరియా వృద్ధికి తోడ్పడతాయి. అందుకే వైద్య సంస్థలు ప్రతి మూడు నెలలకొకసారి టూత్‌బ్రష్‌లను మార్చాలని సిఫార్సు చేస్తున్నాయి. భవిష్యత్తులో ప్రోబయోటిక్ పూతలు లేదా బయోయాక్టివ్ బ్రిసిల్స్ వంటివి టూత్‌బ్రష్‌లపై ఆరోగ్యకరమైన సూక్ష్మజీవుల సమతుల్యతను కాపాడటానికి ఉపయోగపడవచ్చని జిన్ పేర్కొన్నారు. అయితే దీనిపై ఇంకా చాలా పరిశోధన జరగాల్సి ఉంది.

# లెఫ్ట్‌హ్యాండ్ బ్యాటర్లతోనే భారత్‌కి సమస్య.. అసిస్టెంట్ కోచ్ ఆసక్తికర వ్యాఖ్యలు..



**హైదరాబాద్ పెన్ పవర్:** దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20 వరల్డ్ కప్ 2026 సూపర్-8 తొలి మ్యాచ్‌లో భారత్ ఘోరంగా ఓడింది. ఈ ఓటమి తర్వాత టీమిండియా అసిస్టెంట్ కోచ్ రయాన్ టెన్ డోషాటే కీలక వ్యాఖ్యలు చేశారు. జట్టు టాప్ ఆర్డర్‌లో ఒక రైట్‌హ్యాండ్ బ్యాటర్ అవసరం ఉంది, ముఖ్యంగా సంజూ శాంసన్‌ను జట్టులోకి తీసుకోవాలా? అనే అంశంపై రాబోయే రోజుల్లో చర్చ జరుగుతుందని పేర్కొన్నారు. టీమిండియా అసిస్టెంట్ కోచ్ రయాన్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు మేము ఆడిన చాలా మ్యాచ్‌ల్లో ప్రత్యర్థులు పార్ట్‌టైమ్ ఆఫ్ స్పిన్‌తోనే తొలి వికెట్ తీసుకుంటున్నారు. దాదాపు ప్రతిసారి జీరోకే వికెట్లు కోల్పోతున్నాం.. దీంతో మిడిల్ ఆర్డర్‌పై ఒత్తిడి పెరుగుతోంది అని అన్నారు. సంజూ శాంసన్ రైట్‌హ్యాండ్ బ్యాటర్ కావడం జట్టుకు వ్యూహాత్మకంగా ఉపయోగపడుతుందని తెలిపారు. కానీ అతడి ఫామ్ కూడా పెద్దగా బాగోలేదని చెప్పుకొచ్చారు. 2025 నుంచి ఇప్పటివరకు సంజూ 17 ఇన్నింగ్స్‌ల్లో కేవలం 290 రన్స్ మాత్రమే చేయడం గమనార్హం. గత 18 నెలలుగా జట్టుకు సేవలందిస్తున్న ఆటగాళ్లనే కొనసాగించాలా?.. లేక రైట్‌హ్యాండ్ బ్యాటర్ అవసరం కోసం సంజూను తీసుకురావాలా? అన్నదే మా ముందున్న ప్రశ్న.. దీనిపై చర్చ జరుగుతుంది అని రయాన్ వెల్లడించారు. అభిషేక్ శర్మ ఫామ్ లేకపోవడానికి ఫుడ్ పాయిజనింగ్ కూడా ఒక కారణమని భారత జట్టు అసిస్టెంట్ కోచ్ రయాన్ తెలిపారు. ఆ కారణంగా అతడు బరువు తగ్గాడని, పూర్తిగా సిద్ధం కావడంలో ఇబ్బంది పడ్డాడని పేర్కొన్నారు. మూడు మ్యాచులలో డకౌట్లు ఆటగాడిపై మానసికంగా ప్రభావం చూపుతాయి.. నెట్స్‌లో మాత్రం అతడు మంచి ప్రదర్శన చూపించాడు. అభిషేక్ ని మళ్లీ ఫామ్‌లోకి తీసుకురావడం మా బాధ్యత అన్నారు. ఇక ఫినిషర్‌గా ఆడుతున్న రింకూ సింగ్‌కు పెద్దగా అవకాశాలు దక్కడం లేదు, ఆ స్థానం చాలా కఠినమైనదని చెప్పారు. అయినా ఆ పాత్రకు
న్యాయం చేస్తారని తెలిపారు. ఇప్పుడు మాటల కన్నా పని తనం ముఖ్యం అని రయాన్ పేర్కొన్నారు. జట్టు మొత్తం కలిసి కష్టపడాలి.. జింబాబ్వేతో వచ్చే కీలక మ్యాచ్‌కు ముందు మేము మళ్లీ సమీకరించుకుని మెరుగైన ప్రదర్శన ఇవ్వాలని రయాన్ టెన్ డోషాటే అన్నారు. దక్షిణాఫ్రికాతో ఓటమి తర్వాత భారత్ టాప్ ఆర్డర్ కాంబినేషన్, అభిషేక్ శర్మ ఫామ్, సంజూ శాంసన్ ఎంపిక లాంటి అంశాలు టీమ్ మేనేజ్మెంట్ ముందున్న ప్రధాన సవాళ్లుగా మారిపోయాయి.

**లెఫ్ట్‌హ్యాండ్ బ్యాటర్లు:**

**అభిషేక్ శర్మ**
**తిలక్ వర్మ**
**శివం దూబే**
**అక్షర్ పటేల్**
**రింకూ సింగ్**
**వాషింగ్టన్ సుందర్**

# ఈగోను వదిలి పెట్టి.. జింబాబ్వే మ్యాచ్‌కి ఈ ఒక్క మార్పుతో వెళ్లండి



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 వరల్డ్ కప్ 2026 సూపర్-8 దశలో దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో భారత్ అనుసరించిన విధానంపై క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిస్థితులకు తగ్గట్టు ఆడకుండా, టీమిండియా ఓవర్ యాక్షన్ చేసిందని విమర్శించారు. ఆటగాళ్లు తమ అహంకారాన్ని (ఈగోను) పక్కన పెట్టి ఆడాలని స్పష్టం చేశారు. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో 188 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు దిగిన భారత్ కేవలం 111 పరుగులకే ఆలౌట్ అయి, 76 పరుగుల తేడాతో ఘోర ఓటమిని చవిచూసింది గవాస్కర్ అన్నారు. దక్షిణాఫ్రికా ఎలా బ్యాటింగ్ చేసిందో భారత్ గమనించలేదు.. ప్రతి బంతికి బౌండరీ కొట్టాలనే ఉద్దేశంతో బ్యాట్ ఊపారని సునీల్ గవాస్కర్ తెలిపారు. పవర్‌ప్లేలోనే భారత్ టాప్-3 బ్యాట్స్‌మెన్ అవుట్ కావడం (26/3) జట్టును వెనక్కి నెట్టిందన్నారు. మిడిల్ ఓవర్లలో బ్యాటింగ్ చేసిన తిలక్ వర్మ ఆటతీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. అవసరమైన రన్‌రేట్ సుమారు 9.5 మాత్రమే, 15 కాదు.. పవర్‌ప్లేలో 55--60 పరుగులు చేసినా సరిపోతుంది అని అన్నారు. కానీ తొందర పాటు నిర్ణయాలు భారత్ పతనానికి కారణమయ్యాయని సునీల్ స్పష్టం చేశారు. ఈ మ్యాచ్‌తో ఐసీసీ టోర్నీల్లో భారత్ విజయాల పరంపరకు తెరపడింది. దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 187/7 పరుగులు చేయగా, డేవిడ్ మిల్లర్ హాఫ్ సెంచరీతో చెలరేగాడు. భారత్ తరఫున శివమ్ దూబే మాత్రమే కొంత పోరాటం చేయగా, మిగతా బ్యాట్స్‌మెన్ దారుణంగా విఫలమయ్యారు. ఫలితంగా టీ20 వరల్డ్ కప్‌ల్లో భారత్‌కు పరుగుల పరంగా అతిపెద్ద ఓటమిగా నిలిచింది.

# సెమీస్‌కి చేరేందుకు భారత్ కంటే పాకిస్తాన్‌కే ఎక్కువ ఛాన్స్!





**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 వరల్డ్ కప్ సూపర్ 8కి చేరుకున్న పాకిస్తాన్ కు కొత్త టెన్షన్ పట్టుకుంది. వర్షం కారణంగా న్యూజిలాండ్ తో జరగాల్సిన మ్యాచ్ రద్దు కావడంతో పాక్ జట్టు సెమీ ఫైనల్ వెళ్లడం కొంచెం కష్టమైంది. సూపర్ 8లో భాగంగా జరిగే ప్రతి మ్యాచ్ లో జట్లు అన్ని గెలవాల్సిన పరిస్థితి నెలకొంది. కానీ వర్షంతో న్యూజిలాండ్, పాకిస్తాన్ మధ్య జరగాల్సిన మొదటి మ్యాచ్ రద్దు అయింది. దీంతో రెండు జట్లకు తలో పాయింట్ వచ్చింది. ఇప్పుడు పాక్ మరో రెండు మ్యాచ్ లు ఆడాల్సి ఉంది. ఇందులో కచ్చితంగా రెండు గెలిస్తేనే, సెమీ ఫైనల్ కి వెళ్తుంది. లేకపోతే పాకిస్తాన్ కూడా బ్యాగులు సర్దుకొని లాహోర్ వెళ్లిపోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ఇదే విషయం ఇప్పుడు దాయాది జట్టును కలవర పెడుతోంది.

**సెమీస్ చేరాలంటే ఏం చేయాలి ?:**

పాకిస్తాన్ సెమీ ఫైనల్ వెళ్లే అవకాశాలు కేవలం 50 శాతం మాత్రమే ఉన్నాయి. సూపర్ 8లో మిగిలిన రెండు మ్యాచ్ ల్లో పాక్ కచ్చితంగా గెలవాల్సిన పరిస్థితి నెలకొంది. అప్పుడే సెమీస్ కి ఈజీగా వెళ్తుంది.. లేదంటే, ఒక మ్యాచ్ లో భారీ స్కోర్ తేడాతో గెలవాలి.. అయినప్పటికీ మిగిలిన జట్ల ఫలితాల ఆధారంగా దాయాది టీం సెమీ ఫైనల్ వెళ్లే అవకాశాలు ఉంటాయి. అంటే పాకిస్తాన్ సెమీస్ కి వెళ్లడం కొంత మేర కష్టమే..
శ్రీలంక, ఇంగ్లాండ్ వంటి జట్లతో మరో రెండు మ్యాచులను పాకిస్తాన్ ఆడాల్సి ఉంది. శ్రీలంక ఎలాగూ అతిథ్య జట్టు కాబట్టి, వాళ్లకు అడ్వాంటేజ్ ఎక్కువగా ఉంటుంది. ఇటు ద
ఇంగ్లాండ్ కూడా చాలా స్ట్రాంగ్ టీం.. ఆ రెండిటిని పాక్ కొట్టడం అంటే, చాలా కష్టమేనని అంటున్నారు. దీంతో పాకిస్తాన్ అభిమానులు టెన్షన్ పడుతున్నారు. మరోవైపు, భారత జట్టు 76 పరుగుల తేడాతో సౌతాఫ్రికా చేతిలో దారుణంగా ఓడిపోయింది. దీంతో సూర్యసేన కంటే పాకిస్తాన్ కొంత మెరుగైన స్థితిలో ఉందని చెప్పాలి.

**ఆకాశ రంజన్ కపూర్ అబ్బురపరిచే పూసల గౌనులో తల తిప్పింది**



# ప్రభాస్ మళ్లీనా?... తప్పేముంది?



భారీ అంచనాలతో తెరకెక్కే స్టార్ హీరోల సినిమాలకు ప్రేక్షకుల్లో ఎక్స్పెక్టేషన్స్ ఎలా ఉంటాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదేమో. టీజర్, ట్రైలర్ నుంచి రిలీజ్ వరకు హైప్ పెరిగిపోతుంది. అయితే ఆ అంచనాలకు సరిపడా కంటెంట్ లేకపోతే ఫలితం మాత్రం ఎవరూ ఊహించలేం. ఇటీవల పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన ది రాజా సాబ్ విషయంలో అదే జరిగింది.

హారర్ థ్రిల్లర్ జోనర్ లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆ చిత్రం ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయిందన్న అభిప్రాయం వ్యక్తమైంది. స్టోరీ, స్క్రిప్టింగ్, టెక్నికల్ ఎలిమెంట్స్ కు మిక్స్ టాక్ రావడంతో బాక్సాఫీస్ వద్ద కూడా ప్రభావం పడింది. దీంతో అభిమానుల్లో కొంత నిరాశ నెలకొంది. ముఖ్యంగా సోషల్ మీడియాలో దర్శకుడు మారుతి, నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై విమర్శలు వినిపించాయి. అయితే సినీ ఇండస్ట్రీలో సక్సెస్లు, ఫ్లాప్లు సహజమే. ఎంత పెద్ద బ్యానర్ అయినా, ఎంత స్టార్ హీరో అయినా ప్రతి సినిమా హిట్ అవుతుందనే గ్యారంటీ ఉండదు. మంచి ఉద్దేశంతో తీసిన ప్రాజెక్ట్ కూడా కొన్నిసార్లు ప్రేక్షకులకు నచ్చకపోవచ్చు. కావాలనే ఎవరూ ఫ్లాప్ సినిమా తీయరు. ఇది ఇండస్ట్రీలో అందరికీ తెలిసిన నిజం. ఇలాంటి సమయంలో ప్రభాస్ మళ్లీ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ తో పని చేయనున్నారని వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. నిర్మాత విశ్వప్రసాద్ తో మరో ప్రాజెక్ట్ చేసే అవకాశం ఉందన్న ప్రచారం సాగుతోంది. దీంతో కొందరు గత సినిమా రాజా సాబ్ రిజల్ట్ ను దృష్టిలో పెట్టుకుని మళ్ళీ అవసరమా అంటున్నా, మరికొందరు మాత్రం దీనిని పాజిటివ్ గా చూస్తున్నారు. ఎందుకంటే ఒకసారి కలిసి పనిచేసిన టీమ్ మళ్లీ కలిసి వస్తే గత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకునే అవకాశం ఉంటుంది. ఎక్కడ తప్పు జరిగిందో తెలుసుకుని ఈసారి మరింత జాగ్రత్తగా ప్లాన్ చేసుకోవచ్చు.

సరైన కథ, స్ట్రాంగ్ స్క్రీన్ ప్లే, రిచ్ టెక్నికల్ వాల్యూస్ ఉంటే అదే కాంబినేషన్ సూపర్ హిట్ కూడా ఇవ్వగలదు. ప్రభాస్ కెరీర్ ను పరిశీలిస్తే ప్రయోగాలకు ఎప్పుడూ వెనుకాడరు. కొత్త కొత్త దర్శకులు, కొత్త కథలతో ముందుకు రావడం ఆయన స్పెషాలిటీ. ఒక సినిమా ఫలితం చూసి రిలేషన్స్ తెంచుకోవడం కంటే మరోసారి ప్రయత్నించడం కూడా ప్రొఫెషనలిజం భాగమే అని అంతా చెబుతున్నారు. ఇక ప్రభాస్ ప్రస్తుతం ఫౌజీ, స్పిరిట్, కల్కి 2, సలార్ 2 వంటి భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. దీంతో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై మరో మూవీ ఎప్పుడు చేయనున్నారన్నది ఆసక్తికరం. ఏదేమైనా ఒక్క సినిమా రిజల్ట్ తో ఏ కాంబినేషన్ ను తక్కువగా అంచనా వేయడం సరికాదు. కంటెంట్ స్ట్రాంగ్ గా ఉంటే ఏ బ్యానర్ అయినా, ఎలాంటి కాంబో అయినా సక్సెస్ సాధించగలదు. మరి పీపుల్ సంస్థతో నిజంగా ప్రభాస్ మరో మూవీ ఉంటుందో లేదో వేచి చూడాలి.

**ఒకే ఫ్రేమ్‌లో శాన్వి శ్రీవాస్తవ గోల్డెన్ గ్రేస్**



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965